

## నగరానికి భారీ వర్ష సూచన

హైదరాబాద్, జులై 26: హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తుంది. మరో గంట వ్యవధిలో నగరానికి భారీ వర్షం సూచన ఉన్నట్లుగా సమాచారం. భారీ వర్షం దృష్ట్యా జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిశోర్ అత్యవసర సహాయక బృందాలను అప్రమత్తం చేశారు


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 27-7-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :25 సంచిక: 264 పేజీలు 8 వెల: రూ.1/-


## రాజకీయం ఆగిపోయింది.. అభివృద్ధి మొదలైంది: మంత్రి జగదీష్ రెడ్డి



సూర్యాపేట, జులై 26: సూర్యాపేట పట్టణంలో గడిచిన ఐదు సంవత్సరాలుగా రాజకీయం ఆగిపోయి అభివృద్ధి మొదలైందని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. కొట్లాటలతో, రాజకీయ పంచాయతీ లతో అభివృద్ధి జరగదన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూసే విపక్ష పార్టీల నేతలు గులాబీ గూటికి బారులు తీరుతున్నారన్నారు.

సీనియర్ కాంగ్రెస్ నేత జహీర్, బీజేపీ సీనియర్ నేత సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు రామగిరి నగేష్ లు అనుచరులతో శుక్రవారం ఉదయం మంత్రి జగదీష్ రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం జరిగిన బహిరంగ సభల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు..

2014తో పాటు 2018 ఎన్నికలలో తన గెలుపులో పట్టణ మహిళలు కీలకపాత్ర పోషించారన్నారు. వారు పెట్టిన బాధ్యతను దృష్టిలో పెట్టుకుని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిపై దృష్టి సారించినట్లు తెలిపారు. సద్దుల చెరువు, పుల్లారెడ్డి చెరువులు మినీ ట్యాంక్ బండ్ లుగా రూపాంతరం చెందుతున్నాయన్నారు. ఇకపై బోటింగ్ కు ఎక్కడికో పోవాల్సిన అవసరం పట్టణ ప్రజలకు ఉండబోదన్నారు. ఉండ్రుగొండ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ అనివార్యం అన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుతో మరో 20 వేల మంది జనం సూర్యాపేటకు వలస రానున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా రోడ్ల విస్తరణపై దృష్టి సారించినట్లు చెప్పారు.

### అజంఖాన్ వ్యాఖ్యలపై..

## లోక్ సభలో దుమారం..

న్యూఢిల్లీ, జులై26(ఆర్ఎన్ఎ): లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్‌పై సమాజ్‌వాది పార్టీ ఎంపీ అజంఖాన్ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేపింది. ఆయనపై మహిళ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఎంపీ అజంఖాన్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అజంఖాన్‌ల మహిళలను ఎవరూ కించపరుస్తూ మాట్లాడలేదని.. తక్షణం ఆయన క్షమాపణలు చెప్పాలని మహిళ ఎంపీలు డిమాండ్ చేశారు. అజంఖాన్ క్షమాపణలు చెప్పని పక్షంలో ఆయనను సస్పెండ్ చేయాలని బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు.

**- మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్**

**- ముక్తకంఠంతో ఖండించిన మహిళా ఎంపీలు**

**- క్షమాపణ చెప్పకుంటే సస్పెండ్ చేయాలని డిమాండ్**

గురువారం లోక్ సభలో ట్రిపుల్ తలాక్ బిల్లుపై జరిగిన చర్చలో ఎస్పీ ఎంపీ అజంఖాన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. లోక్ సభలో సభాధ్యక్ష స్థానంలో ఉన్న రమాదేవిని ఉద్దేశించి 'మీ కళ్లలో కళ్లు పెట్టి మాట్లాడాలని అనుకుంటున్నానని' అన్నారు. మరోవైపు సభాధ్యక్ష స్థానంలోకి తిరిగి వచ్చిన స్పీకర్ ఓం బిర్లా అజంఖాన్‌ను మందలించి క్షమాపణ చెప్పాలని సూచించారు. ఎంపీలు సయితం అజంఖాన్‌ను క్షమావణలు కోరడంతో అఖిలేష్ యాదవ్ తమ ఎంపీని సమర్థిస్తూ పార్లమెంట్‌లో బీజేపీ సభ్యుల భాషే అత్యంత అమర్యాదకరంగా ఉంటోందని ఆరోపించారు. ఇదిలా ఉండగా క్షమాపణలు చెప్పేది లేదని, తాను అన్ పార్లమెంటరీ పదాలు ఏమైనా ఉపయోగిస్తే రాజీనామా చేసేందుకు కూడా తాను సిద్ధమని అజంఖాన్ స్పష్టం చేశారు. కాగా శుక్రవారం లోక్‌సభ దద్దరిల్లింది. ఆజమ్‌ఖాన్ తక్షణమే క్షమాపణ చెప్పాలని లేదంటే ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మహిళా సభ్యులతో పాటు భాజపా ఎంపీలు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ మాట్లాడుతూ.. గురువారం లోక్‌సభలో ఏం జరిగిందో యావత్ దేశం చూసిందని, పనిచేసే ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా చూసేలా ఈ సభలో బిల్లును ఆమోదించామని అన్నారు. ఇప్పుడు ఇదే సభలో మహిళా ఎంపీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం గమనార్హమని, ఇక్కడ పార్టీలు ముఖ్యం కాదని, మహిళను అగౌరవపర్చకూడదని, దీనిపై గళమెత్తాల్సిన సమయం వచ్చిందన్నారు. దీన్ని మనం చూస్తూ ఊరుకోకూడదని, అభ్యంతరకరంగా మాట్లాడి వెళ్లిపోవడం సరికాదంటూ, ఇదే వ్యాఖ్యలు బయట చేస్తే పోలీసులు అరెస్టు చేసేవారని స్మృతి ఇరానీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మిమీ చక్రవర్తి మాట్లాడుతూ.. 'పార్లమెంట్‌లో నిలబడి ఎవరూ మహిళతో అభ్యంతరకరంగా వ్యాఖ్యలు చేయరని, దీనిపై మీరు కఠిన నిర్ణయం తీసుకుంటారని ఇక్కడున్న మహిళలందరం అనుకుంటున్నామని అన్నారు. కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పందిస్తూ.. ఆజమ్‌ఖాన్ క్షమాపణ చెప్పాలని లేదంటే ఆయనను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేయాలని భాజపా తరఫున డిమాండ్ చేశారు. అటు కాంగ్రెస్ కూడా ఆజమ్‌ఖాన్ వ్యాఖ్యలను ఖండించింది. మహిళలను అగౌరవపరచడాన్ని మా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, గతంలో సోనియాగాంధీపై కొందరు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు.

## పార్లమెంట్ ఆవరణలో..తెలంగాణ హరితహారం

### మొక్కలు నాటిన కేంద్ర మంత్రులు

### పాల్గొన్న తెలంగాణ ఎంపీలు

న్యూఢిల్లీ,జులై26(ఆర్ఎన్ఎ): ఢిల్లీ పార్లమెంట్ ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీతో పాటు కేంద్ర మంత్రులు, పలువురు ఎంపీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హరితహారంలో భాగంగా తెలంగాణకు చెందిన ఎంపీలు కూడా స్వయంగా మొక్కలు నాటారు. తెలంగాణ ఎంపీల ఆహ్వానం మేరకు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, కేంద్ర సమాచార, ప్రసార శాఖ, అడవులు, పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హర్ష వర్ధన్ లు మొక్కలు నాటారు. ఎంపీలు కేకే, సంతోష్ రావు, నామా నాగేశ్వరరావు, బండ ప్రకాశ్ ముదిరాజ్, ఎంపీ సుప్రియా సూలే, మరో ఎంపీ, నటి నమలతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణకు హరితహారంలో భాగంగా గత ఐదేళ్లుగా రాష్ట్రంలో పచ్చదనం పెంపునకు తీసుకుంటున్న చర్యలు, అర్బన్ ఫారెస్ట్ పార్కుల అభివృద్ధిని మంత్రులకు, ఇతర రాష్ట్రాలకు చెందిన సహచర ఎంపీలకు మన ఎంపీలు వివరించారు. హరితహారం కార్యక్రమం తనకు తెలుసునని, తెలంగాణ పర్యటనలో తాను స్వయంగా పాల్గొని మొక్కలు నాటిన విషయాన్ని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ గుర్తు చేసుకున్నారు. ఇక పచ్చదనం పెంపులో భాగంగా తాను స్వయంగా హైదరాబాద్ శివారులో కీసర రిజర్వ్ ఫారెస్ట్‌ను దత్తత తీసుకున్నట్లు, ఎంపీ లాడ్స్ నిధులతో అక్కడ ఎకో టూరిజంను కూడా అభివృద్ధి చేయనున్న విషయాన్ని రాజ్యసభ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ కేంద్రమంత్రులకు, ఎంపీలకు వివరించారు. మంచి ప్రయత్నమంటూ వారందరూ సంతోష్‌ను అభినందించారు.

## కార్గిల్ అమరవీరులకు ప్రధాని ఘననివాళి

### మొక్కలు నాటి స్ఫూర్తి నింపిన మోడీ

న్యూఢిల్లీ,జులై26(ఆర్ఎన్ఎ): 20ఏళ్ల క్రితం జరిగిన కార్గిల్ యుద్ధం గుర్తొస్తే ప్రపంచ దేశాలు ఇప్పటికీ ఉలిక్కిపడతాయి. 1999యుద్ధం ముగిసినా భారత్-పాక్‌ల గురించి చర్చకు వచ్చిన ప్రతిసారి ఆ నాటి రోజులు గుర్తుకొస్తూనే ఉంటాయి. ఆరని చిచ్చును రేపిన అప్పటి పరిస్థితులు దేశ భక్తుల గుండెల్లో నిలిచిపోయి ఉంటాయి. మంచుకొండల్లో.. గడ్డకట్టే చలిలోనూ దాదాపు 60 రోజుల పాటూ జరిగిన యుద్ధంలో ఇరు దేశాలు భారీగా సైనికులను కోల్పోయింది. పాక్ ఆక్రమించుకున్న భారత భూభాగాన్ని తిరిగి దక్కించుకునేందుకు చేసిన పోరాటంలో ఇండియాకే విజయం దక్కింది. జులై 26, 1999న సాధించిన విజయాన్ని కార్గిల్ విజయ్ దివస్‌గా ఏటా జరుపుకుంటాం. యుద్ధం సమయంలో మృతిచెందిన 20మంది అమరవీరులకు ప్రతీయేటా నివాళులర్పిస్తుంటాం. కార్గిల్ అమర వీరులకు నివాళి అర్పిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ ట్వీట్ చేశారు. అమర వీరుల త్యాగాలను యావత్ భారతం స్మరించుకుంటుదని చెప్పారు. ఆనాటి యుద్ధ సమయంలో తాను కార్గిల్ ప్రాంతంలో జవాన్లను కలిసిన ఫోటోలను మోడీ ట్వీట్ చేశారు. 1999లో తాను కశ్మీర్ ,హిమాచల్ ప్రదేశ్ పార్టీ వ్యవహారాలు చూస్తున్నానని చెప్పిన మోడీ.. యుద్ధం జరుగుతున్న సమయంలో కార్గిల్ వెళ్లి జవాన్లతో మాట్లాడిన ఘటన ఎప్పటికి మరిచిపోలేనిదన్నారు. వారి స్ఫూర్తిని స్మరిస్తూ పార్లమెంట్ ఆవరణలో ప్రధాని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ ఓంబిర్లా, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. కార్గిల్ ఆమరవీరులకు హోంశాఖ మంత్రి అమిత్ షా నివాళి అర్పించారు. భారత ఆర్మీ శక్తి పాటవాలకి, ధైర్యానికి కార్గిల్ యుద్ధం చిహ్నంగా నిలిచిందన్నారు. హోంశ్శాఖ సహాయమంత్రి కిషన్ రెడ్డి కూడా వార్ మెమోరియల్ వద్ద నివాళి అర్పించారు.

### కార్గిల్ యుద్ధవీరులకు వందనాలు - టీడీపీ అధినేత చంద్రబాబు

ఇవాళ దేశమంతా కార్గిల్ విజయోత్సవాన్ని గర్వంగా జరుపుకొంటోందని తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. ఈ విజయాన్నందించేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ప్రతి సైనికుడికీ నివాళులర్పించారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన భారత జవాన్ల అసమాన త్యాగాలను స్మరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మరోవైపు తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కార్గిల్ యుద్ధ వీరులకు నివాళులర్పించారు. పాకిస్తాన్ దురాక్రమణను సాహసోపేతంగా తిప్పికొట్టి దేశానికి కార్గిల్ యుద్ధ విజయాన్ని అందించిన ధీరులకు వందనాలు అంటూ ట్విటర్‌లో పోస్టు చేశారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ పదునైన భావుకునిగా....

పదవికి కీర్తిని దెచ్చు ప్రజ్ఞానిధిగా....

ముదమొసగు "రాష్ట్రపతి"గా....

విదుడుగు "అబ్దులు కలాము" విఖ్యాతి గాంచెన్!!

*( జులై 27 అబ్దులు కలాము పుణ్యతిథి...)*

-రాధశ్రీ

సెల్: 9494481210

## అనామిక కుటుంబానికి లక్ష సాయం

### అందచేసిన అఖిలపక్ష నేతలు

హైదరాబాద్,జూలై26(ఆర్ఎన్ఎ): ఇంటర్ ఫలితాల అవకతవకల వల్ల మృతి చెందిన కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయాన్ని అఖిలపక్ష నేతలు కోదండరాం, చాడ వెంకటరెడ్డి, రావుల చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు. ఇంటర్ విద్యార్థిని అనామిక కుటుంబానికి రూ.లక్ష చెక్కును అందించారు. ఇంటర్ బాధితులందరికీ న్యాయం చేయాలని ఈ సందర్భంగా నేతలు డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో వారు బాధిత కుటుంబానికి చెక్కు అందచేశారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి విద్యార్థుల మరణాలపై కించిత్ చింత కూడా లేదన్నారు. ఇంటర్ బోర్డు తప్పిదాల వల్ల పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. ఈ విషయంలో సిఎం కెఇసార్ స్పందించకపోవడం దారుణమని నేతలు అన్నారు.

వచ్చే వారంలో మరో రెండు, మూడు కుటుంబాలకు ఆర్థికసాయం అందజేస్తామని చెప్పారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వడంలేదని.. మమ్మల్ని కూడా ఇవ్వనివ్వడంలేదని ఆరోపించారు. ఈ ఘటనలపై ప్రజల్లో ఇప్పటికే చర్చ సాగుతోందని అన్నారు.

## కార్గిల్ అమరవీరులకు రాష్ట్రపతి కోవింద్ నివాళి

### ఈ దేశం ఎన్నటికీ వారిని మరువదని వ్యాఖ్య

### ప్రధాని మోడీ, రాజ్‌నాథ్ సింగ్‌ల ఘన నివాళి

### దేశవ్యాప్తంగా అమరులకు ఘనంగా నివాళి



న్యూఢిల్లీ,జూలై26(ఆర్ఎన్ఎ): కార్గిల్ అమరవీరుల త్యాగాలను భారత్ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ పేర్కొన్నారు. దేశం కోసం అమరులైన సైనికుల కుటుంబాలకు భారత్ ప్రభుత్వం, ప్రజలు ఎప్పుడూ అండగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధంలో భారత్ విజయం సాధించి శుక్రవారం నాటికి 20ఏళ్లు పూర్తయింది. కార్గిల్ విజయాన్ని పురస్కరించుకుని ప్రతియేడు జులై 26న కార్గిల్ దివస్‌ను జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కార్గిల్ యుద్ధ వీరులకు నివాళులు అర్పించారు. కార్గిల్ అమరవీరులకు ప్రధాని నరేంద్ర మోడీ సైతం నివాళులు అర్పించారు. 1999 కార్గిల్ యుద్ధం సందర్భంగా భారత సైనికులను కలిచి, వారికి సంఘీభావం తెలిపే అదృష్టం తనకు కలిగిందని ఆయన పేర్కొన్నారు. మాతృభూమి కోసం ప్రాణాలను అర్పించిన నాటి వీరులందరికీ వినయపూర్వక శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఢిల్లీలోని జాతీయ యుద్ధస్మారకం వద్ద దేశ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమరవీరులకు నివాళులర్పించారు. సైనిక ఉన్నతాధికారులు, పలువురు ప్రముఖులు సైతం స్మారకం వద్ద నివాళులు అర్పించారు. దేశ వ్యాప్తంగా శుక్రవారం సాయుధ బలగాలు కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు జరుపుకున్నారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణ త్యాగం చేసిన అమర జావాన్లకు సాయుధ బలగాలు నివాళులర్పింస్తున్నాయి. అమృత్ సర్‌లోని ఇండో- టబెటన్ బోర్డర్ పోలీస్ ప్రధాన కార్యలయంలో ఐటిబిపి జవాన్లు కార్గిల్ అమర వీరులకు ఘన నివాళులర్పించారు. శ్రీనగర్ లోని బిఎస్ఎఫ్ ప్రధాన కార్యలయంలో కూడా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 20 సంవత్సరాల క్రితం ఇదే రోజున పాకిస్థాన్ పాల్పడిన అరాచకాన్ని భారత సైన్యం తిప్పికొట్టింది. కశ్మీర్‌లోని కార్గిల్‌లోకి పాక్ సైన్యం చొరబడింది. దీంతో అప్రమత్తమైన భారత సైనికులు పెద్ద యుద్ధం చేసి వాళ్లను తరిమికొట్టి మన దేశ త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. ఆ చారిత్రాత్మక విజయాన్ని తలుచుకుంటూ ప్రతి ఏటా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు జరుపుకుంటున్నాం.

## అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి: మంత్రి కొప్పుల

హైదరాబాద్, జులై 26: సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. నగరంలోని బేగంపేటలోని హోటల్ ప్లాజాలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగం సాధించిన విద్యార్థులకు నేడు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం భుక్యా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు అవకాశాలు ఉపయోగించుకుని ఉద్యోగాలు సాధించుకోవడం అభినందనీయమన్నారు.

గత ప్రభుత్వాలు ఎస్సీలను పట్టించు కోలేదు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నార న్నారు. లచ్చిరాం భుక్యా మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 16కు పైగా కోర్సులలో శిక్షణ ఇప్పించి ఉద్యోగాలతో పాటు స్వయం ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం రాని ఎస్సీ విద్యార్థులకు ఫినిసింగ్ స్కూల్ ద్వారా జావా నెట్‌వర్కింగ్‌లో శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఎంపి ఆజంఖాన్ క్షమాపణలు చెప్పాల్సిందే: మాయావతి

హైదరాబాద్,జులై26 (ఆంఎన్ఎ): లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ రమాదేవిపై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అజం ఖాన్ చేసిన వ్యాఖ్యలపై బీఎస్‌పీ అధినేత్రి మాయావతి ఘాటుగా స్పందించారు. రమాదేవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎస్పీ ఎంపీ ఆజంఖాన్ క్షమాపణలు చెప్పాల్సిందే అని మాయావతి అన్నారు. ఇందులో మరో చర్చకు తావు లేదన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలతో మహిళలను కించపరిచడం సరికాదన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళల హుందాతనానికి ఆజం ప్రకటన వ్యతిరేకంగా ఉందన్నారు. ఆజం వ్యాఖ్యలు వేధిస్తున్నాయని మాయా అన్నారు. ఎంపీ ఆజం వ్యాఖ్యలను ఖండిస్తున్నామని.. లోక్‌సభకు , మహిళలందరికీ ఆయన క్షమాపణలు చెప్పాలని మాయా కోరారు. లేకుంటే ఆయన పట్ల ఉన్న గౌరవంకూడా పోంతుందన్నారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేసిన అజంఖాన్ క్షమాపణలు చెప్పితీరాలని అన్నారు. లోక్‌సభ ప్రిసైడింగ్ లేడీపై ఈ తరహా భాషను అజంఖాన్ వాడటం నేరం. మహిళల గౌరవం, హోదాకు భంగకరం. ఆయన వ్యవహరించిన తీరు గర్హనీయం. కేవలం పార్లమెంటుకే కాదు, మహిళలందరికీ అజంఖాన్ క్షమాపణలు చెప్పాలి' అని మాయావతి ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. జంఖాన్ వ్యాఖ్యలను శుక్రవారంనాడు లోక్‌సభలో పార్టీలకు అతీతంగా అంతా ఖండించారు. ఆయనపై చర్యకు డిమాండ్ చేశారు. దీనిపై ఏం చేయాలనేది త్వరలోనే నిర్ణయిస్తానని స్పీకర్ ఓం బిర్లా సభకు హామీ ఇచ్చారు. కాగా, రమాదేవి చాలా గౌరవనీయురాలని, తనకు సోదరి లాంటిదని అజంఖాన్ చెప్పారు. తాను క్షమాపణలు చెప్పాల్సిన పనిలేదని, తాను ఎలాంటి అసభ్యకర వ్యాఖ్యలు చేయలేదని, అలా చేసి ఉంటే రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమేనని అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ కూడా అజంఖాన్‌ను సమర్థించారు. అనంతరం ఇద్దరూ పార్లమెంటు నుంచి వాకౌట్ చేశారు.

# కాలగమనపు మరో హేల!

నేటినిజం
శనివారం 27-7-2019

మాతృభూమి చరిత్రలో మరో ఉజ్వల ఘట్టాన్ని సృష్టించగలిగిన వజ్రాల బిడ్డలు! చంద్రుడు అనాదిగా భూమికి దగ్గరివాడు, మూడు లక్షల ఎనబయి నాలుగువేల కిలోమీటర్ల దూరం పయనించి 'చంద్రయాన శకట త్రయం' చంద్రుని చేరనుండడం ఈ దగ్గరితనానికి నిదర్శనం. చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతున్నాడు, అనాదిగా తిరుగుతున్నాడు, అనంతంగా తిరుగుతుంటాడు. అందువల్ల చంద్రుడు భూమికి ఉపగ్రహం. ఈ 'ఉపగ్రహం' చుట్టూ 'రెండవ చంద్రయాన్' వ్యవస్థలోని 'పరిక్రమిక'- ఆర్బిటార్- తిరగనుండడం మానవుడు స ృష్టిస్తున్న అద్భుతం. భూమి చుట్టూ పరిక్రమిస్తున్న చంద్రుని చుట్టూ ఈ 'ఆర్బిటార్' పరిక్రమించనుంది. చంద్రుడు కాలగమనానికి కొలమానంబీ సూర్యుడు మరో 'కొలమానం'. కానీ సూర్యుడు కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్నాడు. అందువల్ల సూర్యుని కంటె చంద్రుడు దగ్గరివాడు. "సూర్య ఆత్మా జగతః"- సూర్యుడు జగత్తునకు ఆత్మ అన్న వాస్తవాన్ని భారతీయులు అనాదిగా గుర్తించారు. కానీ వ్యవహారంలో 'ఆత్మ'కంటె 'మనస్సు' దగ్గరిది. చంద్రుడు జగత్తునకు మన స్సు. 'చంద్రయానం'తో ఈ దగ్గరితనం మరింత సన్నిహితమైంది. ఈ సాన్నిహిత్యం సాధ్యం అయిన వేళ- చాంద్రమాన కలియుగం ఐదువేల నూట ఇరవయి ఒకటవ సంవత్సరం శుభ వికారి ఆషాఢ బహుళ పంచమి- కాలగమనపు మరో హేల! ఈ 'కాల గననం' చంద్రునికీ భూమికీ మధ్య ఉన్న సంబంధం- అందుకే ఇది చాంద్రమానం! చంద్రునితో ముడిపడిన మాసం 'చంద్రమాసం'. 'మానం'కొలత, 'మాసం' నెల, 'యానం' ప్రయాణం! 'చంద్రయానం' చంద్రుని వైపుప్రయాణం. 'సోముడు' అంటే చంద్రుడు. సోమవారం 'సోమయానం' మొదలైంది..కాలం గడుస్తున్నట్టు, కాలం నడుస్తున్నట్టు ధ్రువీకరిస్తున్న కొలమానాలు భూమి, చంద్రుడు, సూర్యుడు, అసంఖ్యాక సూర్యులు- నక్షత్రాలు-! ఈ ఖగోళ విజ్ఞానం మన దేశంలో అనాదిగా వికసించింది, విలసిల్లింది. 'చంద్ర గ్రహణం', 'సూర్యగ్రహణం' భారతీయులు యుగాలకు పూర్వం నుంచీ గుర్తించడం ఒక ఉదాహరణ మాత్రమే! ఖగోళ విజ్ఞాన పథంలో, అంతరిక్ష వీక్షణ ప్రస్థానంలో భారతీయులు- ప్రపంచంలోనే అగ్రగాములు. ఈ విజ్ఞాన చంద్రుడిని 'విదేశీయ దురాక్రమణ'లు రాహుకేతువుల వలె కబళించడం వెయ్యేళ్ల చరిత్ర. వెయ్యేళ్లు వెనుకబడిన మనం మళ్లీ 'తథాకథిత'- సోకాల్డ్- అగ్ర దేశాలతో పోటీపడి అంతరిక్షంలో దూసుకొనిపోగలుగుతున్నాము. సోమవారం 'రెండవ చంద్రయాన్' మొదలుకావడం ఈ 'దూసుకొనిపోతున్న' చరిత్రలో సరికొత్త ఘట్టం....భారత అంతరిక్ష పరిశోధన సంస్థ- ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్- ఇస్రో- అవతరించే నాటికి అమెరికా, రష్యా దేశాల వారు అంతరిక్షంలో గొప్ప పరిశోధక ప్రగతి సాధించారు. అయినప్పటికీ ఇప్పుడు ఈ దేశాల సంస్థలతోను, చైనా సంస్థతోను దీటుగా విజ్ఞానపథ ప్రస్థానం సాగిస్తుండడానికి కారణం యుగాల నాటి మన ఖగోళ విజ్ఞాన నేపథ్యం. మన 'సూర్య సిద్ధాంతం' అన్న ఖగోళ విజ్ఞాన గ్రంథం ప్రపంచంలోని 'అంతరిక్ష' పరిశోధక విజ్ఞాన చరిత్రలో మొదటి ఆవిష్కరణ. కలియుగం నాలుగవ శతాబ్ది- క్రీస్తునకు పూర్వం ఇరవై ఎనిమిదవ శతాబ్ది-నాటి ఆర్యభటుడు, క్రీస్తునకు పూర్వం ఒకటవ శతాబ్దినాటి వరాహ మిహిరుడు అంతరిక్ష విజ్ఞాన పథంలో అగ్రగాములు. ఈ చారిత్రక వాస్తవాలను పాశ్చాత్యులు పరిగణించకపోవడం వారి దురహంకారం. 'జూలియన్' కాలెండర్, గ్రెగేరియన్ కాలండర్, క్రీస్తుశకం వంటివి రెండువేల రెండు వందల ఏళ్లకు పూర్వం లేవు. పాశ్చాత్యుల అంతరిక్ష పరిశోధన చరిత్రకు వెయ్యేళ్లు కూడ లేవు. అయినప్పటికీ, ఇప్పటికీ ఆర్యభటుడు ఈ 'యుగం'లో మొదటి ఖగోళ విజ్ఞానవేత్త అన్న వాస్తవాన్ని పాశ్చాత్యులు అంగీకరించలేదు. ఆర్యభటుడు కలియుగం ముప్పయి ఏడవ శతాబ్ది- క్రీస్తుశకం ఐదవ శతాబ్ది- నాటి వాడన్న పాశ్చాత్యుల ప్రచారం 'చరిత్ర చంద్రుని'కి మరో గ్రహణం. చంద్రునిపై అవతరించనున్న 'లాండర్'-అవతారిక-కు 'విక్రమ'అని పేరు పెట్టడం వరాహ మిహిరుని స్మృతిని స్ఫురింపచేస్తోంది. 'ఆర్బిటార్'- పరిక్రమిక- సెప్టెంబర్ ఆరవ తేదీ నుంచి చంద్రుని చుట్టూతిరుగుతూ ఉంటుంది. అదే సమయంలో 'పరిక్రమిక' నుంచి విడివడే 'అవతారిక'- విక్రమ- చంద్రుని దక్షిణధ్రువంపై దిగుతుంది. 'విక్రమ'నుంచి మెల్లగా వెలువడే 'పరిశోధిక'-రోవర్- పేరు 'ప్రజ్ఞ'.. ఈ భారతీయ 'ప్రజ్ఞ' పదునాలుగురోజులు చంద్రుని తలంపై విహరించి వినూతన 'విషయాల'ను ఆవిష్కరించనుంది. అందులో 'నీరు', 'మంచు' ప్రధానమైన పదార్థాలు. చంద్రునిలో 'నీరు'ఉన్నట్టు 'మొదటి చంద్రయాన్' ఇదివరకే ప్రపంచానికి చాటించింది. ఈ చాటింపునకు మరో ధ్రువీకరణను ఈ రెండవ చంద్రయాన్ ఆవిష్కరించనుంది.

# జిల్లాల్లో మున్సిపల్ ఎన్నికల సందడి

## రాజకీయ పార్టీల్లో ఆశావహుల హడావిడి

## అంతర్గతంగా ప్రచారంతో నేతల హల్‌చల్

హైదరాబాద్,జూలై26(ఆర్‌ఎన్‌ఎ): కొత్త మున్సిపల్ చట్టం అమల్లోకి రావడంతో ఇక మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. జూలై 2తో ప్రస్తుత పాలకవర్గాల గడువు ముగిసింది. వీలైనంత త్వరగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి పూర్తి చేయాలని సిఎం కెసిఆర్ భావిస్తున్నారు. దీనికితోడు టిఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం కూడా ముగిసింది. మున్సిపాలిటీల ఎన్నికల నేపథ్యంలో ఆశావహుల్లో సందడి నెలకొంది. ఇప్పటికే వివిధ డివిజన్ల నుంచి కార్పొరేషన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నేతలతోపాటు వివిధ పార్టీల నుంచి పోటీకి దిగేందుకు సమాయత్తం అవుతున్న నేతల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. అన్ని పార్టీలు మరోమారు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. ఆయా డివిజన్లలో ఇప్పటికే ఇల్లిల్లు తిరుగుతూ తమ అనుచరులను కలుస్తూ ఎన్నికలు వస్తున్నాయని, తమకు మద్దతు తెలుపాలని కోరుతూ అంతర్గత ప్రచారం మొదలుపెట్టారు. ఈసారి ఎన్నికల సమీకరణాలు పూర్తిగా మారుతాయని, గ్రామీణ ప్రాంత స్థానిక ఎన్నికలకు, పట్టణ ప్రాంత స్థానిక సంస్థల ఎన్నికలకు వ్యత్యాసం ఉండే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా పుర ఎన్నికల ప్రకటనతో నగరంలో రాజకీయ సందడి నెలకొంది. కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీల్లో కూడా జోరుగా ఎన్నికల సందడి ఏర్పడింది. అన్ని మున్సిపాలిటీల్లో పుర ఎన్నికల కోసం నేతలు సమాయత్తం అవుతున్నారు. ఓటరు జాబితాతోపాటు బీసీ రిజర్వేషన్లను పూర్తిచేయించారు. అక్కడక్కడా కొన్నిచోట్ల వివాదాలు తెల్తతడంతో కోర్టులను ఆశ్రయించి స్టే తెచ్చారు. ఈ స్టేలు ఎత్తేస్తేనే ముందుకు పోయే అవకాశం ఉంది. విలీన గ్రామాల ఓటర్లను కలుపుకొని పునర్విభజన చేయడంతో ఇప్పుడు పలు మున్సిపాలిటీల్లో డివిజన్ల స్వరూపం మారింది. ఇకపోతే తెలంగాణ ప్రభుత్వం పురపాలికల్లో సమూల మార్పులు చేసేందుకు కొత్త పురపాలక చట్టాన్ని అమలులోకి తెచ్చింది. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో కొత్త పురపాలక చట్టానికి ఆమోదముద్ర పడింది. దీంతో మున్సిపాలిటీల్లో ఎన్నికల హడావుడి కనిపిస్తోంది. ఆశావహులు మున్సిపాలిటీలకు చేరుకొని ఎన్నికల పక్రియపై ఆరా తీస్తున్నారు. మొత్తం మీద మున్సిపాలిటీల్లో ఎన్నికల వేడి రాజుకోవడంతో పాటు సందడి నెలకొంది. నేతలు కూడా మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యాచరణకు దిగారు.

# నిజాం షుగర్స్ ఫ్యాక్టరీపై అస్పష్టత

## హామీని నిలబెట్టుకోవాలంటున్న విపక్షాలు

నిజామాబాద్,జూలై26(ఆర్ఎన్ఎ): మూతపడిన ఎన్‌డీఎస్‌ఎల్ నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ తెరుచుకుంటుందన్న ఆశలు సన్నగిల్లాయి. రెండోసారి అధికారంలోకి వచ్చిన టిఆర్‌ఎస్ దీనిపై ఎలాంటి ప్రకటనా చేయడం లేదు. తెలంగాణ ఉద్యమంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుని పూర్వవైభవం తెస్తామని ఇచ్చిన హామీని ప్రస్తావిస్తున్నాయి. ఇచ్చిన మాటకు కట్టుబడి ఫ్యాక్టరీ స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఫ్యాక్టరీ మూతపడి మూడున్నరేళ్లు గడిచినా ప్రభుత్వం పునరుద్ధరణవిషయంలో కాలయాపన చేస్తోంది. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తోందని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే శివసేన, బీజేపీలు ధర్నా, రాస్తారోకోలు చేపట్టాయి. కాంగ్రెస్, వామపక్ష, విప్లవ కమ్యూనిస్టు పార్టీలు, కార్మిక సంఘాలు షుగర్ ఫ్యాక్టరీ లిక్విడేషన్ ఉత్తర్వులు రద్దు చేయించాలని డిమాండ్ చేస్తున్నాయి. నిజాంషుగర్స్ రక్షణ కమిటీ ఉద్యమ కార్యాచరణను రూపకల్పన చేస్తోంది. మొత్తంగా ఇప్పుడు ఇది మరోమారు రాజకీయ పోరాటినికి ఎజెండగా మారనుంది. తాజాగా షుగర్ ఫ్యాక్టరీ అమ్మేందుకు రంగం సిద్ధమవుతున్న పరిస్థితిపై ప్రతిపక్ష పార్టీలు నిరసన గళం ఎత్తాయి. దీంతో ఇంతకాలం ఇది తెరుచుకుంటుందన్న ఆశలు కూడా పోయాయి. దీనిపై ఆధారపడ్డ కార్మికులు, రైతులు కూడా నిట్టూర్పులు విడుస్తున్నారు. లిక్విడేషన్‌కు తాజాగా ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ, రక్షణ కోసం మళ్లీ రాజకీయ పార్టీలు ఉద్యమ బాటపట్టనున్నట్లు సమాచారం. నిజామాబాద్ ఎంపి అర్వింద్ కూడా నిజాం షుగర్ ఫ్యాక్టరీపై పోరాటానికి సిద్దంగా ఉన్నట్లు సంకేతాలు పంపుతున్నారు. కాంగ్రెస్, బిజెపిలు తాడోపేడో తేల్చుకోవాలని చూస్తున్నాయి. తెలంగాణ ఆవిర్భావనంతరం 2014 లో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో, మలిదశ స్వరాష్ట్ర పాలనలో ఫ్యాక్టరీకి పూర్వవైభవం వస్తోందని ఆశిస్తే, నడిచే ఫ్యాక్టరీ మూతపడిందని, వందలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. పండించిన చెరుకు పంటను ప్రైవేట్ చక్కెర ఫ్యాక్టరీలకు తరలించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

# జల ట్రిబ్యునల్ ఓ ముందడుగు

హైదరాబాద్, జులై 26:ఆలస్యంగా అయినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓ మంచి నిర్ణయం తీసుకుంది. నిజంగా ఇది దూరదృష్టి తో తీసుకున్న నిర్ణయంగాచూడాలి. దేశంలో రాష్ట్రాల మధ్య తలెత్తే నదీ జలాల వివాదాలను దశాబ్దాలపాటు కొనసాగనివ్వరాదని నిర్ణయించింది. నిర్ణీత కాలవ్యవధిలో వాటిని పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కార బిల్లును తీసుకొచ్చింది. కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ దీనికి సింబధించిన బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. నిజానికి దేశంలో అనేక రాష్ట్రాల్లో నీటి పంచాయితీలు ఉన్నాయి. ఎవరికి వారు తమకే ఈ నీరు సొంత అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. దిగువరాష్ట్రాలకు నీరందకుండా చేస్తున్నారు. నీటికి అడ్డుకట్టలు వేసి కిందివారు ఏమైతే మాకేంటన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. దేవంలో అతిపెద్ద పంచాయితీగా కావేరీ జలవివాదాన్ని చూడాలి. ఇటువంటి తరుణంలో జాతీయ ట్రిబ్యులన్ ఏర్పాటు ఓ మంచి పరష్కార వేదికగానే చూడాలి. ఇది అమల్లోకి వచ్చాక లోటుపాట్లను సవరించుకునేలా వెసలుబాట్లు కల్పించాలి. ప్రస్తుతం ఉన్న విభిన్న ట్రిబ్యునళ్ల స్థానంలో ఒకే శాశ్వత ట్రిబ్యునల్ ఏర్పాటును కేంద్రం ప్రతిపాదించింది. వివాదాలను వేగంగా పరిష్కరించేందుకు స్పష్టమైన నిబంధనలను బిల్లులో పొందు పరిచింది. నిజానికి ఇంతకాలం ట్రిబ్యునళ్ల తీర్పులను పట్టించుకోక పోవడం వల్లనే సమస్యలు ఉత్పతనం అవుతున్నాయి. సుప్రీం తీర్పులను కూడా ఖాతరు చేయని పరిస్థితి వచ్చింది. గతంలో కావేరి జలవివాదంలో కర్నాటక తీరు ఇందుకు నిదర్శనం. అలాగే కృష్ణానదిపై కర్నాటక, గోదవారిపై మహారాష్ట్ర అనేక ఆనకట్టలు కట్టడం వల్ల దగువ రాష్ట్రాలకు చుక్కనీరు రాకుండా పోతోంది. ఈ వర్షాకాలమే ఇందుకు నిదర్శనం. అయితే జాతీయ ట్రిబ్యులన్ వల్ల పంచాయితీలు తెంచడానికి పనికి వస్తుందే కానీ జల సమస్యలు తీర్చడానికి పనికిరాదు. జలసమస్యలు ఇప్పుడు దేశాన్ని పట్టి పీడిస్తున్నాయి. వివాదం ట్రిబ్యునల్ వద్దకు వెళ్లిన తర్వాత గరిష్ఠంగా నాలుగున్నర ఏళ్ల లోపే పరిష్కరించాలని ప్రతిపాదిత బిల్లు నిర్దేశిస్తోంది. ఒక్కసారి ట్రిబ్యునల్ తీర్పు వెలువరిస్తే అదే అంతిమం అవుతుందని కేంద్రం ప్రకటించింది.

వివాదంతో సంబంధం ఉన్న రాష్ట్రాలన్నీ తప్పనిసరిగా ఆ తీర్పును శిరసావహించాల్సిందే చట్టం రావడం వల్ల కొంత ఊరట కలుగనుంది. ప్రతిపాదిత ట్రిబ్యునల్ మనుగడలోకి వచ్చిన నాటి నుంచి అప్పటి వరకూ పనిచేస్తున్న ట్రైబ్యునళ్లన్నీ రద్దవుతాయి. ప్రస్తుతం వాటి ముందున్న కేసులన్నీ ఈ కొత్త ట్రిబ్యునల్‌కు బదిలీ అవుతాయని ప్రకటించింది. అయితే దీనికన్నా ముందు దేశంలోని జలాన్ని ప్రజల సొంత ఉమ్మడి ఆస్తిగా భావించాలి. జలంపై దేశంలోని ప్రజలకు సర్వ హక్కులు ఉండాలి. ఏ ఒక్క రాష్ట్రానికో, ప్రాంతానికో కాకుండా అవసరం మేరకు జలాన్ని వాడుకునేలా చట్టాలు ఉండాలి. విధానాలు ఉండాలి. అలా చేయడం ద్వారా జాతీయ జలవిధానం రూపొందించుకుంటే బాగుండేది. బిల్లును ప్రవేశపెట్టడాన్ని కాంగ్రెస్, డీఎంకే, బీజేడీ పార్టీలు సహజంగానే వ్యతిరేకించాయి. ఇది సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకం అన్నాయి. నిజంగానే వీరి వాదన వల్ల పంచాయితీలు పెరకగుతాయే తప్ప తరగవు. ఇక్కడ కావాల్సింది ప్రజలంతా భారతీయులు అన్న భావన రావాలి. నిజానికి ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో ఓ మంచి పరిణామం జరిగింది. గోదావరి, కృష్ణా నీటి సద్విని యోగంపై ముఖ్యమంత్రులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కె చంద్రశేఖరరావులు చర్చించారు. ట్రిబ్యుళ్ల చుట్టూ తిరుగకుండా సమస్యలను కూర్చుని పరిష్కరించుకుంటామని ప్రకటించారు. అలాగే వృధా జలాలనలు వినియోగించుకుని దేశానికి ఆదర్శంగా ఉండాలని నిర్నయించారు. ఈ మేరకు అధికారిక స్థాయిలో కూడా చర్చలు సాగాయి. గోదవారిలో లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలో వృధాగా పోతోంది. దీంతో వీటిని సద్వినియోగం చేయడంతో పాటు, వట్టిపోయిన కృష్ణాలోకి మళ్లించాలన్న ఓ మంచి నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ స్ఫూర్తి ఇప్పుడు కేంద్రం తీసుకుని వచ్చిన బిల్లుకు ఊతంగా నిలవాలి. జలవివాదాలతో ప్రజల మధ్య వైషమ్యాలు లేకుండా చూడాలి. తామంతా భారతీయులమన్న భావన వీడి కావేరీ విషయంలో కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రజలు వీధిపోరాటాలకు దిగిన సందర్భాలు ఉన్నాయి. మొత్తంగా ఆలస్యంగా అయినా కేంద్రం ఓ మంచి నిర్ణయం తీసుకోవడం ద్వారా వివాదాల పరిష్కారానికి మార్గం దొరికింది. కేంద్రం ప్రతిపాదించిన బిల్లు మేరకు జల వివాదంపై విచారణ జరపటానికి ట్రైబ్యునల్‌లో బెంచ్ ఏర్పాటవుతుంది. ఈ బెంచ్ కేంద్ర ప్రభుత్వానికి రెండేళ్లలోపు పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఒక వేళ ఆ కాలపరిమితి లోపు నివేదిక ఇవ్వడం సాధ్యంకాకపోతే మరో ఏడాదిపాటు పొడిగించడానికి వీలు కల్పించారు. అప్పటికీ వీలుకాకపోతే మరో ఆరు నెలలు సమయం ఇస్తారు. తుది తీర్పు వెలువడిన తర్వాత ఇంకా ఏమైనా అభ్యంతరాలు, లేదా కొత్త అంశాలను బెంచ్ దృష్టికి తీసుకెళ్లటానికి ఏడాది సమయం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వంలో కార్యదర్శి స్థాయిలో పనిచేసిన వారు, జాతీయ, అంతర్జాతీయ జల వివాదాల పరిష్కారంలో విశేష అనుభవం ఉన్న వ్యక్తులను మాత్రమే ట్రిబ్యునల్‌లో నైపుణ్య సభ్యులుగా తీసుకుంటారు. దీనివల్ల సమస్యల అవగాహనకు అవకాశం ఉంటుంది. అయితే నాలుగున్నరేళ్ల గరిష్టపరిమితి చాలా ఎక్కవ సమయంగానే చూడాలి. వివాదాలను కీనసంగా రెండేళ్లో పరిష్కరించడంతో పాటు, జలవినియోగంపై స్పష్టత వచ్చేలా చేయాలి. అలాగే రాష్ట్రాలు కూడా జలాల విషయంలో ఇచ్చిపుచ్చుకునే ధోరణిలోనే ఉండేలా చూడాలి. అప్పుడే సమాఖ్య స్ఫూర్తి నిలుస్తుంది.

# చిత్తశుద్ధితో నీటి మళ్లింపు సాగాలి

## కార్యాచరణలో సిఎంల పట్టుదల మంచిదే

## గోదావరి వృధాను అరికడితే తెలుగునేల సస్యశ్యామలమే

హైదరాబాద్,జూలై26 (ఆర్ ఎన్ఎ): దేశంలోనూ, రాష్ట్రంలోనూ నీటి వనరులకు కొదవలేదు. జీవ నదులు, హిమ నదాలు, ఉప నదులు, జలపాతాలు, సెలయేళ్లు, చెరువులు, సాగరాలతో మన దేశం జలసంపదదతో అలరారుతోంది. అయితే దాని వినియోగం విసయంలో మాత్రం చిత్తశుద్ధి కొరవడింది. గంగ,యమున, సరస్వతి,గోదావరి, కృష్ణ, బ్రహ్మపుత్ర లాంటి ఎన్నో నదుఉల ఉన్నాయి. కానీ ఏం లాభం. ఒక్క గోదావరి నుంచి వచ్చే నీటిలో 3000 టిఎంసిలకు పైగా నీళ్లు నిరుపయోగంగా సముద్రం పాలు అవుతున్నాయి. తెలంగాణ సహా రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలు నీటి ఎద్దడితో నోరెల్లబెడుతుంటే దాహార్తిని తీర్చే పరిష్కారవే జరగేలదు. మానవచరిత్రలో విడదీయరానిది జలబంధం. జీవులకు నీరే ప్రాణాధారం. నీరు లేని సమాజాన్ని ఊహించనేలేం. అలాంటిది ఇప్పుడేమైంది? తాగు నీటి కోసం గొడవలు పడి ప్రాణాలు తీసుకొనే రోజులొచ్చాయి. చినుకు నేల పడితే చాలు చిత్తడైపోయే ముంబయి, హైదరాబాద్ మెట్రో పాలిటన్ సిటీలు, భూగర్భ జలాలు పాతాళానికి అడుగంటిపోయి తాగేందుకు చుక్క నీరు లేక దప్పికతో అలమటిస్తున్న చెన్నైవంటి మహానగరాలు నేర్పుతున్న పాఠాలు పాలకులు గుణపాఠం కావాలి. గోదావరి వృథా జలాలను వినియో గించుకోగలిగితే తెలుగునేల సస్యశ్యామలం కాగలదని నిపుణులు ఎప్పటి నుంచో సూచిస్తున్నారు. అందుకు తగ్గట్లేగా ఇరు రాష్ట్రాల సిఎంలు కెసిఆర్, జగన్‌లు తమ సంకల్పానికి అనగుణంగా కార్యాచరణలో వేగం పెంచాలి. లాభాలే పరమావధిగా నీటి వ్యాపారాలు జరుగుతున్న తీరు చూస్తుంటే ప్రజలు ఎంతగా నీటి కోసం అగచాట్లు పడుతున్నారో గమనించవచ్చు. జల వనరుల విషయంలో పాలకులు అనుసరిస్తున్న విధానాల్లో ప్రాధాన్యతలతో కూడిన సమగ్ర దృక్పథం లేకపోవడం కారణంగా ఏటేటా నీటి సమస్యలు రెండింతలు అవుతున్నాయే తప్ప తీరడం లేదు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, టిడిపి ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు వందకు పైగా ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. ఇరువురి హయాంలలో లక్షన్నర కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసినా ఒక్కటంటే ఒక్క ప్రధాన ప్రాజెక్టు నేటికీ పూర్తి కాలేదు. ప్రాధాన్యతలేవీ లేకుండా, నిర్వాసితుల గోడు పట్టించుకోకుండా, అసమగ్రంగా రూపొందించిన ప్రణాళికలతో, కుంభకోణాలతో ఈ ప్రాజెక్టులన్నీ ఎక్కడికక్కడే పడకేశాయి. ప్రాజెక్టుల నిర్మాణాల్లో ప్రాధాన్యతలు మార్చడం, కమీషన్లు దండు కోవడం వంటి వాటిపైనే పాలకులు దృష్టి పెడుతున్నారే తప్ప ప్రజల అవసరాలు ఏమిటి? అన్న చర్చ చేయలేదు. కరువు ప్రాంతాలకు, వెనుకబడిన ప్రాంతాలకు జలాలను మళ్లించడం ఎలా అనే అంశాలను పట్టించుకోలేదు. జలయజ్ఞం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ధనయజ్ఞం చేసిందని గత టిడిపి ప్రభుత్వం ఆరోపిస్తే చంద్రబాబు పాలనలో అంతకు మించి దోపిడి జరిగిందనీ ఇప్పటి వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం ఆరోపిస్తుంది. ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రజల పట్ల నిబద్ధతతో ముందుకు వచ్చాయి. సమగ్రమైన జల విధానాన్ని రూపొందించి అమలు చేయానల్న సంకల్పాన్ని ప్రకటించాయి. తాగునీటికి తొలి ప్రాధాన్యతనిస్తానే కరువు ప్రాంతాలకు నీటి మళ్లింపునకు ప్రాముఖ్యత నివ్వాలి. ప్రాదేశిక సరిహద్దులను ప్రాతిపదికగా కాకుండా వర్షపాతాన్ని పరిగణలోకి తీసుకొని ప్రాంతాలను ఎంపిక చేయాలి. సాధ్యమైనంత ఎక్కువ విస్తీర్ణానికి మూడు, నాలుగు నెలల పాటు ఒక్క ఆరు తడి పంటకైనా నీరు గ్యారెంటీ చేసే ప్రాజెక్టులకు, నీటి మళ్లింపు పథకాలకు ప్రాముఖ్యత నివ్వాలి. ఒకవేళ అంతకు మించి నీరు లభ్యమయ్యే పరిస్థితులుంటే 6 నెలల మాగాణి పంటలకు, పారిశ్రామిక అవసరాలకు, వీటి అవసరాలు తీరిన తర్వాతే విద్యుత్ ఉత్పాదనకు ఇలా ఒక క్రమపద్ధతిలో జల వనరులను వినియోగించేందుకు సమగ్రమైన విధానం రూపొందించాలి. గొప్పలకు పోకుండా ప్రజల అవసరాలను గుర్తించి నీటికి నడత నేర్పే విధానాలకు పాలకులు శ్రీకారం చుడితేనే సమస్యలకు పరిస్కారం దక్కుతుంది. ముఖ్యంగా కెసిఆర్, జగన్ ఇద్దరూ సంకల్పంతో ఉన్నారు. వృధానీటిని మళ్లించాలన్న ఆలోచనకు కార్యరూపం తీసుకుని రావాలని పట్టుదలగు ఉన్నారు.

# టెక్నాలజీతో ముందుకుసాగుతున్న పోలీసులు

## కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి




కరీంనగర్,జులై 26 (నేటినిజం ప్రతినిధి):నేరాల నియంత్రణ,ఛేదన కోసం కరీంనగర్ పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో ముందుకుసాగుతున్నారని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. ప్రజలకు భద్రతపై భరోసా కల్పించేందుకు వివిధ రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

గురువారం నాడు కరీంనగర్‌లోని కోతిరాంపూర్, హనుమాన్‌నగర్‌లలో పోలీసులు కార్డన్‌అండ్‌సెర్చ్ నిర్వహించారు. ఉదయం 5:30గంటల నుండి 7:30గంటల వరకు ప్రతి అనుమానిత ప్రాంతంలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో ఏర్పాటైన కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ అసాంఘీక శక్తుల కదలికలు, అక్రమ కార్యకలాపాల నియంత్రణకు కార్డన్‌అండ్‌సెర్చ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. భద్రతకు సిసి కెమెరా ఆయుధంలాంటిదని చెప్పారు. సిసి కెమెరాల ద్వారా నేరాలు వేగవంతంగా చేధించబడుతున్నాయని తెలిపారు. కమీషనరేట్‌వ్యాప్తంగా రేయింబవళ్ళు గస్తీని నిర్వహిస్తున్నా, ప్రజలు సిసి కెమెరాల ఏర్పాటు స్వచ్ఛందంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో ఇప్పటి వరకు 03వేల సిసి కెమెరాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఈమధ్య కాలంలో అనేక నేరాలను సిసి కెమెరాల ఫుటేజీల ఆధారంగా ఛేదించామని పేర్కొంటూ ప్రధాన సంఘటనలను వివరించారు. ప్రజలు నేరుగా పోలీస్‌స్టేషన్లకు వచ్చి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండా ఉండేందుకు పోలీస్‌శాఖ అన్నివర్గాల ప్రజల సౌకర్యార్థం హాక్ఐ యాప్‌ను అందుబాటులోకి తీసుకవచ్చిందని స్మార్ట్‌ఫోన్ కలిగిఉన్న ప్రతిపౌరుడు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మహిళల భద్రత కోసం ఇందులో ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. అద్దెదారుల వివరాలను తెలుసుకుని యాజమానులు ఇళ్ళను అద్దెకివ్వాలని సూచించారు. అద్దెదారుల వివరాలతో సంబంధింత పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించినట్లయితే వివరాలను అందజేస్తామని తెలిపారు. పోలీస్‌శాఖ ఈ సేవలను ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. అనుమానితులను నిమిషాల వ్యవధిలో తనిఖీ చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఫోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్‌ను ప్రదర్శించారు.

**50సిసి కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు**

కోతిరాంపూర్,హనుమాన్‌నగర్ ప్రాంతంలో 50సిసి కెమెరాల ఏర్పాటుకు స్థానికులు స్వచ్ఛందంగా ముందుకువచ్చారు. విరాలాలు అందించిన స్థానికులను పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సరైన ధృవపత్రాలులేని 45, ఈ-చలాన్ నుండి తప్పించుకునేందుకు ట్యాంపరింగ్ చేసిన 10వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివిధ విభాగాలకు చెందిన 200 మంది పోలీసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(లాఅండ్‌ఆర్డర్) ఎస్ శ్రీనివాస్, కరీంనగర్ టౌన్ ఎసిపి పి అశోక్, ఇన్స్‌పెక్టర్లు తుల శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, సదా నందం, ఆర్ఐలు జానీమియా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వరివిత్తన కేంద్రాలపై అధ్యయనం

## విత్తన భండాగారంలో భాగంగా చర్యలు

ఖమ్మం,జూలై26(ఆర్ఎన్ఎ): వరి విత్తన భాండాగారంగా జిల్లా అనుకూలంగా ఉందని జాతీయ వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు గుర్తించారు. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, పాలేరులో పొలాలు ఇందుకు అనుకూలంగా ఉన్నట్లు పేర్కొన్నారు. జాతీయ వరి పరిశోధన స్థానం ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తల బృందం జిల్లాలోని పలు ప్రాంతాల్లో గతంలోనే పరిశీలన చేసింది. పాలేరు, కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, వైరా, మధిర, సత్తుపల్లి డివిజన్‌లోని పలు వరి సాగు గ్రామాలను బృందం సందర్శించింది. వరి సాగులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం? వెనుకబాటుకు కారణాలు? తదితరాలను గురితంచి పరిశోధనా కేంద్రానికి నివేదించడం ఈ అధ్యయన ఉద్దేశం. అయితే వరి పండించే రైతులు పొలాలకు నీటిని అధికంగా వాడటం వలన భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని తెలిసింది. శ్రీవరి, లేదా నేరుగా వరి విత్తే పద్ధతి మంచిదని గుర్తించారు. అందువ్ల భూసార పరీక్షలు తప్పనిసరని పేర్కొంది. కూసుమంచి, పాలేరు ప్రాంతాల్లోని భూములు తెలంగాణ వరి విత్తన భాండాగారానికి ఎంతో అనుకూలంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు నివేదిక కూడా అందజేశారు. సత్తుపల్లి డివిజన్‌ల కల్లూరు మండలంలోని పలు ప్రాంతాల్లో వరి పండించే భూముల్లో చౌడు ఉందని గమనించారు. వేంసూరు మండలంలోని కందుకూరు భూముల్లో నీటిలో లవణ శాతం ఎక్కువగా ఉండటం వల్ల అక్కడి పొలాల్లో ఎక్కువగా చౌడు ఉంది. చాలా చోట్ల రైతులు మోతాదుకు మించి ఎరువులను వినియోగించారు. ఎరువుల వినియోగం ఎక్కువగా ఉండటంతో నేల భౌతిక స్థితిలో మార్పు వచ్చి చౌడు నేలలు, ఉప్పు నేలలుగా తయారవుతున్నాయి. చీడపీడల ఉధృతి కూడా ఎక్కువవుతోంది.

# ఏపీకి ప్రత్యేక పన్నురాయితీలు కుదరదు

## దేశమంతా ఒకే విధానం ఉంటుంది

## మిథున్ రెడ్డి ప్రశ్నకు గడ్కరీ సమాధానం

న్యూఢిల్లీ,జూలై26(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకంగా పన్ను రాయితీలు ఇవ్వడం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వైకాపా ఎంపీ అవినాశ్ రెడ్డి లోక్‌సభలో లేవనెత్తిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ మేరకు సమాధానమిచ్చారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటే వాటిని దేశవ్యాప్తంగా అమలు చేయడం మినహా ఒక రాష్ట్రానికి ప్రత్యేకంగా చేయడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల వృద్ధి జరగలేదు. అంతేగాక నిరుద్యోగ సమస్య కూడా విపరీతంగా ఉంది. నాటి ప్రధాని హామీ ఇచ్చిన ప్రకారం ప్రత్యేక హోదా ఇంకా రాలేదని అవినాశ్ రెడ్డి లోక్‌సభలో గుర్తుచేశారు. కనీసం ఏపీకి పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పిస్తుందా అని ప్రశ్నించారు. దీనికి నితిన్ గడ్కరీ సమాధానమిస్తూ.. 'విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటే వాటిని దేశవ్యాప్తంగా అమలు చేయాలి. అంతేగానీ ఒక రాష్ట్రానికి ప్రత్యేకంగా రాయితీలు ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. విశాఖలో నెలకొల్పిన మెడిటెక్ జోన్ బాగా పనిచేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలతో వస్తే ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని గడ్కరీ తెలిపారు. అంతకుముందు ట్రిపుల్ తలాక్ చట్టం ముస్లిం పురుషుల పట్ల వివక్షపూరితంగా ఉందని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. చట్టం అనేది అందరికీ సమానంగా ఉండాలని పేర్కొన్నారు. లోక్‌సభలో ట్రిపుల్ తలాక్ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...వివాహమనేది సివిల్ కాంట్రాక్ట్ అయినపుడు, దాని పరిణామాలు కూడా సివిల్‌గానే పరిగణించాలని అభిప్రాయపడ్డారు. విడాకులు ఇచ్చిన కారణంగా జైలు శిక్ష అనేది ప్రపంచంలో ఎక్కడా లేదని.. విడాకుల కేసుకు మూడేళ్ల జైలు శిక్ష అభ్యంతరకరమన్నారు. ఈ చట్టం కారణంగా భర్త జైలులో ఉంటే భార్యకు రావాల్సిన ఆర్థిక సహాయం ఎలా అందుతుందని ప్రశ్నించారు. ఒక మతాన్ని దృష్టిలో పెట్టుకొని చట్టం చేయకూడదని సూచించారు. అభద్రత వల్ల ఉగ్రవాదం పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బిల్లుపై చర్చ సందర్భంగా మహిళా సాధికారికతకు, వివిధ రంగాల్లో వారి అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని మిథున్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు.

# ఆర్టీఐ సవరణ బిల్లుపై రాజ్యసభలో గందరగోళం

## బిల్లుపై విపక్షాల అభ్యంతరం

న్యూఢిల్లీ,జూలై26(ఆర్ఎన్ఎ): లోక్‌సభ ఆమోదించిన ఆర్టీఐ సవరణ బిల్లుపై గురువారం రాజ్యసభలో దుమారం చెలరేగింది. మధ్యాహ్న భోజన విరామం తర్వాత రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ఈ బిల్లు ప్రవేశ పెట్టాలని సిబ్బంది, వ్యవహారాల శాఖమంత్రి జితేందర్ సింగ్‌కు సూచించగా.. విపక్షాలు అభ్యంతరం వ్యక్తంచేశాయి. ఈ బిల్లును తదుపరి పరిశీలన కోసం సెలెక్ట్ కమిటీకి పంపాలని తీర్మానాలు అందజేశాయి. ఓటింగ్‌తో కలిసి దీనిపై చర్చ కొనసాగుతుందని డిప్యూటీ ఛైర్మన్ స్పష్టంచేయగా.. విపక్ష సభ్యులు అభ్యంతరం తెలిపారు. రెండింటిపై వేర్వేరుగా చర్చ జరపాలని పట్టుబట్టి ఆందోళనకు దిగారు. నినాదాలతో సభను హోరెత్తించారు. దీంతో డిప్యూటీ ఛైర్మన్ సభను రెండుసార్లు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా విపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించినా.. డిప్యూటీ ఛైర్మన్ ఈ బిల్లుపై చర్చను కొనసాగించారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది.

## సంగారెడ్డి వార్తలు

# అభివృద్ధిలో గ్రామస్థుల చొరవ అభినందనీయం

## –శిక్షణ ఐఏఎస్‌ల ప్రశంస



సంగారెడ్డి, జులై 26 (నేటినిజం ప్రతినిధి): ఇబ్రహీంపూర్ గ్రామాభివృద్ధికి ప్రజలు చూపిన చొరవ అభినందనీయమని శిక్షణ ఐఏఎస్‌లు ప్రశంసలు కురిపించారు. గురువారం నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్ గ్రామాన్ని హైదరాబాద్ మానవ వనరుల అభివృద్ధి సంస్థలో తర్ఫీదు పొందుతున్న శిక్షణ ఐఏఎస్ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇంకుడు గుంతల నిర్మాణాలతో పాటు బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నెలకొల్పిన శుద్ధి నీటి వ్యవస్థ, డంపింగ్ యార్డు, వైకుంఠ ధామం, నీటీ నిల్వ కుంటను పరిశీలించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను పంచాయతీ కార్యదర్శి స్వామి వారికి వివరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను స్థానికులు చక్కగా వినియోగించుకుంటున్నారన్నారు. నిధులను పక్కాగా వెచ్చిస్తూ పనులు చేపట్టడంతో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని చెప్పారు. సందర్శించిన వారిలో సుమన్ సౌరవ్, భరద్వాజ్, కుమార్ సత్యం, ప్రతాప్, వెంకటేష్, వివేక్ రంజన్, హిమాన్షుజైన్ ఉన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి గోపాల్‌రావు, జడ్పీ సీఈవో శ్రవణ్‌కుమార్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో వేదవతి, ఎంపీపీ బాలకృష్ణ, సర్పంచి దేవయ్య వారి వెంట ఉన్నారు.

ఎర్రవల్లి సందర్శన..

ములుగు, న్యూస్‌టుడే: మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామాన్ని గురువారం శిక్షణ ఐఏఎస్‌లు సందర్శించారు. 2017 బ్యాచ్‌కు చెందిన వారు గ్రామానికి వచ్చారు. అక్కడే ఉన్న మాజీ మంత్రి హరీశ్‌రావు, జిల్లా కలెక్టర్ వెంకటరామరెడ్డిలు వారికి గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను చూపించారు. ప్రజల జీవన విధానాన్ని వివరించారు. క్షేత్రస్థాయిలో పనుల తీరుపై సమస్యలపై వారికి అవగాహన కల్పించారు. వారివెంట జడ్పీ సీఈవో శ్రావణ్‌కుమార్, డీఆర్‌డీవో గోపాల్‌రావు తదితరులు ఉన్నారు.

# అప్పుల పాల్చేసి నిర్మాణాలా?

## ఆ అవసరంఇప్పుడేమొచ్చింది

## ప్రజల సమస్యలను పక్కకుపెట్టడం దారుణం

## మండిపడ్డ అఖిలపక్ష నేతలు

హైదరాబాద్,జూలై26 (ఆర్ఎన్ఎ): అప్పులపాలైన రాష్ట్రంలో ప్రజల అవసరాలకు నిధులను ఖర్చుచేయాలి కానీ.. విలాసాలకు కాదని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఉన్నవి కూల్చు..కొత్తవి కట్టు అన్నదే ప్రభుత్వ విధానంగా మారడం దురదృష్టకరమని అన్నారు. ఇప్పుడు ఉన్న భవనాలను కూల్చాల్సిన అవసరం ఏమీ లేదన్నారు. ఈ పోరాటాన్ని ప్రజల కోసం మరింత పెద్దది చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిరాపార్క్ ధర్నాచౌక్ లో జి.వెంకటస్వామి ఫౌండేషన్,. ప్రజాస్వామిక తెలంగాణ ఆధ్వర్యంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్ నిర్వహించారు. నిరసన కార్యక్రమంలో ప్రధాన పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగ ఆమాట్లాడిన కోదండరావ్ సచివాలయ, అసెంబ్లీల నిర్మాణం అవసరం లేదన్నారు. ప్రజల అవసరాలు తీర్చే పనులుచేయకుండా నిధుల దుర్వినియోగంపై దృష్టి పెట్టారని మండిపడ్డారు. తెలంగాణ వచ్చిన తరువాత కూడా నిరసన చేసే అవకాశం లేకుండా పోయిందని పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. పర్మిషన్ ఇచ్చి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. అఖిలపక్షాన్ని ఒప్పించి కట్టే దమ్ము కేసీఆర్‌కు లేదా అని ఆయన ప్రశ్నించారు. రాజాప్రసాదాలు తన సొంత డబ్బులతో కట్టుకోవాలన్నారు. కొత్త సెక్రటేరియట్, అసెంబ్లీ కట్టడం వలన ప్రజలకు ప్రయోజనం లేదన్నారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన వారు మళ్ళీ ఉద్యమం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని టీజేఎస్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పి.ఎల్ విశ్వేశ్వర్ రావు అన్నారు. కొత్త నిర్మాణాల పేరుతో ప్రజాధనం వృథా చేస్తున్నారన్నారు. మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయాలన్నారు. ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా సీఎం నిర్ణయం తీసుకున్నారని ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు అన్నారు. జనం కోసం ప్రజా ధనాన్ని వినియోగించాలన్నారు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి. ఎవరు అడిగారని కొత్త సెక్రటేరియట్, కొత్త అసెంబ్లీ కడుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ చరిత్ర ఉండకూడదనే కేసీఆర్ ఇవన్నీ చేస్తున్నారన్నారు. ముందు సంక్షేమ పథకాలకు నిధులు రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ అబద్దాలతోనే పుట్టాడని మాజీ మంత్రి ప్రసాద్ రావు విమర్శించారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా కేసీఆర్ పాలన ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేసేందుకు టీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని,కేసీఆర్‌ను గద్దెదించేందుకు సామాజిక ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామిక తెలంగాన ఆధ్వర్యంలో చేసే ఉద్యమానికి తమ మద్దతు ఉంటుందని చెప్పారు. కేసీఆర్ తుగ్లక్ లాగా పాలిస్తున్నాడని పీఓడబ్ల్యూ సభ్యురాలు సంధ్య అన్నారు. ప్రజలు ఎవరు కేసీఆర్‌ను ఆమోదించడం లేదనీ.. ప్రజా ఆమోదం కొలిచే కొలమానం ఉంటే జనాల దగ్గరకి వెళ్లి అడగాలని సూచించారు.

# చొరబాట్లను ఉపేక్షించేది లేదు

## కార్గిల్‌తో పాక్ బుద్ది తెచ్చుకోవాలి

## పాక్‌కు ఘాటుగా హెచ్చరించిన ఆర్మీ చీఫ్

న్యూఢిల్లీ,జూలై25(ఆర్ఎన్ఎ): దాయాది పాకిస్తాన్‌కి భారత ఆర్మీ చీఫ్ తీవ్ర హెచ్చరికలను జారీ చేశారు. పాకిస్తాన్ చొరబాటుదార్లను ప్రేరేపిస్తే వారి శవాలనే తీసుకెళ్లాల్సి వస్తుందని ఆయన తెగేసి చెప్పారు. అలాంటి పనులను పాక్ చేయాలని ప్రయత్నించొద్దని హెచ్చరించారు. గతం కంటే ప్రస్తుతం చొరబాట్లు బాగా తగ్గాయిని, సైన్యం సరిహద్దుల వెంబడి నిత్యం పహారా కాయడంతోనే వాటికి అడ్డుకట్ట వేయగలిగామని ఆయన తెలిపారు. ఒకవేళ పాకిస్తాన్ చొరబాట్లను ప్రేరేపిస్తే శవాలను తీసుకెళ్లాల్సి వస్తుందని వారికి బాగా తెలుసని ఘాటుగా అన్నారు. 1999 లో కార్గిల్ సమయంలో జరిగిన చాలా దురదృష్టకరమని, ఈసారి మాత్రం పాకిస్తాన్ అలా చేస్తుందని తాను భావించడం లేదని బిపిన్ రావత్ తెలిపారు. బిపిన్ రావత్ గురువారం కశ్మీర్‌లో పర్యటించారు. 1999లో కార్గిల్ యుద్దానికి పాల్పడిన పాకిస్థాన్ పెద్ద తప్పు చేసిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దుస్సాహాలు చేయరాదు అంటూ ఆర్మీ చీఫ్ రావత్ పాకిస్థాన్‌ను హెచ్చరించారు. పుల్వామా ఉగ్రదాడి ఘటనపై పాక్ ప్రధాని చేసిన వ్యాఖ్యలను ఆర్మీ చీఫ్ ఖండించారు. ఉగ్రదాడికి ప్లాన్ స్వదేశంలోనే జరిగిందని, పాకిస్థాన్ పాత్ర లేదని ఇమ్రాన్ అన్నారు. సత్యం తమకు తెలుసు అని, పాక్ ప్రకటనలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. పుల్వామాలో జరిగిన ఘటన గురించి ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు కావాల్సినంత సమాచారాన్ని అందించాయన్నారు.

# ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ ఫెయిల్ విద్యార్థిని

హైదరాబాద్,జూలై26(ఆర్ఎన్ఎ): ఇంటర్‌లో ఫెయిల్ అయ్యానని ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. రంగారెడ్డి జిల్లా పెరికలతండాకు చెందిన అఖిల, గాయత్రి జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఫస్టియర్‌లో కొన్ని స్జబెక్టులు ఫెయిల్ కావడంతో.. సప్లిమెంటరీ పరీక్ష రాసింది. బుదశారం వచ్చిన సప్లమెంటరీ ఫలితాల్లోనూ ఫెయిల్ కావడంతో మనస్థాపంతో.. ఆత్మహత్యకు పాల్పడింది. పురుగుల మందు తాగి కాలేజీకి వెళ్లి అక్కడ పడిపోవడంతో.. ఆసుపత్రికి తరలించేలోగా చనిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 8మంది మిలీషియా సభ్యుల అరెస్ట్

కొత్తగూడెం,జూలై26(ఆర్ఎన్ఎ): అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించిన ఎనిమిది మంది మావోయిస్టు మిలీషియా సభ్యులను చర్ల పోలీసులు గురువారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సీఐ సత్యనారాయణ స్థానిక పోలీసు స్టేషనులో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. చర్ల మండల పరిధిలోని కలివేరు క్రాస్‌రోడ్డులో పోలీసులు, సీఆర్పీఎఫ్ దళాల ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తూ పెదమిడిసిలేరు అటవీ ప్రాంతం వైపు వెళ్తున్న పి.ఎడమయ్య, ఎం.సోమడు, పి.చెన్నయ్య, ఆర్.మల్లయ్య, ఎం.బుద్ర, కె.భుజంగరావు, కె.రమేశ్‌లు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకుని విచారణ చేపట్టగా మావోయిస్టు మిలీషియా సభ్యులుగా వెల్లడైందన్నారు. వీరివద్ద నుంచి పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గత రెండేళ్లుగా వీరంతా మావోయిస్టు మిలీషియా కమాండర్ జోగయ్య వద్ద పనిచేస్తున్నారని తెలిపారు.

# 33శాతం అడవుల పెంపకం లక్ష్యంగా హరితహారం

## త్వరలోనే చించోలి కోతుల పునరావాస కేంద్రం ప్రారంభం

## గండి రామన్న వనాన్ని ప్రారంభించిన మంత్రి ఇంద్ర



నిర్మల్ శివారు చించోలి అటవీ ప్రాంతంలో నిర్మించిన గండి రామన్న హరితవనాన్ని ప్రారంభించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి.

నిర్మల్,జూలై26(ఆర్ఎన్ఎ): అటవీశాఖ బ్లాకుల్లో అర్బన్ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తోందని, పట్టణ ప్రాంతాలకు సమీపంలోని అటవీ భూముల్లో వీటి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 33 శాతం అడవులను పెంచాలనే ఉద్దేశ్యంతో 230 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.చించోలి (బి) వద్ద ఏర్పాటు చేసిన కోతుల పునరావస కేంద్రాన్ని ఆగస్టు 15 ప్రారంభించనున్నట్లు మంత్రి చెప్పారు. గురువారం నిర్మల్ పట్టణ శివారు చించోలి(బి) గ్రామ అటవీ ప్రాంతంలో రూ. 1.32 కోట్ల వ్యయంతో 60 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన గండిరామన్న హరిత వనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం అటవీ క్షేత్రంలో మొక్కలు నాటారు. హరితవనంలో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, కానోఫీ వాక్, పాత్ వే, చిల్డ్రన్ ప్లే ఏరియాలో కలియ తిరిగారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అడవులు క్షీణించడం వల్ల పచ్చదనం తగ్గిపోయి పర్యావరణ సమస్యలు తీవ్రమతున్నాయన్నారు. ఇప్పటి వరకు 113 కోట్ల మొక్కలు నాటామన్నారు. 5వ విడత హరిత హారం కార్యక్రమంలో 83 కోట్ల మొక్కలు నాటాలని నిర్ధేశిరచినట్లు చెప్పారు. నాటిన వాటిలో 85 శాతం మొక్కలను సంరక్షించుకునేలా ప్రభుత్వం కఠిన చట్టాలను అమలులోకి తెచ్చిందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే భాధ్యతలను కూడా అధికారులు, ప్రజాప్రతినిదులు తీసుకోలని కోరారు. నగరీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణం అందించడంతో పాటు ఎకో టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ వహించేంచినట్లు వెల్లడించారు. జిల్లా ఎకో పార్కుల్లో 2 నుంచి 3 కిలోమీటర్లలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాసర, కడెం, జన్నారం, ఎస్సారెస్పీ, కుంటాల, నిర్మల్ లను టూరిస్ట్ హబ్‌లుగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు రూ.1.90 కోట్లతో నిర్మించిన జిల్లా ఈఆఖీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు ఆడెల్లి పోచమ్మ ఆలయానికి వచ్చే భక్తుల కోసం కార్తీక వనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, పీసీసీఎఫ్ పీకే ఝా, జడ్పీ చైర్ పర్సన్ కే.విజయలక్ష్మి, కలెక్టర్ యం.ప్రశాంతి, ఎస్పీ శశిధర్ రాజు, సీఎఫ్ వినోద్ కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్, మంచిర్యాల జిల్లా అటవీ శాఖ అధికారి శివానీ డోగ్రా, ఆదిలబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి ప్రభాకర్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, జిల్లా రైతు సమన్వయ సమతి కన్వీనర్ నల్లా వెంకట్రామ్ రెడ్డి ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులపై లైంగిక నేరాలపై ప్రత్యేక కోర్టులు

## – కేంద్రానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ, జులై26(ఆర్ఎన్ఎ) : చిన్నారులపై నానాటికీ పెరుగుతున్న లైంగిక నేరాలను అరికట్టేందుకు సుప్రీంకోర్టు కీలక నిర్ణయాలు తీసుకుంది. చిన్నారులపై లైంగిక నేరాల కేసులను త్వరిత గతిన విచారించేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. పోక్సో చట్టం కింద 100 కేసులు పెండింగ్‌లో ఉన్న ప్రతి జిల్లాలో ఈ ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. చిన్నారులపై లైంగిక నేరాలు జరిగినట్లు పత్రికల్లో వచ్చే కథనాలను సుమోటోగా తీసుకుని సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. 60రోజుల్లోగా ఈ ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు పూర్తిచేయాలని, అంతేగాక.. వీటి నిర్వహణ బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వమే చూసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. దీనిపై నాలుగు వారాల్లోగా పురోగతి నివేదిక సమర్పించాలని సోలిసిటర్ జనరల్‌కు ఆదేశాలు జారీ చేసింది.

## హైదరాబాద్‌కు బస్ సౌకర్యం కల్పించాలి

వనపర్తి,జూలై26(ఆర్ఎన్ఎ): అమరచింతకు హైదరాబాద్ బస్సు సౌకర్యం కల్పించాలని అమరచింత నాయకులు కోరారు. ఈమేరకు గురువారం షాద్‌నగర్ డిపోమేనేజర్ సత్తయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అమరచింత నాయకులు శ్రీనివాసులు, జుబేర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నుంచి అమరచింత పట్టణానికి చేరడానికి సాయంత్రం 5 గంటలకు బస్సు ఉండాలని వారు కోరారు. గతంలో ఉన్న బస్సును రద్దు చేశారని వారు వాపోయారు. అలాగే ఆత్మకూర్ నుంచి జూరాలకు వెళ్లే హైదరాబాద్ బస్సును 3 కి.మీ. దూరంలో ఉన్న అమరచింతవరకు పెంచాలని, ఇది సౌకర్యవంతంగా ఉంటుందని వారు కోరారు. దీనికి డీఎం సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

# తెలంగాణలో బిజెపికి పెరుగుతున్న ఆదరణ

## తదుపరి ప్రభుత్వం తమదే అన్న దత్తన్న

## సభ్యత్వ నమోదు యాప్ విడుదల

హైదరాబాద్,జూలై26 (ఆర్ఎన్ఎ): తెలంగాణలో భాజపాకు ఆదరణ పెరుగుతోందని.. 2023లో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వస్తుందని భాజపా సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి బండారు దత్తాత్రేయ విశ్వాసం వ్యక్తంచేశారు. సభ్యత్వ నమోదు యాప్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రోజురోజుకు కాంగ్రెస్, కమ్యూనిస్టులు కుంచించుకుపోతున్నారని, మోదీ అవినీతి రహిత పాలనను చూసి ప్రజలు భాజపాలో చేరుతున్నారని చెప్పారు. గతంలోని 18 లక్షల సభ్యత్వాలను రెట్టింపు చేయడమే తమ పార్టీ లక్ష్యమన్నారు. తెలంగాణలో అవినీతి, కుటుంబ పాలనను ప్రజలు ఇంటికి పంపుతారని చెప్పారు. కర్ణాటక రాజకీయ పరిణామాలు శుభపరిణామమని.. దక్షిణాదిలో ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం లేకుండా పోయిందని దత్తాత్రేయ వ్యాఖ్యానించారు. మాజీ ఎంపీ వివేక్ భాజపాలో చేరేందుకు సుముఖత వ్యక్తంచేయడం శుభపరిణామమన్నారు. పాతబస్తీలో ఉన్న ఆయుర్వేద హాస్పిటల్, కళాశాలను ఎర్రగడ్డకు తరలించవద్దని బీజేపీ తరుపున మంత్రి ఈటలను కోరామని దత్తాత్రేయ తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఆయుర్వేద హాస్పిటల్‌కి చికిత్స నిమిత్తం వస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయుర్వేదిక్, హోమియో, ఆయుష్‌తో పాటు తెలంగాణకి భారీగా నిధులు ఇస్తోందని దత్తాత్రేయ తెలిపారు. 32 జిల్లా కేంద్రాలలో ఆయుష్ హాస్పిటల్స్‌ని నిర్మించాలని కోరుతున్నామన్నారు. తాను కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో సికింద్రాబాద్‌లో ఆయుష్ హాస్పిటల్‌ని మంజూరు చేయించానని తెలిపారు. 58 కోట్ల రూపాయల నిధులు ఉన్నాయని.. వాటిని ఖర్చు చేయాలని కోరుతున్నామని దత్తాత్రేయ పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ పట్ల తెలంగాణ ప్రజల్లో నమ్మకం ఏర్పడిందని బీజేపీ నేత, మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. తెలంగాణ బీజేపీలో మార్పులు రావాల్సిన అవసరముందన్నారు. కార్యకర్తల ఒత్తిడితోనే సునీతా లక్ష్మారెడ్డి బీజేపీలోకి రాలేదని అన్నారు. సీఎం కేసీఆర్‌కు హరీష్‌రావే టార్గెట్ అని ఆమె అన్నారు. హరీశ్‌ను దెబ్బ తీయాలనే చింతమడకకు కేసీఆర్ వరాలు ప్రకటించారని అరుణ పేర్కొన్నారు. జూపల్లి కృష్ణారావు ఎక్కడికెళ్ళినా జరిగేదేమీ లేదని ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ నేతల భూములున్న చోటే ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. 'నేనే రాజు, నేనే మంత్రి' అన్నట్లు కేసీఆర్ ప్రవర్తన ఉందని డీకే అరుణ విమర్శించారు.

# ఆజం ఖాన్ మరోమారు వివాదాస్పద వ్యాఖ్యలు

## లోక్‌సభ స్థానంలోఉన్న రమాదేవిపై అనుచిత వ్యాఖ్య

## మండిపడ్డ స్పీకర్ ఓం బిర్లా...వ్యాఖ్యల తొలగింపు

న్యూఢిల్లీ,జూలై26(ఆర్ఎన్ఎ): సమాజ్‌వాదీ ఎంపీ ఆజంఖాన్ మరోసారి నిండు సభలోనే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. త్రిపుల్ తలాఖ్ బిల్లుపై చర్చ సందర్భంలో స్పీకర్ స్థానంలో ఉన్న రమాదేవిని ఉద్దేశించి... మీ కళ్లలో కళ్లు పెట్టి మాట్లాడాలనుకుంటున్నానని వ్యాఖ్యానించారు. దీంతో సభలో ఒక్కసారిగా తీవ్ర అలజడి చెలరేగింది. ఆయన మాట్లాడిన మాటలకు సభకు క్షమాపణ చెప్పాల్సిందేనని సభ్యులు డిమాండ్ చేశారు. స్పీకర్ స్థానంలో ఉన్న రమాదేవి మాట్లాడుతూ.. మాట్లాడాల్సిన విధానం ఇది కాదని ఘాటుగా హెచ్చరించారు. దీంతో మీరు నాకు సోదరితో సమానమని ఖాన్ ప్రకటించారు. కొద్దిసేపటికి సభాధ్యక్ష స్థానంలోని తిరిగి వచ్చేసిన స్పీకర్ ఓంబిర్లా... ఆజంఖాన్‌ను మందలించి క్షమాపణ చెప్పాల్సిందేనని సూచించారు. ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఖాన్‌ను సమర్థిస్తూ మాట్లాడారు. పైగా అధికార బీజేపీ పక్ష సభ్యుల భాషే అత్యంత అమర్యాదగా ఉంటోందని విరుచుకుపడ్డారు. దీనిపై తిరిగి స్పందించిన ఆజం ఖాన్... తాను క్షమాపణ చెప్పనని, తన ప్రసంగంలో అన్‌పార్లమెంటరీ పదాలు ఏవైనా ఉంటే తాను రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు. దీన్ని తొలగించండి, దాన్ని తొలగించండి అని చెప్తారు. అసలు ఇలాంటి పదజాలం వాడాల్సిన అవసరం ఏముంది? ఒక మాట మాట్లాడితే, అది వెంటనే ప్రజలకు చేరిపోతుంది. సభ గౌరవాన్ని దృష్టిలో ఉంచుకొని మాట్లాడాలి' అని ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ వ్యాఖ్యలను రికార్డులను నుంచి తొలగించాలని ఆదేశించారు. అయితే అజంఖాన్ మాత్రం క్షమాపణలు చెప్పడానికి అంగీకరించలేదు. తన మాటలు అభ్యంతరకరమైనవే అయితే తక్షణమే రాజీనామా చేయడానికి సిద్ధమని వెల్లడించారు. తరవాత సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. తమ నేతను మందలించాల్సింది పోయి, పార్లమెంటులో భాజపా ఇంతకంటే అభ్యంతరకర పదజాలాన్ని ఉపయోగిస్తోందని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ వాదించారు. దీనిపై ఇతరులకు సూచనలు చేసే స్థాయిలో భాజపా లేదని వితండంగా మాట్లాడారు. ఇదిలా ఉండగా చర్చా సమయంలో పలు పార్టీలు బిల్లుపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశాయి.

## ఏపీ వార్తలు

రాష్ట్ర ప్రయోజనాలకోసమే

# తెలంగాణతో సఖ్యత

- తెలుగువారంతా కలిసికట్టుగా ఉండాలి
- కేసీఆర్ మంచివారు, తెలంగాణతో సఖ్యతగా ఉంటేనే మేలు
- కేసీఆర్ సహకారంపై హర్షించాల్సింది పోయి వక్రీకరిస్తున్నారు
- ఐదేళ్ల తర్వాత మనపరిస్థితి దారుణంగా ఉంటుంది
- కాళేశ్వరం కడుతుంటే ఇక్కడ చంద్రబాబు ఉండి ఏం చేయగలిగారు
- మనది దిగువ రాష్ట్రంగా ఉన్నాం
- ఎగువ రాష్ట్రం వదిలితేనే మనకు నీళ్లు వస్తాయి
- కరవుతో జిల్లాలు అల్లాడుతున్నాయి
- రాజకీయాలే కావాలి అన్నట్లుగా టీడీపీ వ్యవహరిస్తుంది
- ప్రతిపక్షం సలహాలు, సూచనలు స్వీకరిస్తాం
- గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చలో సీఎం వైఎస్ జగన్
- కేసీఆర్ మంచివారు అనడంతో అభ్యంతరం తెలిపిన టీడీపీ సభ్యులు
- సభలో ఇరు పక్షాల మధ్య వాగ్వివాదం
- నలుగురు టీడీపీ సభ్యులను ఒకరోజు సస్పెండ్ చేసిన స్పీకర్
- సభ్యుల సస్పెండ్‌ను నిరసిస్తూ వాకౌంట్ చేసిన చంద్రబాబు

అమరావతి, జులై26(ఆర్ఎన్ఎ) : రాష్ట్ర ప్రయోజనాల కోసమే తెలంగాణతో సఖ్యతగా ఉంటున్నామని, తెలుగువారంతా కలిసికట్టుగా ఉండాలని, అలా ఉంటే ఇరు రాష్ట్రాలకు మేలు జరుగుతుందని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఏపీ అసెంబ్లీలో గోదావరి జలాల వినియోగంపై చర్చ సందర్భంగా జగన్ మాట్లాడారు. కేవలం 12శాతం గోదావరి నీళ్లు మాత్రమే ఏపీలోకి వస్తున్నాయని స్పష్టం చేశారు.

కేవలం ఐదు టీఎంసీలు మాత్రమే మన ఆధీనంలో ఉంటాయని తెలిపారు. తెలంగాణలో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రారంభించి పూర్తి చేశారన్నారు. ప్రాజెక్ట్ కడుతుంటే ఇక్కడ చంద్రబాబు ఉండి ఏం చేయగలిగారని నిలదీశారు. రాష్ట్రానికి మంచి జరగాలనే ఆరాటంతోనే తాము నిర్ణయాలు తీసుకుంటున్నామని, మన రాష్ట్రానికి మంచి జరగదు అనుకుంటే.. అలాంటి నిర్ణయాన్ని కచ్చితంగా తీసుకుబోమని ముఖ్యమంత్రి వైఎన్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గోదావరి జలాలను రోజుకు నాలుగు టీఎంసీల చొప్పున 120రోజులపాటు శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు తరలించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 480 టీఎంసీల నీళ్లు అందుబాటులోకి వస్తాయని, దీనివల్ల ఆంధ్రప్రదేశ్ రైతులూ, ప్రజలూ బాగుపడతారని జగన్ అన్నారు. సాగునీటి, తాగునీటి ఇబ్బందులు తీరుతాయని వివరించారు. నది జలాల పంపిణీ విషయంలో నీళ్లురావు అనుకుంటే ఇద్దరు సీఎంలు ఎందుకు ముందడుగు వేస్తారని ఆయన అన్నారు. ఈ విషయంలో ప్రతిపక్షం ఇచ్చిన సలహాలు కూడా తీసుకుంటామని చెప్పారు. భావితరాల కోసం ఆలోచించే తాము అవసరమైన నిర్ణయం తీసుకుంటున్నామని తెలిపారు. గోదావరి నదిలో నాలుగు పాయలుంటే.. అందులో మూడు పాయలు తెలంగాణను దాటుకొని.. ఆంధ్రలోకి ప్రవేశిస్తాయని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. గోదావరి నదికి చెందిన ఒక పాయ నాసిక్ నుంచి తెలంగాణలోకి ప్రవేశిస్తుందని, ఈ పాయ ద్వారా గోదావరి మొత్తం ప్రవాహంలో 22.23శాతం తెలంగాణకు వస్తాయని వివరించారు. అయితే, ఎగువన మహారాష్ట్ర, కర్ణాటక చిన్న, చిన్న డ్యాములు కట్టుకుంటూ పోతుండటంతో ఈ పాయ మీద ఆధారపడిన తెలంగాణలోని ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు నీళ్లు రాని పరిస్థితి నెలకొందని జగన్ అన్నారు. ఈ ప్రాజెక్టు కోసం కాళేశ్వరం నుంచి రివర్స్ పద్ధతిలో నీళ్లు తరలించుకొని పోతున్నారని సీఎం వైఎస్ జగన్ వివరించారు.

గోదావరి నదిలోని రెండో పాయ ప్రాణహిత నది అని.. ఇది కూడా తెలంగాణలోకి ప్రవేశిస్తోందని వివరించారు. ఈ ప్రాణహిత సబ్ బేసిన్ ద్వారా గోదావరి మొత్తం ప్రవాహంలోని 35.46శాతం నీళ్లు వస్తాయని, గోదావరి పూర్తి నీటిలో దాదాపు 36శాతం ఈ పాయ నుంచే ప్రవహిస్తాయని వివరించారు. ఇక మూడో పాయ అయిన ఇంద్రావతి సబ్‌బేసిన్ కూడా తెలంగాణలోకే ప్రవేశిస్తుందని, అది మొత్తం ప్రవాహంలో దాదాపు 23శాతం ఉంటుందని వివరించారు. గోదావరి నదిలోని నాలుగు పాయల్లో మూడు పాయలు తెలంగాణను దాటిన తర్వాతే ఆంధ్రప్రదేశ్‌లోకి వస్తాయని వివరించారు. ఇక, శబరి సబ్ బేసిన్ నుంచి మాత్రమే మనకు నేరుగా ఆంధ్రప్రదేశ్‌లోకి నీళ్లు వస్తాయని, ఎగువన ఉన్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా వచ్చే ఈ పాయ.. గోదావరి మొత్తం ప్రవాహంలో కేవలం 12శాతం మాత్రమే ఉంటుందని జగన్ వివరించారు. ఒకవైపు పరిస్థితి ఇలా ఉంటే మరోవైపు కృష్ణా నది ఆయకట్టు పూర్తిగా ఎండమావి అయ్యే అవకాశం కనిపిస్తోందని జగన్ తెలిపారు. గత 47ఏళ్ల సగటు చూసుకుంటే కృష్ణా నుంచి శ్రీశైలానికి 1200 టీఎంసీల నీళు వచ్చేవని, కానీ, గత పది సంవత్సరాల్లో చూసుకుంటే అది 600 టీఎంసీలకు పడిపోయిందని, ఇక, గత ఐదు సంవత్సరాలు చూసుకుంటే శ్రీశైలానికి కృష్ణా ప్రవాహం 400 టీఎంసీలకు పడిపోయిందని జగన్ గుర్తుచేశారు. ఇక, ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 524 మీటర్లకు పెంచితే.. కర్ణాటక మరో 100కుపైగా టీఎంసీలను నిల్వ చేసుకోగలుగుతుందని, ఈ పరిస్థితుల్లో శ్రీశైలానికి 200 టీఎంసీల నీళ్లు కూడా వచ్చే పరిస్థితి ఉండదన్నారు. ఈ పరిస్థితుల్లో శ్రీశైలం ఎప్పుడు నిండుతుందని, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు నీళ్లు ఎప్పుడు వెళతాయని, నాగార్జున సాగర్‌కు ఎప్పుడు వస్తాయని ప్రశ్నించారు. ఇది ఇది ఆలోచన చేసుకోవాలని, వాస్తవ పరిస్థితులను గమనించాలని సీఎం వైఎస్ జగన్ కోరారు. తెలుగు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో ఉండాలని, శ్రీశైలం, నాగార్జున సాగర్‌పై మన రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలు ఆధారపడి ఉండగా.. తెలంగాణలోని నాలుగు జిల్లాలు ఈ ప్రాజెక్టులపై ఆధారపడ్డాయన్నారు. ఈ రెండు ప్రాజెక్టులు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ఆస్తి అని పేర్కొన్నారు.

ఆందోళనకు దిగిన టీడీపీ సభ్యులు..

జగన్ ప్రసంగిస్తుండగా టీడీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. కేసీఆర్ మంచివారు, ఆయనతో సంఖ్యతగా ఉంటే ఏపీకి మేలు జరుగుతుందని జగన్ అనడాన్ని తప్పుబట్టారు. జగన్ తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో టీడీపీ సభ్యుల తీరుపై జగన్ మండిపడ్డారు. రాష్ట్రానికి ఉపయోగపడే అంశాలపై చర్చజరుగుతుంటే టీడీపీ సభ్యులు ఆందోళనకు దిగడం సిగ్గుచేటన్నారు. ఏపీకి న్యాయం జరుగుతుందంటే ఎవరితోనైనా సంఖ్యతగానే ఉంటామని, మన రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని జగన్ అన్నారు. ఈ సమయంలో అంబటి రాంబాబు మాట్లాడుతూ.. చంద్రబాబు అందరికంటే నేనే గొప్ప అన్నట్లు తనకు తానుగా ఊహించుకుంటారని, కేసీఆర్ మంచివారు, గొప్పవారు అనగానే ఆయనకు, టీడీపీ సభ్యులకు పౌరుషం వచ్చిందన్నారు. ఇప్పుడు నేను చెబుతున్నానని చంద్రబాబు కంటే వందల రెట్లు కేసీఆర్ గొప్పవారని, ఆయన పరిపాలన అద్భుతమని, అందరిని కలుపుకొని పోయే వ్యక్తిత్వం ఆయన సొంతమన్నారు. అలాంటివి ఒక్క క్వాలిటీ కూడా చంద్రబాబులో లేదంటూ విమర్శించారు. దీంతో టీడీపీ సభ్యులు పోడియం వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఇరుపక్షాల మధ్య వాగ్వివాదంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో స్పీకర్ తమ్మినేని సీతారాం టీడీపీకి చెందిన నలుగురు సభ్యులను సస్పెండ్ చేశారు. సభా కార్యకలాపాలకు అడ్డుతగులుతున్నారనే కారణంతో తెదేపా ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, వాసుపల్లి గణెళిశ్‌కుమార్, వెలగపూడి రామకృష్ణ బాబు, బాల వీరాంజనేయ స్వామిని సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అయినా టీడీపీ సభ్యులు సభలో నుంచి వెళ్లకపోవటంతో మార్షల్స్‌తో బయటకు గెంటివేయించారు. అనంతరం చంద్రబాబు నాయుడు, టీడీపీ సభ్యులుసైతం స్పీకర్ తీరును నిరసిస్తూ, సభ్యుల సస్పెండ్‌ను వ్యతిరేఖిస్తూ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు.

హైకోర్టులో..

# ఏపీ సర్కార్‌కు ఎదురుదెబ్బ

- జీవో నెం. 63ను నాలుగువారాలు సస్పెండ్ చేసిన హైకోర్టు
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి సూచన
- తదుపరి విచారణ వచ్చేనెల 22కి వాయిదా

అమరావతి, జులై26(ఆంఎన్ఎ) : టీడీపీ హయాంలో జరిగిన పవన, సోలార్ విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలను సమీక్షించేందుకు వైసీపీ ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీకి వ్యతిరేకంగా ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు హైకోర్టు ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఉన్నతస్థాయి సంప్రదింపుల కమిటీ నియమిస్తూ జారీచేసిన జీవో నెంబరు 63తోపాటు ఎస్పీడీసీఎల్ లేఖలపై న్యాయస్థానం నాలుగు వారాల స్టే విధించింది. అంతేకాదు ఈ అంశంపై కౌంటర్ దాఖలుచేయాలని ప్రభుత్వానికి సూచించింది. తదుపరి విచారణను ఆగస్టు 22కు వాయిదా వేసింది. ఏపీ ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి సంప్రదింపుల కమిటీని రద్దుచేయాలని కోరుతూ ఒప్పందం కుదుర్చుకున్న 40 సంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. తగ్గించిన ధరల ప్రకారం విద్యుత్ సరఫరా చేయాలని, లేని పక్షంలో తమ వైఖరిని కమిటీ ముందు వెల్లడించాలని పేర్కొంటూ ఏపీఎస్పీడీసీఎల్ జులై 12న రాసిన లేఖలనూ రద్దు చేయాలని తమ పిటిషన్‌లో కోరాయి. టారిఫ్ తగ్గింపు, పీపీఏల రద్దు విషయంలో నిర్ణయం తీసుకోకుండా అధికారులను ఆదేశించాలని ఆ సంస్థలు విజ్ఞప్తి చేశాయి. ధరల విషయంలో తాము చెప్పినట్టు చేయకపోతే 25 ఏళ్లపాటు కొనసాగేలా చేసుకున్న పీపీఏలను రద్దు చేస్తామని రాష్ట్ర ఇంధనశాఖ, ఎస్పీడీసీఎల్ అధికారులు బెదిరిస్తున్నారని ఇందన సంస్థలు దాఖలు చేసిన పిటిషన్‌లో ఆరోపించారు. విద్యుత్తు చట్టం-2003లోని సెక్షన్ 63ను అనుసరించి ఏపీఈఆర్సీ టారిఫ్‌ను ఆమోదించినప్పటికీ.. అధికారంలేని ఇంధనశాఖ, ఎస్పీడీసీఎల్‌లు తగ్గించాలని కోరుతున్నాయని తెలిపారు.

ఈపథ్యంలో ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎస్పీడీసీఎల్ సీఎండీ చర్యలను చట్ట విరుద్ధమైనవిగా ప్రకటించాలని వారు కోరారు. 2015లో చేసుకున్న ఒప్పందంలో యూనిట్ విద్యుత్తుకు ఎంత టారిఫ్ చెల్లించాలనే అంశంపై ఓ అంగీకారానికి వచ్చినట్టు వివరించారు. ఆ ధరలను ఏపీఈఆర్సీ ఆమోదించిందని, వివిధ విద్యుత్తు సరఫరా సంస్థలకు ఏపీఎస్పీడీసీఎల్ చెల్లించాల్సిన బకాయిలు రూ.కోట్లలో ఉన్నాయని పేర్కొన్నారు. ఆ బకాయిలు చెల్లించరాదనే ఉద్దేశంతో వారు వివిధ ఎత్తుగడలు వేస్తోందని ఓ విద్యుత్తు సంస్థ తన పిటిషన్లో ఆరోపించింది.

## రాయితీపై వ్యవసాయ పరికరాలు

నిజామాబాద్,జూలై26(ఆర్ఎన్ఎ): వ్యవసాయ పెట్టుబడికి తోడు రాష్ట్రంలో వ్యవసాయంలో యాంత్రీకరణ పరికరాలను రైతులకు రాయితీపై అందించనున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. రైతులు నూతన ఆధునాతన పరికరాలతో వ్యవసాయం చేస్తే, సమయంతో పాటు కూలీలు, పెట్టుబడి ఖర్చులు తక్కువ వుతాయని వివరించారు. వీటిపై రైతులకు అవగాహన కల్పించడానికి రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ఆగ్రోస్ ద్వారా రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఇదిలావుంటే వ్యవసాయ మార్కెట్ యార్డుకు నాణ్యమైన పంటనే రైతులు తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు ఆదేశించారు. బుధవారం నిజామాబాద్ మార్కెట్ కమిటీలో వచ్చిన సరకును పరిశీలించారు. రైతుల నుంచి నేరుగా

కొనుగోలు జరిపే ప్రత్యేక కేంద్రాన్ని విజయవంతంగా నడిపించాలని సూచించారు. అధికారులందరూ రైతులకు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఈ-నామ్‌ను రైతులకు అందుబాటులో తెచ్చేలా చూడాలని వివరించారు.

# మున్సిపాలిటీలుగా మేజర్ పంచాయితీలు

విజయవాడ,జూలై26(ఆర్ఎన్ఎ): రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నూతన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి శరవేగంగా ముందుకు వెళ్తున్నారు. రాష్ట్రంలో 13 జిల్లాల్లో ఉన్న మేజర్ పంచాయతీలను మునిసిపాలిటీలుగా మారుస్తూ జీవో జారీ చేశారు. దీనిలో భాగంగానే కృష్ణాజిల్లాలో ఐదు మున్సిపాలిటీలు వచ్చాయి. పామర్రు, కైకలూరు, మైలవరం, విసన్నపేట, అవనిగడ్డ లకు ఇక మహాదశ పట్టనుంది. ఈ నిర్ణయంతో ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ఆయా నియోజకవర్గాల ప్రజల కల నెరవేరింది. జనాభా ప్రాతిపదికన చుట్టూ ఉన్న గ్రామాలు కలిపేందుకు ఇప్పటికే అధికారులు మ్యాప్ తయారు చేశారు. మ్యాపు అనుగుణంగానే మున్సిపాలిటీల ఆవిర్భావం జరుగుతుందని నేతలు పేర్కొన్నారు. కృష్ణాజిల్లా శివారు ప్రాంతమైన కైకలూరు మున్సిపాలిటీగా చేయటం హర్షణీయమని ఎమ్మెల్యే నాగేశ్వరావు అన్నారు. మరికొందరు మున్సిపాలిటీ అవటంతో ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అద్దెల భారం పెరుగుతుందని పన్నులు కూడా ప్రజలపై మరింత పెనుభారం ఎదుర్కోవాల్సి వస్తుందని సామాన్య ప్రజలు పేర్కొంటున్నారు.

## ప్రతిభ ఆధారంగా వలంటీర్ల ఎంపిక జరగాలి

### హైకోర్టులో పిల్ దాఖలు

అమరావతి,జూలై26(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ సేవలను ఇంటింటికి చేరవేసేందుకు ఎపి ప్రభుత్వం దాదాపు 4 లక్షల మంది గ్రామ వాలంటీర్లను నియమించి, ఇప్పటికే ఇంటర్వ్యూల ప్రక్రియను కూడా ప్రారంభించింది. ఈ నేపథ్యంలో గ్రామ వాలంటీర్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియపై ఎపి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. కేవలం ఇంటర్వ్యూ ద్వారానే కాకుండా ప్రతిభ ఆధారంగా ఈ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎపి యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాకేశ్ రెడ్డి ఈ పిల్ వేశారు. అభ్యర్థుల విద్యార్హత ఆధారంగా వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని కోరారు. వాలంటీర్ ఉద్యోగాల కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 104 లోపభూయిష్టంగా ఉందనీ, దీన్ని వెంటనే నిలుపుదల చేయాలని కోర్టుకు విన్నవించారు. ఈ నెల 11 నుంచి 25 వరకూ మండల పరిషత్ కార్యాలయాల్లో గ్రామ వాలంటీర్ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. ఎంపికైన అభ్యరులకు ఆగస్టు 1 న నియామక పత్రాలు అందజేస్తారు. వీరికి ఆగస్టు 5 నుంచి 10 వరకు పలు అంశాల్లో శిక్షణ ఇస్తారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15 న గ్రామ వాలంటీర్ల బాధ్యతలు అప్పగిస్తారు. ప్రతీ 50 ఇళ్లకు ఓ గ్రామ వాలంటీర్ ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## 30న పలమనేరులో సామాజిక చైతన్య సదస్సు

### కరపత్రాలు విడుదల చేసిన సిఐటియూ నేతలు

చిత్తూరు,జూలై26(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టేందుకు, కులాంతర వివాహాలపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న పలమనేరులో జరుగుతున్న సామాజిక చైతన్య సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు వాడ గంగరాజు పిలుపునిచ్చారు. పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణిలో అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం దళితులు సంఘాల నాయకులు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కెళవాతి సుబ్రహ్మణ్యం, నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ పలమనేరులో జరిగిన పరువు హత్య చాలా దారుణమైన అని ఇలాంటి సంఘటనలు మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా ఓ ప్రత్యేకమైన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. దళితుల సమస్యలపై ఈనెల 30న జరిగే సభను దళితులు, మానవతా వాదులు, ప్రజా సంఘాల నాయకులు, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత అయినప్ప టికీ ఈ దేశంలో అంబేద్కర్ కు సరైన గౌరవం దక్కలేదన్నారు. ఆయన విగ్రహం ఏర్పాటు చేసుకోవడం కోసం కూడా అనేక పోరాటాలు చేయాల్సి వస్తుందని అన్నారు. ఇలాంటి సందర్భంలో పాలకులు దళితులను విచ్చిన్నం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని దానిని ఐక్యంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అలాగే పలమనేరు సమీపంలోని ఊసర పెంట గ్రామంలోని కేశవులు కుటుంబానికి రక్షణ కల్పించాలని, హేమావతిని దారుణంగా హత్య చేసిన భాస్కర్ నాయుడు కుటుంబానికి తక్షణం శిక్ష పడేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న మతోన్మాద ప్రభుత్వం ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని తద్వారా మత ఘర్షణలు ఎక్కువ య్యాయని వీటిని కూడా ఐక్యంగా వ్యతిరేకించా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు తిప్పన మంజునాథ రంగప్ప నారాయణ పాల్గొన్నారు.

## వరంగల్ రూరల్ వార్తలు

# అడవికి నష్టం లేకుండా మేడారం జాతర ఏర్పాట్లు

- కోటి మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం
- ఇప్పటి నుంచే ఏర్పాట్లు మొదలవ్వాలి
- వచ్చే ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో జాతర
- కలెక్టర్‌తో సమీక్షించిన మంత్రి ఎర్రబెల్లి



వచ్చే ఏడాది జరుగనున్న మేడారం జాతరపై హన్మకొండలో ములుగు కలెక్టర్ తదితరులతో సమీక్షించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వరంగల్,జూలై26(నేటినిజం ప్రతినిధి): భక్తుల అవసరాలు ప్రాతిపదికగా మేడారం మహాజాతర ఏర్పాట్లు ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులను ఆదేశించారు. అతిపెద్ద వనజాతరగా గుర్తింపు పొందిన మేడారం జాతర ఏర్పాట్లలో అడవులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. శాశ్వత ప్రాతిపదికన భక్తులకు సౌకర్యం కల్పించే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వచ్చే యేడాది ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు జరగనున్న మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ఏర్పాట్ల ప్రతిపాదనల ప్రాథమిక ప్రణాళికను ములుగు కలెక్టర్ నారాయణరెడ్డి, ఏటూరు నాగారం ఐటీడీఏ పీవో చక్రధర్ రావు గురువారం హన్మకొండలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వివరించారు. ప్రతిపాద నలను పరిశీలించిన మంత్రి దయాకర్ రావు అధికారులకు పలు సూచనలు చేశారు. ' మేడారం దేశంలోనే పెద్ద గిరిజన జాతర. జాతరకు ఎన్నో రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు. మన రాష్ట్రంలో అన్ని ప్రాంతాల వారు వస్తారు. గత జాతరల గణాంకాలను చూస్తే ఈసారి భక్తుల సంఖ్య కోటి మంది కంటే ఎక్కువే ఉంటుంది. ఏర్పాట్లు సైతం అదే స్థాయిలో జరగాలి. మేడారం అంటేనే వన జాతర. వన జాతరలో అటవీ సంరక్షణ కూడా ముఖ్యమే. అడవులకు నష్టం జరగకుండా జాతర ఏర్పాట్లు ఉండాలని మంత్రి సూచించారు. తాగునీరు, పారిశుధ్యం చాలా ముఖ్యమైనవి. వీటితోపాటు మహిళా భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వత ప్రాతపదికన ఏర్పాట్లు ఉండాలి. మేడారం, ఆ చుట్టుపక్కల గ్రామాల శాశ్వత అవసరాలను పరిగణలోకి తీసుకోవాలి. అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకుని తుది ప్రతిపాదనలు రూపొందించాలి. జాతర ఏర్పాట్లలో భాగస్వాములు అయ్యే శాఖల అధికారులతో త్వరలోనే సమావేశం నిర్వహించుకుందాం. కొత్తగా మంజూరు అవసరం లేని... జాతరకు సంబంధించిన ఇతర ఏర్పాట్లను వెంటనే ప్రారంభించా లన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 లోపు అన్ని పనులు పూర్తి కావాలి. తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ చాలా ముఖ్యం. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు ఉండాలి. మేడారం జాతర పూర్తిగా ఆదివాసీల సంప్రదాయాల ప్రకారం జరగాలి. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ జాతరను విజయవంతం చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ ఆదేశించారు. భూపాలపల్లి జెడ్పీ చై ర్ పర్సన్ జక్కు శ్రీహర్షిని కూడా సమావేశంలో పాల్గొన్నారు.

# పాతబస్తీలో మరో ఘరానా మోసం

### రెండింతల డబ్బు ఆశచూపి 9కోట్లతో పరార్

### ఇద్దరు వ్యక్తుల మోసానికి బలైన వందలాదిమంది

హైదరాబాద్,జూలై25(ఆర్ఎన్ఎ): అధిక వడ్డీల పేరిట ఘరానా మోసానికి పాల్పడిన ఘటన మరోటి వెలుగు చూసింది. హైదరాబాద్ పాతబస్తీలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనుకునే వాళ్లే లక్ష్యంగా నిందితులు ఈ మోసానికి పాల్పడ్డారు. డబీర్‌పురకు చెందిన బుశ్రా, సిరాజ్ ఉర్ రెహ్మాన్ యూఐఆర్సీ పేరిట సొసైటీ స్థాపించి అయాకులను బురిడీ కొట్టించారు. పెట్టుబడులకు రెట్టింపు డబ్బు ఇస్తామంటూ ప్రజల్ని నమ్మబలికారు.

సుమారు 100 మంది వద్ద రూ.9 కోట్లు వరకు వసూలు చేసి ఆ డబ్బుతో ఉడాయించారు. బాధితుల ఫిర్యాదుతో ఈ వ్యవహారం బయటపడింది.

ఒక్కొక్కరి నుంచి లక్ష నుంచి రూ.90లక్షల దాకా వసూలు చేసినట్టు సమాచారం. ఇచ్చిన మొత్తానికి రెండింతలు ఇస్తామంటూ నమ్మబలికి మలక్‌పేట, సైదాబాద్, డబీర్‌పుర, సంతోష్‌నగర్, చార్మినార్, పాతబస్తీకి చెందిన ప్రజల నుంచి భారీగా నగదు సేకరించారు. ఎంతకాలమైనా డబ్బులు ఇవ్వకపోవడంతో అడగడానికి వెళ్లిన తమపై అనుచరులతో కలిసి దాడి చేసినట్టు బాధితులు వాపోతున్నారు.

తమను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకొని తమ డబ్బు తమకు వచ్చేలా చూడాలని పోలీసులను వేడుకుంటున్నారు.

ఈ వ్యవహారంపై గురువారం సైదాబాద్ పోలీసులకు ఐదుగురు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మోసానికి బలైన వారు ఎందరు? ఎవరెవరు ఎంతెంత మొత్తం కట్టారు? ఏ హామీతో డబ్బులను సేకరించారు? ఈ 100 మందే ఉన్నారా? ఇంకా వేరే ప్రాంతాల్లోనూ డబ్బు వసూలు చేశారా? అనే వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆ దంపతుల మోసానికి బలైపోయిన బాధితులెవరైనా ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలిపారు. దీనిపై ఆరా తీసిన మలక్‌పేట ఏసీపీ.. పూర్తి విచారణకు ఆదేశించినట్టు తెలుస్తోంది.

# బహిరంగ మలవిసర్జన చేస్తే 500 జరిమానా

కొత్తగూడెం,జూలై26(ఆర్ఎన్ఎ): పంచాయతీల్లో బహిరంగ మలవిసర్జన చేసే వారికి రూ.500 జరిమానా విధించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. అశ్వారావుపేట పట్టణం, పేరాయిగూడెం పంచాయతీని ఓడీఎఫ్‌గా ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆశాలత మాట్లాడుతూ.. మహిళలు బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేసి ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టుకోవద్దని అన్నారు.

హరితహారం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. అశ్వారావుపేట మండలంలోని 31 పంచాయతీలను ఓడీఎఫ్‌గా ప్రకటించే విధంగా పంచాయతీ కార్యదర్శులు, అంగనవాడీలు కృషి చేయాలని అన్నారు. సర్పంచి సుమతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణారావు, జడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జునరావు, ఎంపీపీ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ అర్బన్ వార్తలు

# మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

### వరంగల్ జడ్పీఛైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ వెల్లడి



వరంగల్ అర్బన్, జులై 26 (నేటినిజం ప్రతినిధి):మానవ మనుగడకు ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలు నాటి సంరక్షించాలని వరంగల్ జడ్పీ ఛైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ సూచించారు. గురువారం భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లో కావేరి విత్తన సంస్థ ఎండీ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో హరితహారంలో భాగంగా వెయ్యి మొక్కలు నాటారు. మండలంలోని బొల్లోనిపల్లి, రాంనగర్, గట్లనర్సింగాపూర్ గ్రామాల్లో ప్రధాన రహదారులకు ఇరువైపులా, చెరువు కట్టలపై మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. మొక్కల పెంపకంతో పర్యావరణం పరిరక్షించుకోవచ్చన్నారు. దత్తత తీసుకున్న మూడు గ్రామాల్లో వెయ్యి మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత విత్తన సంస్థ తీసుకుంటుందన్నారు. రూ.3 లక్షలతో ట్రీ గార్డులు ఏర్పాటు చేస్తామని విత్తన సంస్థ ఎండీ గుండవరం భాస్కర్‌రావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ ప్రొడక్షన్ ఏజీఎం సుమన్‌రావు, డ్వామా పీడీ రాము, ఎంపీపీ జక్కుల అనిత, జడ్పీటీసీ సభ్యుడు వంగ రవీందర్, మాజీఎంపీపీ సంపత్, సర్పంచులు చంద్రకళ, రాజు, కవిత, ఎంపీడీవో దేవకీదేవి, కొత్తకొండ దేవాలయ మాజీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు గొనెల సంపత్, దార్న శ్రీనివాస్, వెంకటయ్య, సంజీవ్, షెడ్రక్, రమేష్‌తోపాటు పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిఘా నేత్రాలకు రూ.10 లక్షల వితరణ

ములుకనూర్, వంగర పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు రూ.10లక్షల చెక్కును కావేరి విత్తన సంస్థ ఎండీ గుండవరం భాస్కర్‌రావు గురువారం అందజేశారు. వరంగల్ సీపీ రవీందర్ పిలుపు మేరకు ఎస్సై టీవీఆర్ సూరి, ఉపేందర్‌లు భాస్కర్‌రావును సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. మండలంలో 18గ్రామ పంచాయతీలలో 72 సీసీ కెమెరాలు, 10 కి.మీ., కేబుల్ తీగల ఏర్పాటుకు రూ.10 లక్షల చెక్కును గుత్తేదారుకు అందజేశారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ అర్బన్ జిల్లా సంక్షేమ అధికారిణి ఆర్. వరలక్ష్మి



వరంగల్ అర్బన్, జులై 26 (నేటినిజం ప్రతినిధి): వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి బాల్యవివాహాల నిరోధక చట్టం-2006ను అమలు చేయాలని వరంగల్ అర్బన్ జిల్లా సంక్షేమ అధికారిణి ఆర్. వరలక్ష్మి అన్నారు. గురువారం సుబేదారిలోని అసంత్‌భవన్‌లో ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సమితి, గర్ల్స్ అడ్వకసీ అలయన్స్ ఆధ్వర్యంలో రెజీనా చిన్నప్ప అధ్యక్షతన స్త్రీ, శిశుసంక్షేమం, పంచాయతీరాజ్, విద్యాశాఖ, బాలల పరిరక్షణ విభాగం, మున్సిపల్, చైల్డ్‌లైన్ 1098 సీడబ్ల్యూసీ ప్రతినిధులకు బాల్య వివాహాల నిరోధక చట్టం-2006, తప్పనిసరి వివాహాల నమోదు చట్టం-2002 అమలుపై జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ ప్రజల్లో ఆర్థిక పరిస్థితి, పేదరికం, నిరక్షరాస్యత తదితర కారణాలతో బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. వీటి వలన కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేస్తేనే ఇది సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో శ్రీదేవి, సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ మండల పరశురాములు, శ్యాంకుమార్, కృపాకర్, ఎర్ర శ్రీకాంత్, కొండ మంజుల, సంధ్యారాణి, తదితరులున్నారు.

# కన్నడ ఉద్యోగులకు జీతాల్లేనట్లే!

### - రాజకీయ అనిశ్చితికి ఉద్యోగులు బలి
### - ప్రభుత్వం ఏర్పాటైతేనే జీతాలు

బెంగళూరు, జులై26(ఆర్‌ఎన్‌ఎ) : కర్ణాటకలో నెలకొన్న రాజకీయ సంక్షోభం ఇప్పుడు ఉద్యోగుల పాలిట శాపంగా మారింది. ప్రస్తుతం అక్కడ బలపరీక్ష ఘట్టం మాత్రమే పూర్తయింది. ఇంకా ప్రభుత్వ ఏర్పాటు విషయంలో స్పష్టత రాలేదు. ఈ ప్రక్రియ ఆలస్యమయితే అక్కడి ప్రభుత్వ ఉద్యోగులు భారీగా నష్టపోనున్నారు. ఈ సంక్షోభం త్వరగా తేలకపోతే వారికి జీతాలు రావు. ఈ నెలాఖరులోపు కొత్త ప్రభుత్వం అధికారంలోకి వస్తే సరి..లేకపోతే వారికి ఈ నెలకు జీతాలు అందే పరిస్థితి లేదు. ఇప్పుడు అక్కడ ప్రభుత్వం లేదు. కాబట్టి ప్రభుత్వ ఖాజనా నుంచి నిధులు విడుదల కావు. ఆగస్టు 1 నుంచి ప్రభుత్వం నడవక పోతే ఉద్యోగులు భారీగా నష్టపోనున్నారు. ఏదీ తేలని పక్షంలో గవర్నర్ కూడా నిధులను విడుదల చేయలేరు. ఎందుకంటే కర్ణాటకలో ప్రభుత్వం మాత్రమే పడిపోయింది. అసెంబ్లీ రద్దుకాలేదు. ఈ క్రమంలో కన్నడనాట ఏర్పడిన రాజకీయ అనిశ్చితికి ఉద్యోగులు బలికానున్నారు. మరోవైపు బలపరీక్ష పూర్తయి రెండు రోజులు పూర్తి అవుతున్నా కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ఇంతవరకు స్పష్టత రాలేదు. భాజపా నేతలు ఈ మేరకు నేడు కేంద్ర మంత్రి, భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షాతో భేటీ అయ్యారు. ఆయన సూచనల మేరకు ప్రభుత్వ ఏర్పాటుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# సుస్థిర ప్రభుత్వ ఏర్పాటు అసాధ్యం

### - కర్ణాటక ఆపద్ధర్మ సీఎం కుమారస్వామి

బెంగళూరు, జులై26(ఆర్‌ఎన్‌ఎ) : రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు అసాధ్యమని, కర్ణాటక ఆపద్ధర్మ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో సుస్థిర ప్రభుత్వ ఏర్పాటు ఎవరి వల్లా సాధ్యం కాదన్నారు. ఈ మేరకు గురువారం ఆయనిక్కడ విలేకరులతో మాట్లాడారు.కాంగ్రెస్-జేడీఎస్ రెబెల్ ఎమ్మెల్యేల రాజీనామా రాష్ట్రంలో ఉప ఎన్నికలకు దారి తీసిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఎన్నికలు జరిగినప్పటికీ సుస్థిర ప్రభుత్వం ఏర్పడడం సాధ్యం కాదని చెప్పారు. తొలుత రెబెల్ ఎమ్మెల్యేగా మారి తర్వాత మనసు మార్చుకున్న కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే రామలింగారెడ్డి ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేయడం పట్ల ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# విధానపర నిర్ణయాల్లో కోర్టుల జోక్యం తగదు

### అసెంబ్లీ నిర్మాణంపై ప్రభుత్వ వాదన విచారణ నేటికి వాయిదా

హైదరాబాద్,జూలై26(ఆర్‌ఎన్‌ఎ): ఎర్రమంజిల్ భవనాల కూల్చివేతపై తెలంగాణ హైకోర్టులో విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. విచారణలో భాగంగా అసెంబ్లీ నిర్మాణంపై ప్రభుత్వం వివరణ ఇచ్చింది. విధానపరమైన నిర్ణయాల్లో కోర్టుల జోక్యం తగదని ప్రభుత్వం చెప్పుకొచ్చింది. అంతేకాదు.. సుప్రీంకోర్టు, హైకోర్టు గత తీర్పులను కోర్టుకు ప్రభుత్వం తెలిపింది. అసెంబ్లీ నిర్మాణానికి ప్లానింగ్ లేకుండా హెచ్‌ఎండీఏ అనుమతి తీసుకోలేమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. విస్తీర్ణం చూసిన తర్వాతే హెచ్‌ఎండీఏ అనుమతి కోరుతామని ప్రభుత్వం తెలిపింది. ట్రాఫిక్ సమస్యలన్నీ పాలసీ విధానాలకు సంబంధించినవని.. ప్రజా ప్రయోజనాల కోసమే డబ్బు ఖర్చు చేస్తున్నామని.. ఎక్కడా దుర్వినియోగం చేయడం లేదని తెలంగాణ ప్రభుత్వం కోర్టుకు వివరించింది. ప్రస్తుత అసెంబ్లీ భవనం 102 ఏళ్ల క్రితం నిర్మించారు. అది రాజుగారి నివాసం కోసం నిర్మించింది. కాలక్రమేణా అది అసెంబ్లీ భవనంగా మారిందని సర్కార్ చెప్పింది. అసెంబ్లీకి ఉండాల్సిన వసతులు, సౌకర్యాలు లేవు. ఎర్రమంజిల్ పురాతనమైన భవనం కాదని కూడా హైకోర్టుకు ప్రభుత్వం వివరణ ఇచ్చుకుంది. ఇందుకు స్పందించిన కోర్టును ఎలా సంతృప్తి పరుస్తారని ప్రశ్నించింది. తదుపరి విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.

# ప్రభుత్వంతో 108 ఉద్యోగుల చర్చలు విఫలం

అమరావతి,జూలై26(ఆర్‌ఎన్‌ఎ): ఎపిలో 108 ఉద్యోగులు, ప్రభుత్వ అధికారుల మధ్య గురువారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. పాత బకాయిలు చెల్లించడంతో పాటు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ.. 108 ఉద్యోగులు చేస్తున్న డిమాండ్‌కు ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాలేదు. తమకు న్యాయం చేయాలని నేటికి అయిదు రోజులుగా 108 ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే.. 26న 'చలో విజయవాడ ' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని 108 ఉద్యోగులు ప్రకటించారు. తమ ఉద్యోగ భద్రత విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన ఇవ్వాలనీ, లేదంటే సిఎం జగన్ తో మాట్లాడే అవకాశం కల్పించాలని 108 ఉద్యోగులు కోరారు. విజయవాడలోని గాంధీనగర్ ధర్నాచౌక్ లో గురువారం నిరవధిక నిరాహార దీక్షకు కూర్చుంటున్నామని 108 ఉద్యోగులు ప్రకటించారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటాలి

### సంరక్షణ బాధ్యత కూడా వారిదే

విజయనగరం,జూలై26(ఆర్‌ఎన్‌ఎ): అంగన్వాడీ కేంద్రాలలో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత చేపట్టాలని స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు ఆఫీసర్ డి.ఉమాభారతి కార్యకర్తలను కోరారు. బలిజిపేట ఐదో అంగన్వాడీ కేంద్రంలో గురువారం బలిజిపేట సెక్టార్ పరిధిలోని కార్యకర్తలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేంద్రాల ఆవరణలో ఉన్న ఖాళీ ప్రదేశాలలో కూరగాయల మొక్కలు పెంచాలని సూచించారు. ప్రతీ కేంద్రం ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు వరకు తెరచి ఉంచాలని, కేంద్రంలో పిల్లలు అందుబాటులో ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఉడికించిన గుడ్లు, పాలు తప్పని సరిగా ఇవ్వాలని ఆదేశించారు. కేంద్రంలో పరిశుభ్రత పాటిస్తేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి పాల్గొన్నారు. మరోవైపు ఇదే మండలంలోని తుమరాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన గొట్టపుబావికి మోటారు బిగించినప్పటికీ విద్యార్థులకు అవసరమైన తాగునీరు సరఫరా కావడం లేదని, దీంతో మరుగుదొడ్లను కూడా వినియోగించలేక ఇబ్బందులకు గురౌతున్నామని వారు వాపోయారు. గొట్టపుబావిలో జలాలు అడుగంటి పోవడంతో 10నికే నీటి సరఫరా నిలిచిపోతుందని వారు ఎమ్ఈవో సూర్యదేవుడికి వినతి పత్రం ఇచ్చారు. ఈ పాఠశాలలో అదనపు గొట్టపు బావిని తవ్వి నీటి ఇబ్బందులు తీర్చాలని విన్నవించారు. ఇదే విషయంపై విద్యార్థులంతా సంతకాలు సేకరించి వినతిపత్రాన్ని డీఈవోకు పంపనున్నట్లు వారు తెలిపారు.

# గొలుసు దుకాణంపై దాడి

విజయనగరం,జూలై26(ఆర్‌ఎన్‌ఎ): బలిజిపేట మండలంలోని అరసాడ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న గొలుసుదుకాణంపై పోలీసులు దాడిచేశారు.

గ్రామానికి చెందిన జి.శివున్నాయుడు ఇంటి నుంచి 24 మద్యం సీసాలను పట్టుకున్నారు. ఇతనిపై కేసు నమోదు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్సై శ్రీరాములు ఆధ్వర్యంలో సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. అనధికారికంగా గొలుసు దుకాణం నిర్వహించి పట్టుబడిన వారికి ప్రభుత్వం జైలుశిక్ష విధిస్తుందని, ఇలాంటి కార్యక్రమాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఎస్సై నరేశ్ ప్రజలకు సూచించారు.

## దాణా కుంభకోణం కంటే..

# 'నీరు - చెట్టు' పెద్ద స్కాం

### - ట్విట్టర్‌లో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

అమరావతి, జులై26(ఆర్‌ఎన్‌ఎ) : చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో జరిగిన నీరు- చెట్టు కార్యక్రమంలో పెద్ద స్కాం జరిగిందని వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన ట్విట్టర్‌లో చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. నీరు-చెట్టు కార్యక్రమం బీహార్ దాణా కుంభకోణం కంటే పెద్దదన్న విజయసాయి, రూ.22 వేల కోట్లను జన్మభూమి కమిటీలకు పంచిపెట్టారని ఆరోపించారు. సమగ్ర దర్యాప్తు జరిగితే చంద్రబాబు, చినబాబుతోపాటు అనేక పెద్ద తలకాయాలు బండారం బయటపడుతుందని విమర్శించారు. అంతేకాదు చంద్రబాబు చెప్పే మాటాలకు చేతలకు పొంతన ఉండదని విజయసాయి దుయ్యబట్టారు. బలహీన వర్గాలు, కాపులను ఆయన ఎప్పుడూ నమ్మరని, పీఏసీ ఛైర్మన్ పదవి విషయంలో బంధుప్రీతిని చాటుకున్నారని ధ్వజమెత్తారు. వరుస ట్వీట్లతో చంద్రాబాబుపై విజయసాయి మరోసారి విరుచుకుపడ్డారు. చంద్రబాబు మాటలకు చేతలకు పొంతన ఉండదని మరోసారి రుజువైందని, కాపులు, బలహీనవర్గాలను ఆయన ఎప్పుడూ విశ్వసించరని అర్థమైందని, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ పదవిని చాలా మంది ఆశించినా చివరకు పయ్యావుల కేశవ్‌ను ఎంపిక చేసి బంధుప్రీతిని చాటుకున్నారని ట్విట్టర్‌లో విమర్శలు గుప్పించారు.

## చంద్రయాన్-2..

# రెండో ప్రక్రియ విజయవంతం

అమరావతి, జులై26(ఆంఎన్‌ఎ) : భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ - 2లో రెండో ప్రక్రియ విజయవంతమైంది. జులై 22వ తేదీ మధ్యాహ్నం 2గంటల 43 నిమిషాలకు నింగిలోకి నిప్పులు చిమ్ముతూ చంద్రయాన్-2 దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. అనుకున్న సమయం ప్రకారమే మధ్యాహ్నం 2 గంటల 52 నిమిషాలకు పూర్తి చేశారు. జులై 24వ తేదీ బుధవారం మొదటి భూ కక్ష్యను పెంచగా.. శుక్రవారం కక్ష్యను పెంచారు. ప్రస్తుతం చంద్రయాన్ -2 వాహన నౌక 251ల56829 కిలో మీటర్ల ఎత్తున భూ కక్ష్యలోకి చేరింది. 883 సెకన్ల పాటు ఇంధనాన్ని మండించడం ద్వారా విజయవంతమైందని శాస్త్రవేత్తలు ప్రకటించారు. జులై 29వ తేదీన మూడో సారి కక్ష్యను పెంచుతామని.. ఆగస్టు 14వరకు ఇలా కక్ష్యలు పెంచే పనులు ఉంటాయని ఇస్రో వెల్లడించింది. జులై 15న చేపట్టాల్సిన ఈ మిషన్ టెక్నికల్ ప్రాబ్లమ్స్ కారణంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అనంతరం జులై 22వ తేదీన సక్సెస్ ఫుల్‌గా ప్రయోగం చేపట్టింది ఇస్రో. అన్నీ అనుకున్నట్లే జరిగితే.. ఈ ఏడాది సెప్టెంబర్ 7వ తేదీన జాబిలిపై విక్రమ్ ల్యాండర్ దిగుతుంది. అయ్యాక రోవర్-ప్రగ్యాన్ ఇస్రో...చంద్రయాన్-2 ద్వారా ఆర్బిటర్, లాండర్(విక్రమ్), రోవర్(ప్రగ్యాన్) ను పంపింది. చంద్రయాన్-2 ఉపగ్రహంలో 3850 కిలోగ్రాముల 13 పేలోడ్‌లు (ఆర్బిటర్‌లో 8, ల్యాండర్‌లో 3, రోవర్‌లో 2 పేలోడ్లు) ఉంటాయి. సెప్టెంబర్ నాటికి చంద్రుడి దక్షిణ ధ్రువం దగ్గర రోవర్ ల్యాండ్ అవుతుంది. చంద్రుని క్ష్యలోకి చేరిన తర్వాత చంద్రయాన్ విక్రమ్ ని రంగంలోకి దింపుతుంది. ఇది సేఫ్ గా సెప్టెంబర్-2019 నాటికి చంద్రునిపై ల్యాండ్ అవుతుంది. విక్రమ్ ల్యాండ్ అయ్యాక రోవర్-ప్రగ్యాన్ ముందుకు కొనసాగుతుంది. పేలోడ్ జెట్.. విక్రమ్.. ప్రగ్యాన్ చంద్రునిపై సమాచారాన్ని సేకరించడం ప్రారంభిస్తాయి. హైడ్రాక్సిల్, వాటర్ ఐస్ కు సంబంధించి మూలాలను ఫొటో తీస్తాయి. మిషన్ జీవితకాలం ఒక ఏడాది ఉంటుంది. అంటే... విక్రమ్, ప్రగ్యాన్ చంద్రుని ఉపరితలంపై ఒక లూనర్ డే ఉంటాయి. ఎర్త్ డేతో పోలిస్తే 14 ఎర్త్ డేలతో సమానం. అప్పటినుంచి చంద్రునిపై దాగిన రహస్యాలపై ప్రశ్నలకు సమాధానాలుగా ఒక్కొక్కటిగా ప్రపంచానికి తెలియజేయనున్నాయి

# త్వరలో నూతన ఐటీ పాలసీ

### - గత ప్రభుత్వ హయాంలో ఐటీ విధానం సరిగాలేదు
### - అందువల్లే గతంలో ఐటీ కంపెనీలు రాష్ట్రానికి రాలేదు
### - ఇన్నోవేషన్ హబ్‌కోసం రూ.100కోట్లు కేటాయించి ఖర్చు పెట్టింది సున్నా
### - రాబోయే రోజుల్లో స్టార్టప్ కంపెనీలు వస్తాయ్
### - అసెంబ్లీలో మంత్రి మేకపాటి గౌతంరెడ్డి

అమరావతి, జులై26(ఆంఎన్‌ఎ) : గత చంద్రబాబు ప్రభుత్వం గందరగోళానికి గురిచేసేరీతిలో ఐటీ విధానాన్ని అవలంబించడంతోపాటు ఐటీ కంపెనీలకు సరైన ప్రోత్సాహం అందించలేదని, అందువల్లే గతంలో ఐటీ కంపెనీలు రాష్ట్రానికి రాలేదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి తెలిపారు.

శుక్రవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. త్వరలో నూతన ఐటీ పాలసీని ప్రవేశపెడతామని అన్నారు. రాష్ట్రంలో ఇన్నోవేషన్ హబ్ కోసం గత చంద్రబాబు సర్కార్ రూ. 100 కోట్లు కేటాయించి.. ఖర్చు పెట్టింది సున్నా తెలిపారు. ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడంతోనే నాస్కామ్ ఏపీ రాకుండా వెళ్లిపోయిందన్నారు.

ప్రపంచంలోనే ఉత్తమమైన ఇంక్యూబేటరీ కంపెనీలతో తాము మాట్లాడుతున్నామని, ఇందులో ఇజ్రాయెల్‌కు చెందిన ఉత్తమ ఇంక్యూబేటరి కంపెనీ కూడా ఉందని తెలిపారు. ఈ మూడు ఇంక్యూబేటరీ కంపెనీలతో ఒప్పందం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కంపెనీలు వాళ్ల ఖర్చుతో రాష్ట్రంలో జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేయనున్నాయని, ఈ ఇంక్యూటేరీస్ ద్వారా రాబోయే రోజుల్లో స్టార్టప్ కంపెనీలు రానున్నాయని తెలిపారు. స్టార్టప్ కంపెనీలు వస్తే.. వాటితోపాటు వెంచర్ క్యాపిటలిస్టులు సహజంగా వస్తారని వెల్లడించారు. తెలంగాణ ఐటీ పాలసీ సరళంగా ఉండటంతో అక్కడ ఐదు లక్షల ఉద్యోగాలు సృష్టించారని గౌతంరెడ్డి తెలిపారు. కానీ, చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చిన ఐటీ పాలసీలు గందరగోళంగా సంక్లిష్టంగా ఉన్నాయని, ఈ పాలసీల వల్ల ఐటీశాఖలోనే ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. డీటీపీ పాలసీ కింద ప్రభుత్వం భూమిని కేటాయించగా.. దానిని పలు కంపెనీలు అభివృద్ధి ఇచ్చాయని, మళ్లీ ఆ భూమినే ప్రభుత్వం తిరిగి అద్దెకు తీసుకుందని వెల్లడించారు. ఈ డీటీపీ పాలసీల వల్ల చంద్రబాబు హయాంలో పెద్ద ఎత్తున ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని పేర్కొన్నారు. న్యాసెట్, సాఫ్ట్‌సాల్వ్, ఫ్లేకార్డు తదితర కంపెనీలకు భూములిచ్చి.. వాళ్లు అభివృద్ధి చేశాక మళ్లీ వారి నుంచి ప్రభుత్వం అద్దెకు తీసుకుని.. డబుల్ చెల్లింపులు జరిపిందన్నారు. ఏపీలో గత సర్కారు ఐటీ విధానం అయినవారికి ఒకవిధంగా బయటివారికి మరో విధంగా ఉండటంతో.. రాష్ట్రానికి ఐటీ కంపెనీలు రాలేదని వివరించారు. కేవలం పది పేజీల తెలంగాణ ఐటీ పాలసీ సరళంగా ఉండటంతో అక్కడికి కంపెనీలు వెళుతున్నాయని, తెలంగాణ ఐటీ పాలసీ తరహాలో సరళమైన సమగ్రమైన ఐటీ పాలసీని తీసుకురావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తున్నారని మంత్రి తెలిపారు.

# కార్గిల్ అమరులకు గవర్నర్ నివాళి

### రాజ్‌భవన్‌లో మొక్కలు నాటిన గవర్నర్ దంపతులు

అమరావతి,జూలై26 (ఆర్‌ఎన్‌ఎ): కార్గిల్ యుద్ధవీరులకు ఏపీ గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ నివాళులు అర్పించారు. వారి త్యాగాలు మరువలేనివని అన్నారు. ఆనాటి అసామాన్య ధైర్యసాహసాలు చూపిన సైనికులకు సాల్యూట్ చేశారు. ఈ సందర్భంగా విజయవాడ రాజ్‌భవన్ ప్రాంగణంలో గవర్నర్ దంపతులు బిశ్వ భూషణ్ హరిచందన్, సుప్రబ హరిచందన్ మొక్కలు నాటారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు గవర్నర్ నివాళులర్పించారు. చరిత్రలో ఈ రోజు చిరస్మరణీయమైనదని పేర్కొన్నారు. కార్గిల్‌లో అమరులైన జవాన్ల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్న ప్రధాని పిలుపు మేరకు మొక్కలు నాటినట్లు గవర్నర్ తెలిపారు. అమర వీరుల త్యాగానికి ప్రతీకగా దేశ ప్రజలు అందరూ కలిసి కట్టుగా ఉండాలని గవర్నర్ పిలుపునిచ్చారు. దేశ సమగ్రతను కాపాడాల్సిన అవసరం ప్రజలపై ఉందని చెప్పారు. దేశంలో ప్రతి పౌరుడూ ఐదు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని, తద్వారా మన ఆరోగ్యం కూడా కాపాడుకోవచ్చని చెప్పారు.

# పాలమూరు రైల్వేను పరిగణించండి

### పెండింగ్ పనులు పూర్తిచేయండి
### రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌కు ఎంపి మన్నె వినతి

న్యూఢిల్లీ,జూలై26 (ఆర్‌ఎన్‌ఎ): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని ఢిల్లీలో రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కలిసి ఎంపీ మన్నే శ్రీనివాస్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. మహబూబ్‌నగర్ నుండి హైదరాబాద్ రైల్వే డబ్లింగ్ పనులు, విద్యుద్దీకరణ పూర్తి చేయాలన్నారు.

2015-16లో 113 కిలోమీటర్ల దూరం, రూ. 728 కోట్ల అంచనాతో ప్రాజెక్ట్ చేపట్టడం జరిగింది. కానీ పనులు నెమ్మదిగా సాగుతున్నాయన్నారు.

డబ్లింగ్ పనులు పూర్తి చేయడం వల్ల మహబూబ్‌నగర్ నుండి సికింద్రాబాద్ వెళ్లే ఉద్యోగులకు, వేలాదిమంది ప్రయాణికులకు గంట సమయం ఆదా అవ్వడంతో పాటు, రాకపోకలు పెరిగి ప్రాంతం అభివృద్ధి చెందేందుకు వీలు ఉంటుంద న్నారు.

అలాగే మహబూబ్‌నగర్ - మునిరాబాద్ కొత్త రైల్వే లైన్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలన్నారు. 1997-1998లో 240 కిలోమీటర్లు, రూ. 645 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాజెక్ట్ ఏళ్లుగా పెండింగ్ లో ఉందన్నారు. వికారాబాద్- కృష్ణ రైల్వే లైన్ పనులు చేపట్టాలన్నారు. సామాజికంగా ఆర్థికంగా వెనకబడ్డ నారాయణపేట మక్తల్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 87 కిలోమీటర్ల రైల్వే పనులు పూర్తి చేస్తే ఆ ప్రాంతాలు అభివృధి చెందుతాయన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్, జిల్లా కేంద్రానికి సమీపంలోని దివిటిపల్లి రైల్వే స్టేషన్ విస్తరణ, ఆధునీకీకరణ చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ మెడికల్ కాలేజ్, టూరిస్ట్ స్పాట్ అయిన మయూరి పార్క్, ఐటీ కారిడార్, డబుల్ బెడ్ రూమ్ కాలనీలకు దివిటిపల్లి రైల్వే స్టేషన్ దగ్గరగా వున్నందున అభివృద్ధి చేస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

గద్వాల్-మాచర్ల రైల్వే లైన్ పనులు పూర్తి చేయాలన్నారు. 1992లో ప్రాజెక్ట్ మంజూరు అయినప్పటికీ పనులు ప్రారంభించలేదన్నారు. ఈ ప్రాజెక్టు దాదాపు ముప్పై ఏళుగా పెండింగ్ లో వుందన్నారు. ఈ రైల్వే లైన్ పూర్తి చేస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ప్రయోజనం ఉంటుందన్నారు. గద్వాల్ నుండి రాయచూరు 57 కిలోమీటర్ల రైల్వే లైన్ రూ. 46.10 కోట్ల అంచనాతో చేపట్టిన ప్రాజెక్ట్ పూర్తి చేస్తే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మధ్య రవాణా సంబంధాలు మెరుగు పడుతాయని ఎంపీ పేర్కొన్నారు.

# ముమ్మరంగా జలశక్తి అభియాన్

### గుర్తించిన గ్రామాల్లో కార్యాచరణ
### ప్రజలను చైతన్యం చేసే ప్రయత్నాలు

న్యూఢిల్లీ,జూలై26(ఆర్‌ఎన్‌ఎ): జల్‌శక్తి అభియాన్... జల సంరక్షణపై ప్రధాని నరేంద్ర మోదీ అత్యంత శ్రద్ధ కనబరుస్తున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా జులై 1 నుంచి సెప్టెంబరు 15 వరకు ఎంపిక చేసిన జిల్లాల్లో అమలు చేస్తున్నారు. జల సంపద సృష్టి, చైతన్య కార్యక్రమాల ద్వారా ప్రజా ఉద్యమంగా దీన్ని చేపట్టారు. గ్రావీణ భారతంలో కాల పరిమితితో కూడిన జల సంరక్షణ, సమర్ధ నీటిపారుదల కార్యక్రమాలు సాగుతున్నాయి. ఆయా రోజుల్లో సంబంధిత అధికారులు, భూగర్భ జల నిపుణులు, ఇంజినీర్లు తదితరులంతా జలసంరక్షణ కార్యక్రమాల్లో నిమగ్నమవుతున్నారు. జలశక్తి కింది ప్రత్యేకించి వేసవిలోను, వర్షాభావంతోను ఎండి పోయిన వివిధ ప్రాంతాల్లో జల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తారు. ఈమేరకు అధికారులు తమ నివేదికలను జల్‌శక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని తాగునీరు, పారిశుద్ధ్య విభాగానికి చెందిన పోర్టల్‌లో సమర్పిస్తారని సిబ్బంది వ్యవహారాల శాఖ ఆదేశాల్లో పేర్కొంది. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్రాలు ముందుకు వచ్చి జలసంరక్షణను యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సి ఉంది. తమిళనాడులో నీటి సమస్య విశ్వరూపం దాల్చింది. రాష్ట్ర రాజధాని చెన్నై నీటి కోసం అల్లాడిపోతోంది. దీంతో పొరుగు రాష్ట్రాల నుంచి అందాల్సిన నీటి కోసం తమిళనాడు ప్రభుత్వం ప్రయత్నించడంతోపాటు ప్రత్యామ్నాయ మార్గాలనూ అన్వేషిస్తోంది. తమిళనాడులో గతేడాది విపరీతమైన వరదలు వచ్చి చెన్నై నగరం నిండా మునిగింది. అలాంటి నగరంలో ఇప్పుడు మంచినీటి బొట్టుకోసం ప్రజలు తహతహలాడుతున్నారు. సముద్రం తలాపునే ఉన్నా మంచినీటి సమస్య తప్పడం లేదు. ట్యాంకర్ల కోసం ఎదురు చూస్తున్నారు. నీటి సమస్యలపై దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. వనరులను సద్వినియోగం చేసుకునే చిత్తశుద్ధి నేతల్లో కొరవడింది. దూరదృష్టి లేని నేతలు రాజ్యాలు ఏలడం వల్ల నీటి సమస్య ఏటేటా పెరుగుతంది. తమిళనాడు దీనికి ప్రబల ఉదాహరణగా చూడాలి. ఐదేళ్ల పాలనా కాలంలో కష్టపడితే జీవితాంతం నీటి సమస్య లేకుండా చేసుకునే అవకాశాలు ఉన్నా ప్రభుత్వాలు అటువైపు దృష్టి సారించడం లేదు. సైకిళ్ల పంపిణ,చీరలు ధోతుల పంపిణీలు ముఖ్యం కాదు. మంచినీటి ఎద్దడి లేకుండా ఐదేళ్ల ప్రణాళికలు రచించి ముందుకు సాగితే తప్ప రాష్ట్రాలు మనుగడ సాగించవని గుర్తుంచుకోవాలి. ఈ నేపథ్యంలో జల సంరక్షణను ప్రజా ఉద్యమంలా చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం కావడం ఆహ్వానించ దగ్గ విషయం. దేశంలో తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కొంటున్న 255 జిల్లాలకు ఇన్‌ఛార్జులుగా సీనియర్ అధికారులను నియమించింది. అదనపు, సంయుక్త కార్యదర్శులు సహా పలువురు ఉన్నతాధికారులను కేంద్ర ప్రభారీ అధికారులుగా రంగంలోకి దించింది. కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న జల్‌శక్తి అభియాన్ లో భాగంగా వీరంతా ఆయా జిల్లాల్లో జల సంరక్షణ, సమర్థ నీటిపారుదల కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించారు. మొత్తం 255 మంది ఉన్నతాధికారులు.. డైరెక్టర్ లేదా డిప్యూటీ కార్యదర్శి స్థాయి కేంద్ర ప్రభుత్వ అధికారులతో పాటు వివిధ స్థాయిల రాష్ట్ర, స్థానిక అధికారులు; భూగర్భ జల నిపుణులు, ఇంజినీర్లతో కూడిన బృందాలతో సమన్వయంగా పని చేస్తున్నారు. ఈమేరకు సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆదేశాలిచ్చింది. గుర్తించిన బ్లాక్‌లు, జిల్లాల్లో ఈ బృందాలు పర్యటించి.. జల సంరక్షణ తదితర కార్యక్రమాలు సమర్థంగా అమలయ్యేలా చర్యలు చేపడుతున్నారు. రుతుపవనాలు జాడలేక పోవడంతో మంచినీటి సరఫరా అన్నది కానరావడం లేదు. దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాల్లో ప్రజలకు నీళ్లు దొరకడం లేదు. పలుచోట్ల పరిస్థితి దయనీయంగా మారింది. తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బిందెడు నీటిని బంగారంలా భావించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తాగునీటి కొరతతో చెన్నైలో కొన్ని కంపెనీలు ఉద్యోగులను ఇంటినుంచే పనిచేయాలని సూచిస్తున్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో స్పష్టమవుతోంది. ఇక్కడేనా అంటే రాజస్థాన్ ,గుజరాత్‌లో కూడా ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. ఆంధ్రాలో కొన్ని జిల్లాలు, తెలంగాణలో కొన్ని జిల్లాలు కూడా ఇందుకు విరుద్ధంగా లేవు. ఇదంతా పాలకుల నిర్లక్ష్య ధోరణి, అనుభవరాహిత్యం, సమస్యలపట్ల చిత్తశుద్ధి లేకపోవడం కారణంగా భావించాలి. నిజానికి ఇలాంటి నపివేదికలు గతంలో తయారు చేసి ఉన్నాయి. కొత్తగా వీరు ఇప్పుడు చేసే అధ్యయనం వల్ల కాలయాపన తప్ప మరోటి కాదు. నిజానికి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం జలవనరులపై అధ్యయనం చేసి, ముందుకు సాగాలి.

## ఆజం తలను పార్లమెంట్‌కు వేలాడదీయాలి

### ఆజంఖాన్ వ్యాఖ్యలపై యూపి బిజెపి ఆగ్రహం

లక్నో,జూలై26(ఆర్‌ఎన్‌ఎ): లోక్ సభలో ట్రిపుల్ తలాఖ్ బిల్లుపై చర్చ జరుగుతున్నప్పుడు సమాజ్ వాదీ పార్టీ ఎంపి అజంఖాన్ డిప్యూటీ స్పీకర్ రమాదేవీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో అజంఖాన్ యుపి బిజెపి నాయకుడు అప్తాబ్ అద్వానీ అగ్రహం వ్యక్తం చేశాడు. అజంఖాన్ తల నరికి పార్లమెంట్ గుమ్మానికి కట్టాలని మోడీ ప్రభుత్వానికి సూచించాడు. ఇప్పుడున్న ఎంపిలో అజంఖాన్, అసదుద్దీన్ ఒవైసి వంటి వాళ్లు మహిళలను కించపరుస్తున్నారని వాళ్లకు గట్టిగా బుద్ది చెప్పాలని పిలుపునిచ్చారు. అజంఖాన్ పిచ్చి పట్టిన కుక్కలాగా మొరుగుతున్నాడని, పిచ్చి కుక్కను చంపినట్టు చంపాలని అప్తాబ్ మండిపడ్డారు. ఇంతకు ముందు జయప్రదపై చేసిన వ్యాఖ్యలు దుమారం లేపిన విషయం తెలిసిందే. ఆమె లోదుస్తులు ఖాకీ నెక్కర్ ధరించారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లోక్ సభలో రమాదేవీ మిమ్మల్ని తదేకంగా చూస్తున్నానని.. మీరే మో పక్కకు చూడమంటున్నారని, రోజంతా కళ్లలో కళ్లు పెట్టి చూడలని అజంఖామ్ వ్యాఖ్యలు పెనుదుమారం రేపుతున్నాయి. దీంతో సభలో ఉన్న బిజెపి సభ్యులు అజంఖాన్ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఐక్యంగా పనిచేసి మున్సిపల్ ఎన్నికల్లో పోరాడుదాం: వంశీచంద్

వనపర్తి,జూలై25(ఆర్‌ఎన్‌ఎ): పురపాలిక ఎన్నికల్లో ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్‌ను గెలిపించుకుందామని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీ చందర్‌రెడ్డి అన్నారు. గురువారం అమరచింత మండలంలో కాంగ్రెస్ మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పురపాలిక చట్టాన్ని తెరాస తనకు అనుకూలంగా మార్చుకుంటూ వస్తుందని ఆయన విమర్శించారు. కోర్టు అక్షింతలు వేసినా ప్రభుత్వంలో మార్పు రాలేదన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగర్‌గా చేస్తామని చెప్పిన కేసీఆర్ ఆ విధంగా ఎక్కడ చేశారో చూపాలని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్‌లో గుంతలు లేని రోడ్డును చూపిస్తే తాము ప్రజలనుంచి చందాలు వసూళ్లు చేసి రూ.కోటి ప్రభుత్వానికి ఇస్తామని ఆయన సవాలు చేశారు. ఈ నెల 27 నుంచి 30 వరకు ఇంటింటికీ కాంగ్రెస్, వాడవాడలా కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీహరి, సత్యనారాయణ, అయూబ్‌ఖాన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్‌ఎస్ అరాచకాలపై పోరాడతాం

### - బీజేపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు
### - బీజేపీ ఎంపీ బండి సంజయ్

న్యూఢిల్లీ, జులై26(ఆర్‌ఎన్‌ఎ) : తెలంగాణలో టీఆర్‌ఎస్ అరాచక పాలనను కొనసాగిస్తుందని, వీటిపై పోరాటం సాగించి ప్రజల్లో ఎండగడతామని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ తెలిపారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో ఏకపక్ష నిర్ణయాలతో కేసీఆర్ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. సచివాలయం, అసెంబ్లీ నిర్మాణాలను ప్రతిపక్షాలు, ప్రజలంతా వ్యతిరేకిస్తున్నా కూల్చివేసేందుకు సిద్ధమవ్వడం దుర్మార్గమని అన్నారు. కరీంనగర్ జిల్లా కోడిముంజ గ్రామంలో గౌడ కులస్తుపై టీఆర్‌ఎస్ నాయకులు దాడులు చేశారని చెప్పారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయడానికి వెళ్లిన బాధితులపై పోలీసులు ఉల్టా కేసులు బనాయించారని మండిపడ్డారు. తగిన ఆధారాలు లేకుండానే వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారని.. అన్యాయంగా 13 మందిని నెలరోజులపాటు జైలుకు పంపారని అన్నారు. బాధితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి హింస్తున్నారని ఆరోపించారు. బాధితులకు బెయిల్ ఇవ్వకుండా టీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకున్నారని విమర్శించారు. కులవృత్తి చేసుకుని జీవించే గౌడ కులస్తుల పట్ల ఈ రకంగా వేధింపులకు పాల్పడటం సరికా దన్నారు. ఈ ఘటనపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బాధితుల పక్షాన బీసీ కమిషన్ ఆశ్రయిస్తామని తెలిపారు. వారికి న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# సైనికుల సంక్షేమాన్ని బాధ్యతగా గుర్తించాలి

### వారి కోసం నిధుల కేటాయింపు పెరగాలి

న్యూఢిల్లీ,జూలై26(ఆర్‌ఎన్‌ఎ): కార్గిల్ విజయం సాధించి రెండు దశాబ్దాలు పూర్తయ్యింది. ఎందరో సైనికులు తమ ప్రాణాలను ఎదురొడ్డి భరతమాత సరిహద్దులను కాపాడారు. ఇందుకు సదా వారు ప్రాతఃస్మరణీయులు. వారికి మనమంతా నిరంతరం స్మరించుకునే వేళ జాతి యావత్తూ నివాళి అర్పించి, తమ కృతజ్ఞతలు చాటింది. ప్రతికూల పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి పోరాడుతున్న మన జవాన్లు నిజంగా ప్రాతఃస్మ రణీయులు. దేశం కోసం వారు చేస్తున్న త్యాగం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. చలిలో,మంచులో, ఎండలో, వానలో ఇలా అనేక విపత్కర పరిస్థితుల్లో వారు దేశం కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రధానంగా సరిహద్దుల్లో వారు పడుతున్న అగచాట్లు చూస్తే మనకోం వారు ఎంతగా జీవితాన్ని ధారపోస్తున్నారో అర్థం చేసుకోవాలి. అలాంటి వారికి సరిగా భోజనం పెట్టడం లేదన్న ఓ సైనికుడి ఆవేదన దేశవ్యాప్తంగా సంచలనం అయ్యింది. దీనిపై విమర్శలు చెలరేగాయి. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పెట్టినందుకు అభినందించాల్సిన అధికారులు అతడిపై చర్యకు పూనుకున్నారు. ఇక ఆర్మీ చీఫ్ అయితే సోషల్ మీడియాకు ఎక్కడం సరికాదని అన్నారు. అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. నిరంతరం పహారాలో ఉంటూ దేశమాత రక్షణలో చస్తున్న వారికి ఇస్తున్న గౌరవం ఇదేనా అన్నది ఆలోచించాలి. గతంలో జరిగిన ఈ సంఘటన ఆధారంగా ఇవాళ మనం కార్గిల్ వీరులను స్మరించుకుంటున్న వేళ సైనికుల సంక్షేమంపైనా శ్రద్ద వహించాలి. వారికి మంచి భోజనం ఇవ్వడం మన బాధ్యత. వారిని అందరికన్నా గౌరవంగా చూసుకోవాల్సి అవసరం ఉంది. కుటుంబాలకు, భార్యా బిడ్డలకు, తల్లిదండ్రులకు దూరంగా మన కోసం నిత్యం కష్టపడు తున్న జవాన్లకు సెల్యూట్ చేయాల్సిందే. వారి సంక్షేమం గురించి ఆలోచించాల్సిందే. తోచిన విధంగా సైనిక సంక్షేమానికి పాటుపడాలి. ప్రాణాలు, కుటుంబ క్షేమం కన్నా దేశ క్షేమమవే పరమావధిగా భావించి దేశ రక్షణలో నిమగ్నమైన సైనికుల క్షేమాన్ని, వారి కుటుంబాల క్షేమాన్ని సమాజం బాధ్యతగా స్వీకరించాలి. విధి నిర్వహణలో కొనసాగుతున్న సైనికులు, మరణించిన సైనికుల కుటుంబ సభ్యులు, యుద్ధంలో క్షతగాత్రులైన వారు, వైకల్యం పొందినవారు, మాజీ సైనికులు ప్రయోజనం పొందాలన్న ఆకాంక్షతో సైనిక సంక్షేమాన్ని ముందుకు తీసుకుని వెళ్లాలి. సైనికులు ఎంతో సాహసంతో సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తుంటారు. వారికి ఇలా మనం ఉన్నామని వెన్నుతట్టి ప్రోత్సహిస్తే భరతమాత సేవలో పునరంకితం కాగలరు. దేశ భద్రత కోసం సైనికులు నిరంతరం కృషి చేస్తున్నారు. సైనికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం సమగ్ర విధానాన్ని తీసుకువస్తున్నట్లు సిఎం కెసిఆర్ గతంలో అసెంబ్లీ పసాక్షిగా ప్రకటించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సైనికుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ నిధికి అండగా నిలిచేందుకు ప్రభుత్వ పిలుపుతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రభుత్వ ఉద్యోగులు ముందుకు వచ్చారని ప్రకటించారు. ఏడాదికి సీఎం, మంత్రులు రూ.25 వేలు చొప్పున, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు రూ.10 వేలు చొప్పున, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఒక రోజు వేతనం ఇవ్వడానికి ముందుకు వచ్చారని తెలిపారు. ఇలా ప్రజలు కూడా తమవంతుగా కనీసం ఓ రూపాయి అయినా వితరణగా ఇచ్చుకుంటే ఈ నిధి మరింతగా పెరగగలదు. ఇది వారి మనోధైర్యాన్ని పెంచగలదు. పరమవీరచక్ర, మహావీరచక్ర, అశోకచక్ర, కీర్తిచక్ర, శౌర్య చక్ర, సేనా పతకం పొందినవారికి ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్న నగదు కంటే ఎక్కువ ఇవ్వనున్నట్లు సిఎం తెలిపారు. పరమవీరచక్ర, అశోకచక్ర అవార్డు పొందిన తెలంగాణ బిడ్డలకు దేశంలోనే అత్యధికంగా రూ.2.25 కోట్ల రూపాయలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇప్పటిదాకా పరమవీరచక్రకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ.8 లక్షలు ఇస్తోంది. తెలంగాణ సర్కార్ జై జవాన్ నినాదం అందుకుని వారి సంక్షేమానికి చిత్తశుద్ది తో ప్రయత్నాలు మొదలు పెట్టిందని చెప్పారు. సైనికుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు చేసిన ప్రకటన ఆదర్శం కావాలి. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 21 జిల్లాల్లో కూడా సైనిక సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం సైనికుల సంక్షేమంలో భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలన్న సిఎం కెసిఆర్ ఆకాంక్ష మిగతా రాష్ట్రాలకే కాకుండా కేంద్రానికి కూడా ఆదర్శం కావాలి. ఎందరో మాజీ సైనికులకు, వారి కుటుంబాలకు ఈ నిర్ణయం భరోసా నింపనుంది. అయితే దీనిని ఎంతవరకు ముందుకు తీసుకుని వెళ్లారన్నది ప్రకటించాలి.

## టిక్ టాక్ దెబ్బకు ఉద్యోగం ఊడింది

అహ్మదాబాద్,జూలై 26 (ఆర్‌ఎన్‌ఎ): 'టిక్ టాక్' ఫీవర్ అందర్నీ ఊపేస్తోంది.. ఇటీవల ఖమ్మంలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఆఫీసులో టిక్ టాక్ వీడియోలు చేసి, క్రమశిక్షణా చర్యలకు గురైన సంఘటన మర్చిపోకముందే గుజరాత్ లో మరో ఘటన చోటుచేసుకుంది. గుజరాత్ లోని మెహసానా జిల్లా లంఘ్ నాజ్ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న అర్పితా చౌదరి టిప్ టాప్ గా ముస్తాబై పోలీస్ స్టేషన్ లోనే టిక్ టాక్ చేసింది. డ్యూటీ పక్కనపెట్టి 'యే జవానీ హై దివానీ' సినిమాలోని ఓ పాటకు చిందేసింది.

అక్కడితో ఆగకుండా ఎలా ఉందోచెప్పాలంటూ దాన్ని వాట్సాప్ లో అందరికీ షేర్ చేసింది. అదికాస్తా వైరల్ గా మారి గుజరాత్ పోలీస్ ఉన్నతాధికారుల కంట పడింది.. విధినిర్వహణలో టిక్ టాక్ వీడియోలు ఏంటని సీరియస్ అయిన అధికారులు ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఉండి యూనిఫాం ధరించకుండా టిక్ టాక్ వీడియోలు చేయడంపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు డీఎస్పీ మంజితా వంజరా తెలిపారు.

## గవర్నర్ నిర్ణయం చెంపపెట్టులాంటిది: జీవన్ రెడ్డి

కరీంనగర్,జూలై26(ఆర్‌ఎన్‌ఎ): మున్సిపల్ చట్టాన్ని గవర్నర్ తిరస్కరించి పంపిన తీరు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నైతికత ఉంటే కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఇంకా పదవిలో కొనసాగే అర్హత లేదన్నారు. గవర్నర్ మొదటి సారి విజ్ఞత ప్రదర్శించారని ప్రశంసించారు. కేసీఆర్ ఒక్క చింతమడకకే సీఎం కాదని.. రాష్ట్రం మొత్తానికి సీఎం అన్న సంగతి గుర్తించుకోవాలని హితవు పలికారు. రాగద్వేషాలకు అతీతంగా ప్రజలనందరిని సమానంగా చూస్తానని ప్రమాణం చేసిన కేసీఆర్ రాజ్యాంగ ఉల్లంఘనలు చేస్తున్నారని తెలిపారు. కెసిఆర్ కేవలం తనకు అనుకూలమైన పనలునే చక్కబెడుతున్నారని అన్నారు.

## ఉద్యోగం ఇప్పిస్తానంటూ యువతితో ఉడాయింపు

### కారు నంబర్ ఆధారంగా పోలీసుల గాలింపు

హైదరాబాద్,జూలై26(ఆర్‌ఎన్‌ఎ): అత్యంత నాటకీయ ఫక్కీలో ఓ యువతిని కారులో కిడ్నాప్ చేసుకుని ఉడాయించిన యువకుడి కోసం పోలీసులు రంగంలోకి దిగారు. అతని కోసం వేట మొదలు పెట్టారు. హయత్‌నగర్‌లో అపహరణకు గురైన యువతి కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. ఉద్యోగం ఇప్పిస్తానంటూ గుర్తు తెలియని వ్యక్తి బుధవారం ఓ యువతితో పరారయ్యాడు. బొంగులూరు రహదారిపై టీ దుకాణదారు వద్దకు వచ్చిన ఓ వ్యక్తి.. తన పేరు శ్రీధర్ రెడ్డి అంటూ పరిచయం చేసుకున్నాడు. తన తల్లి వైద్యురాలు.. తండ్రి న్యాయమూర్తి, సోదరుడు పోలీస్ కమిషనర్ అని చెప్పాడు. సచివాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ దుకాణ యజమానిని నమ్మించాడు. 21 ఏళ్ల తన కుమార్తెకు ఉద్యోగం కావాలని టీ దుకాణం నిర్వాహకుడు కోరాడు. దీంతో ఆ యువకుడు తన కారులో తండ్రీ కుమార్తెను నెక్లెస్ రోడ్డు, సచివాలయం పరిసర ప్రాంతాల్లో తిప్పాడు. తిరిగి వెళ్లే క్రమంలో ధ్రువీకరణ పత్రాల నకలు తేవాలని యువతి తండ్రికి చెప్పాడు. దీంతో అతడు కారు దిగగానే యువతితో పాటు ఆగంతకుడు కారులో పరారయ్యాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఆ యువతిని విజయవాడ వైపు తీసుకెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. కారు నంబర్ ఆధారంగా విజయవాడలో పోలీసులు గాలిస్తున్నారు.

# హయత్‌నగర్ కిడ్నాప్ కేసులో పురోగతి

### కిడ్నాపర్ పాత నేరస్థుడిగా గుర్తింపు
### విజయవాడకు చెందిన రవిశంకర్‌గా గుర్తింపు
### దొంగిలించిన కారు నంబర్ ఆధారంగా గాలింపు

హైదరాబాద్,జూలై26(ఆర్‌ఎన్‌ఎ): హైదరాబాద్ నగరంలోని హయత్‌నగర్‌కు చెందిన యువతి అపహరణ కేసులో పోలీసులకు కీలక ఆధారం లభించింది. హయత్‌నగర్‌లో సినీఫక్కీలో జరిగిన యువతి కిడ్నాప్ కేసులో నిందితుడిని పోలీసులు గుర్తించారు. కిడ్నాప్ చేసిన వ్యక్తి విజయవాడలో పాత నేరస్థుడు రవిశంకర్‌గా గుర్తించారు. పోలీస్ కస్టడీ నుంచి తపించుకొని తిరుగుతున్న రవిశంకర్.. వారం రోజుల క్రితం కర్ణాటకలో సీబీఐ ఆఫీసర్ అని చెప్పి కార్ దొంగతనం చేసి వచ్చాడని తెలుస్తోంది.

నిందితుడు రవి శంకర్ కోసం కర్ణాటక, విజయవాడలో ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఈ నెల 23న యువతి కిడ్నాప్ అయ్యింది. కర్ణాటకలో కారు దొంగిలించి.. సిటీకి వచ్చిన దుండగుడు.. మాయమాటలతో బీ ఫార్మసీ చదువుతున్న యువతిని కిడ్నాప్ చేశాడు. జాబ్ ఇప్పిస్తానని తండ్రిని నమ్మించి కిడ్నాప్ చేశారు. దీంతో కూతురు కిడ్నాప్ అయిందని తెలుసుకుని పోలీసులకు కంప్లయింట్ చేశాడు యాదయ్య. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉద్యోగం ఇప్పిస్తానని ఈ నెల 23న మాయమాటలు చెప్పి యువతి, ఆమె తండ్రి, సోదరుడిని ఇబ్రహీంపట్నం నుంచి నిందితుడు కారులో తీసుకెళ్లాడు. మార్గమధ్యంలో తండ్రి, సోదరుడిని దించేసి వెళ్లిపోయాడు.

ారి ఫిర్యాదు మేరకు యువతి ఆచూకీ కోసం పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపడుతున్నారు. విజయవాడ, బెంగళూరు నగరాలతోపాటు జాతీయ రహదారులపైనా పోలీసులు గాలిస్తున్నారు. యువతిని అపహరించిన సమయంలో ఉపయోగించిన కారు కూడా నిందితుడు దొంగలించిందేనని పోలీసులు గుర్తించారు.

కారు నెంబరు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ నగర శివారులోని మల్లేపల్లికి చెందిన యాదయ్య కొంతకాలంగా ఇబ్రహీంపట్నం మండలం బోంగులూర్ గేట్ వద్ద చిన్న టిఫిన్ సెంటర్ నడుపుతున్నాడు.

23వ తేదీ ఉదయం టిఫిన్ సెంటర్‌కు కారులో వచ్చిన రవిశంకర్ తనకు తానుగా ఉన్నత కుటంబానికి చెందిన వ్యక్తిగా పరిచయం చేసుకున్నారు. యాదయ్యను మాయమాటలతో నమ్మించి, కూతురికి ఉద్యోగం ఇస్తానని నమ్మబలికాడు.

దీంతో నిందితుడి మాటలు నమ్మిన యాదయ్య.. తన కూతురు సోని, కుమారుడు డేవిడ్‌ను తీసుకొని నిందితుడి కారులో హైదరాబాద్ నగరంలోకి వచ్చారు.

ఉన్నతాధికారులు అందుబాటులో లేరని చెప్పి... తిరిగి ఇబ్రహీంపట్నం వెళ్లే సమయంలో కుమారుడు డేవిడ్‌ను బీఎన్ రెడ్డినగర్‌లో దింపేశాడు. బాట సింగారంలో సోని భీపార్మసీ పూర్తి చేసిన కళాశాలకు వెల్దామని కారును హయత్‌నగర్‌వైపు తీసుకొచ్చాడు. భీపార్మసీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి కాగితాలు తీసుకురావాలని యాదయ్యను హయత్‌నగర్‌లో దింపేశాడు.

దుకాణానికి వెళ్లి వెనక్కి తిరిగి చూసేసరికి నిందితుడు కారులో తన కూతురును అపహరించుకుపోయాడని యువతి తండ్రి యాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కారులో తీసుకెళ్తున్న సమయంలో యువతి ప్రతిఘటించలేదా? అని పోలీసులు అనుమానిస్తున్నారు. ఒకవేళ యువతికి తెలిసిన వ్యక్తే...ఆమెను తీసుకెళ్లాడా అనే కోణంలోనూ వివరాలు సేకరిస్తున్నారు.

## చైనాను ముంచెత్తుతున్న వరదలు

బీజింగ్,జూలై25 (ఆర్‌ఎన్‌ఎ): చైనాలో వానలు బీభత్సం సృష్టిస్తున్నాయి. భారీ వర్షాలకు వరదలు పోటెత్తాయి.

కొండ చరియలు విరిగిపడుతున్నాయి. దీంతో 16 మంది మృతి చెందా రు. మరో 30 మంది గల్లంత య్యారు. గుయిజ్‌హౌ ప్రావిన్స్‌లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో 21 ఇండ్లు నేలమట్టం అయ్యాయి. ఈ ప్రమాదంలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. గాయపడ్డ 11 మందిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మరో 30 మంది గల్లంతైనట్లు అక్కడి అధికారులు తెలిపారు. హెజ్‌గాంగ్ ఏరియాలో మరొకరు మృతి చెందారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# సైన్యంలో చేరిన ధోనీ

### కాశ్మీర్‌లో శిక్షణ

శ్రీనగర్,జూలై26(ఆర్‌ఎన్‌ఎ):వరల్డ్ కప్ తర్వాత రెండు నెలల పాటు క్రికెట్‌కు విరామం ఇచ్చాడు సీనియర్ క్రికెటర్ ధోని. ఈ విరామ సమయంలో ఓ 15 రోజులపాటు భారత సైన్యంలో పనిచేసేందుకు సిద్ధమయ్యాడు . లెఫ్టినెంట్ హోదాలో పారాచూట్ రెజిమెంట్‌లో ట్రైనింగ్ తీసుకోని ఆర్మీలో సేవ చేయనున్నాడు. గురువారం 106 టెర్రిటోరియల్ ఆర్మీ బెటాలియన్‌లో చేరిన ధోని ఈ నెల 31 నుంచి ఆగష్టు 15 వరకు బెటాలియన్‌తో శిక్షణ తీసుకోనున్నాడు. ఈ ట్రైనింగ్‌లో పెట్రోలింగ్, పోస్ట్ డ్యూటీ, గార్డ్ పనులను చేయనున్నాడు. దేశ రక్షణకు అహర్నిశలు శ్రమించే సైన్యం విధుల్లో తానూ భాగం కావాలని ధోని ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఇండియన ఆర్మీ చేత 2011 లో లెఫ్టినెంట్ కల్నల్ హోదా పొందిన ధోని.. 2015లో ప్యారా ట్రూపర్‌గానూ క్వాల్గి÷ అయ్యాడు. ప్రస్తుతం ధోనీ ప్రాతినిధ్యం వహిస్తున్న బెటాలియన్ బెంగళూరు హెడ్ క్వార్టర్స్ కేంద్రంగా పనిచేస్తుంది.



క్రీడలు...

# క్వార్టర్స్‌లో సింధు




టోక్యో: ఈ సీజన్‌లో ఎలాగైనా టైటిల్ దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉన్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు మరో ముందడుగు వేసింది. ఇటీవలి ఇండోనేషియా ఓపెన్‌లో తృటిలో టైటిల్ చేజార్చుకున్న సింధు..జపాన్ ఓపెన్‌లో అదరగొడుతున్నది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్ పోరులో సింధు 11-21, 21-10, 21-13 తేడాతో అయా ఒహోరి(జపాన్)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గంటపాటు జరిగిన పోరులో ప్రత్యర్థి నుంచి పోటీ ఎదురైనా..వెరవకుండా కడదాకా పోరాడి ముందంజ వేసింది. దీని ద్వారా ముఖాముఖి పోరులో జపాన్ షట్లర్‌పై 8-0 ఆధిక్యం దక్కించుకుంది. ఇద్దరి మధ్య మ్యాచ్ తొలుత ఆసక్తికర పోరు జరిగింది. ఆదిలో జపాన్ షట్లర్ దూకుడు కనబరిచి వరుస పాయింట్లు కొల్లగొట్టింది. మ్యాచ్‌లో పుంజుకునేందుకు సమయం తీసుకున్న సింధు బ్రేక్ సమయానికి 5-11లో వెనుకంజలో కనిపించింది. దీనికి తోడు అనవసర తప్పిదాలు చేయడం ఒహోరికి కలిసొచ్చింది. అయితే రెండో గేమ్‌లోనూ ఒకింత తడబడ్డ ఈ తెలుగమ్మాయి 0-2తో వెనుకబడ్డట్లు కనిపించినా ఆ తర్వాత ఒక్కసారిగా పుంజుకుని పోటీలోకి వచ్చింది. మ్యాచ్‌లో తొలిసారి ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించింది. ఒక్కసారి ఆధిక్యంలోకి వచ్చిన సింధు వెనుదిరిగి చూసుకోలేదు. ఈ క్రమంలో కండ్లు చెదిరే స్మాష్‌లకు తోడు డ్రాప్ షాట్లతో హైదరాబాదీ విజృంభించి రెండో గేమ్‌ను ఖాతాలో వేసుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ తనదైన జోరు కనిబరిచిన సింధు ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశమివ్వకుండా గేమ్‌తో పాటు మ్యాచ్‌ను దక్కించుకుంది. శుక్రవారం జరిగే క్వార్టర్స్‌లో అకానె యమగుచితో సింధు తలపడుతుంది.

జపాన్ ఓపెన్‌లో సాయి ప్రణీత్ జోరు కనబరుస్తున్నాడు. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో ప్రణీత్ 21-13, 21-16తో కాంటా సునెయమ(జపాన్)పై అలవోక విజయం సాధించాడు. 45 నిమిషాల పాటు జరిగిన పోరులో వరస రెండు గేమ్‌ల్లో ప్రణీత్ ప్రత్యర్థిని చిత్తుచేసి క్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. తొలి గేమ్‌లో 13 పాయింట్ల కోసం ఇద్దరు హోరాహోరీగా తలపడ్డారు. ఆ తర్వాత కోర్టు నలువైపులా పాదరసంలా కదులుతూ ప్రణీత్ తనదైన శైలిలో వరుస పాయింట్లతో మ్యాచ్‌ను తన వైపునకు తిప్పుకున్నాడు. క్వార్టర్స్‌లో టామీ సుగియార్తో(ఇండోనేషియా)తో ప్రణీత్ ఆడుతాడు. మరోవైపు శ్రీకాంత్‌కు షాకిచ్చిన హెచ్‌ఎస్ ప్రణయ్ 9-21, 15-21తో రస్మాన్ జెమ్కె(డెన్మార్క్) చేతిలో టోర్నీ నుంచి నిష్క్రమించాడు. పురుషుల డబుల్స్‌లో భారత జోడీ రాంకీరెడ్డి, చిరాగ్ శెట్టి 15-21, 21-11, 21-19తో చైనా ద్వయం కాయి జియాంగ్, లు చెంగ్‌పై విజయంతో క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో రాంకీరెడ్డి, అశ్విని పొన్నప్ప ద్వయం 16-21, 17-21తో థాయ్‌లాండ్ జోడీ దెచ్‌పోల్ పువరకోర్న్, సాప్సిరీ చేతిలో ఓడింది.

# దూసుకొస్తున్న గైక్వాడ్




భారత్-ఏ తరఫున పరుగుల వరద పారిస్తూ టీమ్‌ఇండియా ఓపెనింగ్ రేసులోకి రుతురాజ్ గైక్వాడ్ దూసుకొస్తున్నాడు. హిట్టింగ్‌తోనే కాదు కళాత్మక షాట్లతోనూ వన్డేల్లో 110కుపైగా స్ట్రయిక్‌రేట్‌ను సులువుగా నమోదు చేయొచ్చని చాటిచెబుతున్నాడు. భారత్-ఏ తరఫున ఆడిన గత ఎనిమిది వన్డేల్లో(677 పరుగులు, 116స్ట్రయిక్‌రేట్) రెండు శతకాలు(187×,125×), నాలుగు అర్ధ శతకాలతో(84,74,85,99) రెచ్చిపోయి... సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడే సత్తా ఉందని చాటిచెబుతున్నాడు. 22 ఏండ్ల వయసులో అత్యంత పరిణతితో బ్యాటింగ్ చేస్తూ ఆశ్చర్యపరుస్తున్నాడు. విండీస్-ఏతో జరిగిన ఐదు వన్డేల అనధికార సిరీస్‌లో మూడు హాఫ్ సెంచరీలు బాది అద్భుత ప్రదర్శన చేశాడు.

నాలుగేండ్లకే బ్యాట్‌పట్టి..

పుణెలో పుట్టిన రుతురాజ్.. నాలుగేండ్లకే బ్యాట్‌పట్టాడు. 12 ఏండ్ల వయసులో వెంగ్‌సర్కార్ క్రికెట్ అకాడమీలో చేరి కఠోర శిక్షణ తీసుకున్నాడు. 19 ఏండ్ల వయసులో మహారాష్ట్ర తరఫున ఫస్ట్‌క్లాస్‌లో అరంగేట్రం చేసి... నిలకడగా రాణిస్తూనే ఉన్నాడు. లిస్ట్-ఏ కెరీర్‌లో 39 మ్యాచ్‌ల్లో 59.94 సగటుతో 2వేలకు పైగా పరుగులు చేసి సత్తా చాటాడు. అందులో ఐదు సెంచరీలు సహా 14 అర్ధశతకాలు ఉన్నాయి . 20 ఏండ్ల వయసులో విజయ్‌హజారే ట్రోఫీలో అరంగేట్రం చేసి మహారాష్ట్ర తరఫున ఏడుమ్యాచ్‌లు ఆడి 444 పరుగులు చేసి వారెవ్వా అనిపించాడు.

ప్రతీమ్యాచ్‌లో నాటౌట్‌గా ఉండాలనుకుంటా..

శ్రీలంక-ఏతో ఈ ఏడాది మొదట్లో జరిగిన అనధికార వన్డే సిరీస్ తొలి రెండు మ్యాచ్‌ల్లో వరుసగా 187,125 పరుగులు చేసి గైక్వాడ్ నాటౌట్‌గా నిలిచాడు. ఆ సమయంలో ఓ ఇంటర్వ్యూలో అతడు చెప్పిన మాటలు అందరినీ ఆకర్షించాయి. నేను ఎక్కువగా సిక్స్‌లు కొట్టాలనుకోను. గ్యాప్స్‌లోనే ఆడుతా. సింగిల్స్, డబుల్స్‌కు ప్రాధాన్యమిస్తా. సుదీర్ఘంగా ఆడాలనుకుంటా. అసలు ప్రతీమ్యాచ్‌లో నాటౌట్‌గా నిలవాలన్నదే నా లక్ష్యం అని గైక్వాడ్ చెప్పాడు.

పోటీ ఎక్కువే..

బ్లూజెర్సీ ధరించి... సీనియర్ జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించడమే తన లక్ష్యమని గైక్వాడ్ చాలాసార్లు చెప్పాడు. అయితే భారత వన్డే జట్టు ఓపెనింగ్‌లో రోహిత్ శర్మ, శిఖర్ ధవన్ వంటి సీనియర్లు ఉన్నారు. అలాగే కేఎల్ రాహుల్, పృథ్వీషా, గిల్ నుంచి అతడికి తీవ్రపోటీ ఉంది. అయితే, ఇలాగే అద్భుత ప్రదర్శన కొనసాగిస్తూ సెలెక్టర్లను మెప్పిస్తానని రుతురాజ్ గైక్వాడ్ ఎంతో ఆత్మవిశ్వాసంతో చెబుతున్నాడు

# ఆర్థిక సాయంతో రైతులకు భరోసా

## ఖాతాల్లో చేరుతున్న నగదు

నిజామాబాద్,జూలై26 (ఆంఎన్‌ఎ): ఎకరాకు 5వేల ఆర్థిక సాయం వల్ల జిల్లాలో అనేకమంది రైతులకు ప్రత్యక్షంగా ఆర్థిక సాయం అందుతోంది. రైతుల కమిటీల ద్వారా సాయం అందించడంతో డబ్బులు అందుకున్న రైతుల్లో భరోసా నింపుతోంది. రాష్ట్రంలో రైతుల బతుకు బాగుపడు తుందని అన్నారు. ఉమ్మడి జిల్లా మొత్తంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం కొంతభూమి లెక్కలోకి వచ్చింది. లెక్కల్లోకి రానకుండా మిగిలిన భూమి ఎవరిదనేది తేల్చాలి. వాటిని రైతులు సాగు చేసుకుంటున్నా.. వారి పేరున లేకపోవడంతో సమగ్ర సర్వేలో వారి పేర్లు నమోదు చేసుకోవడం లేదు. వీటన్నింటి సరి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సరిచేసిన భూవివరాల ఆధారంగానే పెట్టుబడి ఇచ్చే పథకం అమలు చేస్తున్నారు. ఆ మేరకు రైతుల వివరాలు పొందు పరుస్తున్నామని వ్యవసాయా ధికారులు తెలిపారు. ఇవన్నీ అమలై ఓ ఐదేళ్లు గడిచాక రైతు జీవితాల్లో ఎంతో మార్పు వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. బ్యాంకులు రైతుల ఇళ్ల ముందు నిలబడి అప్పులిచ్చే పరిస్థితి వస్తుందన్నారు. అప్పుల పాలై ఆర్థికంగా చితికిపోతున్న దశలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపడుతోందని పలువురు రైతులు చెప్పారు. ప్రస్తుతం వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి వాటిని పరిష్కరించుకునే దిశగా నేరుగా సాయం అందిస్తున్నారు. అలాగే పంటల ధరల విషయంలో రైతు సంఘాలు కీలకం కానున్నాయి. ఏదైనా పంటకు మార్కెట్లో ధర రాని పక్షంలో రాష్ట్ర రైతు సంఘం జోక్యం చేసుకొని నేరుగా పంటను కొనుగోలు చేస్తుంది. ఇందుకు ప్రభుత్వం సంఘానికి రూ.500 కోట్ల మూల నిధిని సమకూరుస్తుంది. వీటిపై గ్రామ రైతు సంఘాల సమక్షంలో విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకుంటారు.

# బిందు సేద్యం కింద రాయితీ పరికరాలు

ఖమ్మం,జూలై26(ఆర్‌ఎన్‌ఎ): జిల్లాకు బిందు, తుంపర్ల సేద్యం కింద లక్ష్యం మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు ప్రకారం అర్హులకు సబ్సిడీ ఇవ్వనున్నారు. ఇందుకోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ అధికారి తెలిపారు. మీసేవ ద్వారా బయోమెట్రిక్ విధానంలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సమీపంలోని ఉద్యాన విస్తరణ అధికారులు, ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారులు, లేదా జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమలశాఖ కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు. పండ్ల తోటలు, మిరప, మొక్కజొన్న, చెరకు, పామాయిల్ తోటలు, కూరగాయలు, పూలతోటలు, పెంచే రైతులకు తెలంగాణ సూక్ష్మసేద్యం పథకంలో 80 శాతం నుంచి 100 శాతం వరకు రాయితీపై బిందు సేద్యం పరికరాలను, 75 శాతం రాయితీపై తుంపర్ల సేద్యం పరికరాలను సరఫరా చేస్తారు. రైతుల పొలంలో బోరు, లేదా బావి ఉండి విద్యుత్తు కనెక్షన్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 90శాతం, ఇతర రైతులకు 80 శాతం, సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై సూక్ష్మసేద్య పరికరాలిస్తారు. తుంపర్ల సేద్యం అయితే అన్ని తరగతుల రైతులకు 75 శాతం రాయితీపై ఒక హెక్టారు వరకు పరికరాలు మంజూరు చేస్తారు.

# కుటుంబ పాలనగా మారిన తెలంగాణ

## దుబారా ఖర్చులకే ప్రాధాన్యం: డిసిసి

నిజామాబాద్,జూలై26(ఆర్‌ఎన్‌ఎ): కోటి ఆశలతో ఆవిర్భవించిన కొత్త రాష్ట్రం నలుగురు కుటుంబ సభ్యుల దోపిడీ ప్రభుత్వంగా మారిందని డిసిసి అధ్యక్షుడు తాహిర్‌బిన హుదాన్ అన్నారు. సంపన్న రాష్ట్రాన్ని దివాళా తీయించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కొత్తగా మళ్లీ సచివాలయం,అసెంబ్లీ కట్టడం దుబారా తప్ప మరోటి కాదన్నారు. ప్రాజెక్టలన్నింటిలోనూ టెండర్లు అడ్డగోలుగా పెంచేసి వాటిలో పెద్ద మొత్తంలో కమీషన్ పొందుతున్నారని ఆరోపించారు. దళితులు, బలహీన, అణగారిన వర్గాలంటే కేసీఆర్‌కు గిట్టదని ఆరోపించారు. తెరాస ప్రభుత్వం అడుగడుగునా అణగారిన వర్గాలను మోసం చేస్తోందని అన్నారు. కుటుంబ కబంధ హస్తాల నుంచి తెలంగాణను కాపాడుకోవాల్సి ఉందన్నారు. ఈ ప్రభుత్వాన్ని సాగ నంపే విధంగా ప్రజలు తిరుగుబాటు చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. రైతులకు ఏక కాలంలో రుణాలు మాఫీ చేయకపోవడంతో పరిస్థితి దయనీ యంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, దళితులకు మూడు ఎకరాల భూమి, నిరుద్యోగులకు ఉద్యోగాలు, పేదలకు రెండు పడకల ఇళ్లు వంటి పథకాలు ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. తెలంగాణ వచ్చినందుకు గర్వంగా ఉన్నా.. తెరాస పాలన తీసికట్టుగా మారిందని ధ్వజమెత్తారు. మిషన్‌కాకతీయలో అవినీతి చోటు చేసుకుందని విజిలెన్సు విభాగం కేసులు నమోదు చేసినా చర్యలు లేవన్నారు. ఎస్సీ ఉపప్రణాళిక నిధులు పక్కదారి పట్టించారని విమర్శించారు.

# అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై భజరంగ్ దళ్ ఆగ్రహం

## హైదరాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్,జూలై26 (ఆర్‌ఎన్‌ఎ): మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మతవిద్వేషాలు రెచ్చగొడు తున్నారని భజరంగ్ దళ్ హైదరాబాద్ విభాగం ఆరోపించింది. కరీంనగర్ బహిరంగ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలపై భజరంగ్ దళ్ నాయకులు అభ్యంతరం చెప్పార . అక్బరుద్దీన్‌పై కేసు నమోదు చేయాలని సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్‌లో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 23న కరీంనగర్‌లో జరిగిన ఓ సభలో అక్బరుద్దీన్ ఒవైసీ ఓ మతానికి చెందిన వారిని, యువతను రెచ్చగొడుతూ మాట్లాడారనీ ఫిర్యాదులో పేర్కొన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడారనీ మతాల మధ్య విద్వేషం సృష్టించేలా ఆ కామెంట్స్ ఉన్నాయని అన్నారు. ఫిర్యాదులో భజరంగ్ దళ్ నాయకులు వివరాలు తెలిపారు. అక్బరుద్దీన్ ఓవైసీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సిఎం స్పందించాలని ఇప్పటికే ఎంపి బండి సంజయ్ కోరారు. అక్బరుద్దీన్ తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నల్లగొండలో వ్యక్తి దారుణ హత్య

నల్లగొండ,జూలై26 (ఆంఎన్‌ఎ): జిల్లా కేంద్రంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానిక రెడ్డి వసతిగృహం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. హత్యకు గల కారణం, మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# అమాంతం పెరిగిన టమాటా ధరలు

## కిలో 50రూపాయలకు చేరిన రేటు

## కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి

హైదరాబాద్,జూలై26 (ఆర్‌ఎన్‌ఎ): టమాటాలు ధరలకు రెక్కలు వచ్చాయి. మార్కెట్లో ఇప్పుడు కిలో టమాటా 50 రూపాయ లుగా అమ్ముతున్నారు. టమాటాల దిగుబడి తగ్గిందని వ్యాపారులు అంటున్నారు.

ఎండల తాకిడికి టమాట పంట తీవ్రంగా దెబ్బతిన్నది. రైతులు వేసిన పంటలు సరిగా పూతకు రాకపోవడంతో టమాట పంట దిగుబడి పడిపోయి ంది. దీంతో టమాటను, పచ్చి మిర్చిని చిత్తూరు జిల్లాలోని మదనపల్లి నుంచి దుగుమతి చేసుకుంటున్నారు. అలాగే ఉల్లిపాయల ధరలు కూడా కన్నీరు పెట్టిస్తున్నారు. మేలరకం ఉల్లిగడ్డలను కిలో 28 నుంచి 30 వరకు అమ్ముతున్నారు. తెల్ల ఉల్లిగడ్డ అయితే 30 నుంచి 40 వరకు అమ్ముతున్నారు. వర్షాలు ముఖం చాటేయడం, ఇంకా ఎండలు కొనసాగుతుండడంతో కూరగాయల ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. మార్కెట్‌లో ఏ కూరగాయనూ కొనేట్టు లేదని గృహిణులు వాపోతున్నారు. రూ. 20 కూడా పలకని వంకాయలు ప్రస్తుతం 60 రూపాయలకు పెరగగింది. బీన్స్ ధరలు 300 దాకా వెళ్లాయి. గతానికి భిన్నంగా జిల్లాల్లో కూరగాయల సాగు కూడా గణనీయంగానే పెరిగిపోయింది. పొరుగు జిల్లాల నుంచి కూరగాయల తెచ్చుకోకుండా రైతులు స్థానికంగా కూరగాయలు పండిస్తున్నా ధరలు మాత్రం సామాన్యులకు అందనంత దూరంలో ఉన్నాయి. కూరగాయల ధరలు పెరగడంతో ఆకు కూరలతో సరిపెట్టుకుందామనుకున్నా వాటి ధరలు కూడా అదేస్థాయిలో ఉన్నాయి. ఏ రకం ఆకు కూర కావాలన్నా రూ.20 పెట్టాల్సిందే. కొత్తిమిర, పాలకూర అసలు నాణ్యమైనది దొరకని పరిస్థితి వచ్చింది. రూ. 10కి రెండునుంచి పాలకూర కట్టలు రాగా ఇప్పుడు రూ. 20 రూపాయలు పెట్టినా 5 కట్టలే ఇస్తున్నారు. గత రెండు నెలలుగాధరలు ఇదే స్థాయిలో ఉన్నాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి ధరలు సామాన్యులను కలవర పెడు తున్నాయి. కిలో కూరగాయలు కొందామని వచ్చిన వినియోగదారులు పావు కిలోతో సరి పుచ్చుకునే పరిస్థితులు ఉన్నాయని వాపోతున్నారు. అన్ని కూరల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. రోజురోజుకు దిగుబడులు తగ్గి ధరలు మండిపోతున్నాయి. గత ఏడాది వర్షాభావ పరిస్థితులు, వేసవి ఎండల దెబ్బకు కూరగాయల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. వీటిని సాగుచేసిన ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గిపోయి బోర్లు ఎండిపోవడం కూడా ధరలు పెరగడానికి ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. దేశ్యాప్తంగా అన్ని కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. కూరగాయలతో పాటు ఆకు కూరలది అదే పరిస్థితి. ఒక్క ఆలుగడ్డ తప్ప అన్నింటి ధరలు రెట్టింపు కావడంతో వినియోదారులు లబోదిబో మంటున్నారు. ఆయా ప్రాంతాలలో వేసిన కూరగాయల తోటలు ఎండల దాటికి వట్టి పోవడం, కొన్ని చోట్ల బోర్లు ఎండిపోవడం లాంటి సమస్యలు రైతన్నలను వెంటాడుతున్నాయి. అన్ని జిల్లాల్లో వ్యవసాయాధికారుల ప్రోత్సాహంతో కూరగాయల సాగు విస్తీర్ణం భారీగానే పెరిగిపోయింది. అయితే పంట మాత్రం రైతుల చేతికి పూర్తి స్థాయిలో రాలేదు. గత ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడం, ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతల కారణంగా సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. అన్ని ప్రాంతాలలో కూరగాయల సాగు ఎక్కువగా చేస్తున్నారు. టమాట, బీరకాయ, దొండకాయ, కాకర, గోకర, పచ్చిమిర్చి, బెండకాయ, వంకాయ, దోసకాయ, సొరకాయ, ఆకు కూరలు పంటలు వేసినా రైతులకు అక్కరకు రాకపోవడంతో ధరలు మిన్నంటాయని చెప్పొచ్చు.

# వ్యవసాయానికి అనుబంధంగా మొక్కల పెంపకం

## లాభాలు వస్తాయంటున్న కలెక్టర్

## రైతులను చైతన్యం చేస్తూ ప్రోత్సాహం

ఆదిలాబాద్,జూలై26 (ఆర్‌ఎన్‌ఎ): ఎప్పుడూ వినూత్న కార్యక్రమాలతో ముందుండే ఆదిలాబాద్ కలెక్టర్ దివ్య దేవరజాన్ హరితహారం విసయంలోనూ రైతులను చైతన్యం చేస్తున్నారు. మొక్కలతో కూడా లాభాలు పొందవచ్చిన సూచిస్తున్నారు. వ్యయసాయంతో పాటు గట్లపై మొక్కలు పెంచితే భవిష్యత్‌లో లాభాలు దక్కుతాయని సూచిస్తున్నారు. రైతులకు ఆదాయం పెంచేందుకు వ్యవసాయానికి అనుబంధ మొక్కలు అందజేయాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాది ప్రభుత్వం గంధం, వెదురు మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ మొక్కల ద్వారా రైతులకు ఉపాధి వస్తుందన్నారు. అధికారులు రైతులకు అవగాహన కల్పించి చేల గట్లపై మొక్కలు నాటించాలని తెలిపారు. గౌడ కులస్తుల కోసం ఈత మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే ఎక్సైజ్ అధికారులు స్థలాలను గుర్తించడం జరిగిందని త్వరలో ఈ మొక్కలను నాటించాలని సూచించారు. ఈ మొక్కలు పెరిగిన తర్వాత వీటి ద్వారా గౌడ కులస్తులకు

ఆదాయం వస్తుందన్నారు. ప్రభుత్వం చేపట్టే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. హరితహారం కార్యక్రమం దేశానికే ఆదర్శమని జిల్లా కలెక్టర్ అన్నారు. అడవులు అంతరించిపోవడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లిందన్నారు. దీంతో సరైన సమయంలో వర్షాలు కురియడం లేదన్నారు. వేసవి కాలంలో ఎండల తీవ్రత పెరిగి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని తెలిపారు. అడువులకు పూర్వవైభవం తీసుక వచ్చేందుకు హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇలాంటి కార్యక్రమం దేశంలో ఎక్కడా అమలు కావడంలేదని కొనియాడారు. జిల్లాకు నిర్దేశిరచిన లక్ష్యాన్ని మించి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అవసరమైన మొక్కలను అందజేయాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాద్యాతను తీసుకోవాలన్నారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలను పెంచి లాభాలు పంచుకోవాలని అన్నారు.

# పంటమార్పిడి వ్యవసాయమే మేలు

ఆదిలాబాద్,జూలై26(ఆర్‌ఎన్‌ఎ): సేంద్రియ ఎరువులతో సాగు చేస్తే భావితరానికి మంచి పంటలు పండే భూములను అప్పగించినట్లవుతుందని నీటి పారుదల శాఖ అధికారులు అన్నారు. పంట మార్పిడి విధానంలో సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చున్నారు.

ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి, ఉట్నూర్, గుడిహత్నూర్, ఇచ్చోడ తదితర మండలాల్లోని సాగు భూములు ఆవాలు, ధనియాల పంటల సాగుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. పంటల సాగులో రసాయనాల వాడకం తగ్గించాలన్నారు. జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతు శిక్షణ శిబిరాలునిర్వహించిఅవగాహన కల్పిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా రైతులు సోయా పంటను సాగు చేస్తున్నప్పుడు నిజామాబాద్ జిల్లా రైతులను ఇక్కడికి తీసుకొచ్చి పంటపై అవగాహన కల్పించామన్నారు. అనంతరం అక్కడి రైతులు నిజామాబాద్ జిల్లా సోయా పంటలు సాగు చేస్తున్నట్లు గుర్తు చేశారు.

# డియర్ కామ్రేడ్ రివ్యూ




అర్జున్‌రెడ్డి, గీతగోవిందం, టాక్సీవాలా విజయాలతో యువతరం ఆరాధ్య కథానాయకుడిగా పేరుతెచ్చుకున్నారు విజయ్‌దేవరకొండ. తెరపై అతడి ఛరిష్మాతో వ్యక్తిగత జీవితంలోని విభిన్నమైన దృక్పథం అతడికి అంతులేని అభిమానగణాన్ని తెచ్చిపెట్టింది. ఈ సక్సెస్‌ల తర్వాత విజయ్‌దేవరకొండ కథానాయకుడిగా నటించిన చిత్రం డియర్ కామ్రేడ్. గీతగోవిందం సినిమాలో తమ కెమిస్ట్రీతో తెలుగు ప్రేక్షకుల్ని అలరించిన విజయ్‌దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటించిన సినిమా కావడంతో ప్రారంభం నుంచే ఈ చిత్రం అందరిలో ఆసక్తిని రేకెత్తించింది. ఈ జోడీ మరోసారి ప్రేక్షకుల్ని ఆకట్టుకుందా? కొత్త దర్శకుడైన భరత్ కమ్మను నమ్మి విజయ్‌దేవరకొండ చేసిన ఈ సినిమా అతడికి సక్సెస్‌ను అందించిందా లేదా అన్నది తెలియాలంటే కథలోకి వెళ్లాల్సిందే..

చైతన్య అలియాస్ బాబీ(విజయ్ దేవరకొండ) కాకినాడలో ఓ స్టూడెంట్ లీడర్. దేనికి భయపడని తత్వం తనది. ఆవేశం ఎక్కువే. తదుపరి పరిణామాల గురించి ఆలోచించకుండా తాను అనుకున్నది చేసి తీరుతాడు. అతడి జీవితంలోకి అనుకోకుండా అపర్ణాదేవి అలియాస్ లిల్లీ (రష్మిక మందన్న) ప్రవేశిస్తుంది. బాబీ పక్కింట్లో దిగుతుంది. లిల్లీ అమయాకత్వం, అల్లరి మనస్తత్వం చూసి బాబీ ఆమెను ప్రేమిస్తాడు. తొలుత బాబీ ప్రేమను తిరస్కరించిన లిల్లీ కూడా అతడిని ఇష్టపడతుంది. బాబీ కోపం, ఆవేశం కారణంగా కొద్దిరోజుల్లోనే లిల్లీ అతడికి దూరమవుతుంది. లిల్లీ జ్ఞాపకాల నుంచి దూరమయ్యేందుకు ప్రపంచం గురించి తెలుసుకొనే ప్రయత్నంలో దేశాటనలో ఉన్న బాబీకి మూడేళ్ల తర్వాత క్రికెట్‌కు దూరమై మానసిక సమస్యలతో బాధపడుతూ ఓ హాస్పిటల్‌లో చికిత్సపొందుతున్న లిల్లీ కనిపిస్తుంది. తిరిగి ఆమెను బాబీ మామూలు మనిషిని చేస్తాడు. ఆ తర్వాత ఏమైంది? లిల్లీ క్రికెట్‌కు ఎందుకు దూరమైంది?లిల్లీ కోసం బాబీ ఎలాంటి పోరాటం చేశాడు?బాబీ ప్రేమను లిల్లీ ఎలా గుర్తించింది? అన్నదే ఈ చిత్ర ఇతివృత్తం.

మనం ప్రేమించే వాటి కోసం దేనికి, ఎవరికి భయపడకుండా పోరాటం చేయాలి. ఈ పోరాటంలో మన వెంట కడవరకు ఉండేవాడే నిజమైన కామ్రేడ్ అనే పాయింట్‌ను ఆధారంగా చేసుకొని దర్శకుడు భరత్‌కమ్మ ఈ కథను రాసుకున్నారు. సమాజంలో చాలా మంది అమ్మాయిలు తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని వెల్లడించడానికి భయపడుతున్నారు. పరువు గురించి ఆలోచించో, భయంవల్లనో కుటుంబ సభ్యులు కొన్ని సార్లు వారిని వెనక్కిలాగుతున్నారు. అలా చేయడం తప్పు. వారికి న్యాయం చేయడానికిఎవరో ఒకరు ముందుకు రావాలనే సందేశానికి ఓ జంట ప్రేమకథను, వారి భావోద్వేగాల్ని జోడిస్తూ దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందించారు. కష్టసుఖాల్లో ప్రియురాలికి ఓ కామ్రేడ్ ఎలా అండగా నిలిచాడు..ఐదేళ్ల ప్రయాణంలో ఆ జంట జీవితంలోని మధురానుభూతులు, అవరోధాల్ని కవితాత్మకంగా హృదయానికి హత్తుకునేలా సినిమాలో ఆవిష్కరించారు.

కాలేజ్ ఎపిసోడ్, బాబీ, లిల్లీ ప్రేమాయణంతో ప్రథమార్ధం ఆహ్లాదభరితంగా సాగిపోతుంది. ఆవేశం, ధిక్కార స్వభావంతో విజయ్ తన స్నేహితులతో కలిసి చేసే పనులన్నీ నిజమైన కాలేజ్ వాతావరణాన్ని కళ్ల ముందు ఆవిష్కరిస్తాయి. లిల్లీ పాత్ర పరిచయంతోనే కథను లవ్‌ట్రాక్‌లోకి మళ్లించారు దర్శకుడు. బాబీని లిల్లీ ఆటపట్టించడం, క్రికెటర్‌గా లిల్లీ ప్రతిభను చాటే సన్నివేశాలన్నీ సహజంగా నిజజీవితాలకు దగ్గరగా తీర్చిదిద్దారు. బాబీని విడిచి లిల్లీ దూరంగా పోవడంతో ప్రథమార్థాన్ని ముగించిన దర్శకుడు ద్వితీయార్థంలో తిరిగి వారు ఎలా కలుసుకున్నారు?లిల్లీ కలల సాధనలో బాబీ ఆమెకు ఎలా తోడుగా నిలిచాడు? ఆమె సమస్యలపై ఎలాంటి పోరాటం సాగించాడో చూపిస్తూ ఎమోషనల్‌గా నడిపించారు. పతాక ఘట్టాల్ని సందేశాన్ని జోడిస్తూ తీర్చిదిద్దారు. అవకాశాల్ని ఎరగా చూపిస్తూ మహిళలపై కొందరు ఎలా అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు? ప్రతిభ ఉండి కూడా తమ కలల్ని సాధించలేక చాలా మంది క్రీడాకారులు ఎలాంటి సంఘర్షణకు లోనవుతున్నారో భావోద్వేగభరితంగా చూపించారు.

దర్శకుడు భరత్ కమ్మ కథనాన్ని చాలా నెమ్మదిగానడిపించారు. దాంతో సినిమా ఆద్యంతం సాగదీసినట్లుంటుంది. కథకు ఆయువుపట్టుగా నిలిచిన కీలకమైన పాయింట్‌లో కొత్తదనం లేదు. ఈ రొటీన్ పాయింట్‌ను ఆసక్తికరంగా చెప్పడంలో దర్శకుడు చాలా తడబడిపోయారు. ద్వితీయార్థం చాలా సన్నివేశాల్లో ఫ్లో కనిపించదు. నాయకానాయిక విడిపోయి మళ్లీ కలుసుకునే సన్నివేశాల్లో ఎమోషన్, సంఘర్షణ సరిగా పండలేదు. ప్రేమకు, కలలకు మధ్య నలిగిపోయే యువతిగా రష్మిక మందన్న పాత్రను భావోద్వేభరితంగా తీర్చిదిద్దడంలో దర్శకుడు కన్ఫ్యూజన్‌కు లోనయ్యారు. విజయ్ ఎందుకోసం పోరాటం చేస్తున్నాడో అర్థం కాదు. ప్రతి సన్నివేశాన్ని పోయెటిక్, అందంగా మలచాలనే దర్శకుడి తాపత్రయం చాలా చోట్ల డామినేట్ చేస్తూ కథను పక్కదారి పట్టించింది. కథలో లోపాలున్న విజయ్ దేవరకొండ తన నటనతో సినిమాను నిలబెట్టే ప్రయత్నం చేశాను. తనదైన శైలి నటన, హావభావాలు, డైలాగ్ డెలివరీతో ప్రతి సన్నివేశాన్ని రక్తి కట్టించడానికి కృషిచేశారు.

విప్లవకారుల కుటుంబంలో జన్మించిన బాబీ అనే విద్యార్థి నాయకుడిగా ఈ సినిమాకు వన్‌మెన్‌షోగా నిలిచారు విజయ్ దేవరకొండ. ఆవేశపూరితుడిగా, ప్రేమ కోసం తపించే వ్యక్తిగా, ప్రియురాలి కోసం పోరాడే కామ్రేడ్‌గా భిన్న పార్శ్వాలున్న పాత్రలో ఒదిగిపోయారు. లిల్లీ అనే మహిళా క్రికెటర్‌గా రష్మిక మందన్న భావోద్వేగభరిత పాత్రలో చక్కటి అభినయాన్ని ప్రదర్శించి మెప్పించింది.విజయ్ స్నేహితులుగా కనిపించిన వారంతా సహజ నటనను కనబరిచారు.

జస్టిన్ ప్రభాకరన్ ఈ సినిమా మరో హీరోగా నిలిచాడు. సంగీతం, నేపథ్య సంగీతంతో కథలో ప్రతి ఒక్కరిని లీనం అయ్యేలా చేశారు. మెలోడీ ప్రధానంగా ఆయన స్వరపరచిన కడలల్లే, నీ నీలి కన్నుల్లోనాతో పాటు ప్రతి పాట మెప్పిస్తుంది. దర్శకుడి ఆలోచనలకు అనుగుణంగా దృశ్యకావ్యంలా తీర్చిదిద్దేందుకు ఛాయాగ్రాహకుడు సుజీత్‌సారంగ్ కృషిచేశారు. పాటలన్నీ అందంగా తెరకెక్కించారు. నిర్మాణ విలువలు బాగున్నాయి. విజయ్ దేవరకొండ అభిమానుల్ని ఈ సినిమా సంతృప్తిపరుస్తుంది. యువతలో అతడికి ఉన్న క్రేజ్, పాపులారిటీతో సినిమాకు చక్కటి ఓపెనింగ్స్‌ను రాబట్టింది. నాలుగు రోజులు వరుసగా సెలవులు రావడం కలిసివచ్చింది. విజయ్‌దేవరకొండ ఇమేజ్ కమర్షియల్‌గా ఈ సినిమాను ఏ మేరకు గట్టెక్కిస్తుందో చూడాలి.

## వాల్మీకి చిత్రంలో
# ఐటెం సాంగ్స్ చేయనున్న తెలుగమ్మాయి

వరుణ్ తేజ్ ప్రధాన పాత్రలో హరీష్ శంకర్ తెరకెక్కించిన చిత్రం వాల్మీకి. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 13న విడుదల చేయనున్నట్టు పోస్టర్ ద్వారా తెలిపారు మేకర్స్. ఇప్పటికే చిత్రానికి సంబంధించి విడుదలైన పోస్టర్, టీజర్స్‌ని బట్టి చూస్తుంటే ఈ చిత్రం ప్రేక్షకులకి మంచి ఎంటర్‌టైనర్‌ని అందిస్తుందని ఖచ్చితంగా చెప్పవచ్చు. క్రూరమైన లుక్‌తో, గుబురు గడ్డం.. మాసిన జుట్టుతో కళ్లకు కాటుక పెట్టుకుని, ముఖంపై గాట్లుతో కరుడు గట్టిన వ్యక్తిలా వరుణ్ అదరగొడుతున్నాడు . మాస్ ప్రేక్షకులకి ఈ చిత్రాన్ని మరింత దగ్గరగా చేర్చేందుకు ఇందులో ఒక ఐటమ్ సాంగ్‌ని కూడా పెడుతున్నారు. ఈ ఐటమ్ సాంగ్‌లో డింపుల్ హయాతి అనే తెలుగమ్మాయి తన స్టెప్పులతో అదరగొట్టనుందట. ఈ అమ్మాయి ప్రభుదేవ, తమన్నాలు నటించిన 'దేవి-2'లో కీలక పాత్ర పోషించింది. వాల్మీకి చిత్రం తమిళంలో సంచలన విజయం సాధించిన 'జిగర్తాండ' చిత్రానికి రీమేక్‌గా రూపొందుతుంది. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రానికి మిక్కి జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. 14 రీల్స్ సంస్థపై రామ్ ఆచంట, గోపి ఆచంటలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# శక్తిమంతమైన వీడియో సహకారం దిశగా 'ఆవాయా' తదుపరి అడుగు



హైదరాబాద్, జూలై 26: భారతదేశంలో కమ్యూనికేషన్లను సరళతరం చేసే సొల్యూషన్స్ విస్తరణలో ప్రపంచ అగ్రశ్రేణి సంస్థగా నిలిచిన 'ఆవాయా' అవాయా ఐఎక్స్ కొలాబరేషన్ యూనిట్ సీయూ 360, క్లౌడ్ ఆధారిత వీడియో కాన్ఫరెన్స్ అండ్ కొలాబరేషన్ సర్వీస్ సంస్థ 'ఆవాయా ఈక్వినోక్స్ మీటింగ్స్ ఆన్‌లైన్ (ఎఇఎంఒ) సర్వీసులను ఆవిష్కరించింది. 'సీయూ 360' యూనిట్ పూర్తిస్థాయి హెచ్‌డీ 1080 పీ సామర్థ్యంతోపాటు ఆల్ ఇన్ వన్ వీడియో కొలాబరేషన్‌గా నిలిచింది. సబ్ స్క్రిప్షన్ ఆధారిత సర్వీస్ 'ఎఇఎంఒ' తన వినియోగదారులకు అపరిమిత వర్చువల్ సేవలు అందించడంలో ముందు ఉంటుంది.

ఆవాయా ఎక్వినోక్స్ మీటింగ్స్ ఆన్ లైన్ (ఎఇఎంఒ) సబ్ స్క్రిప్షన్ పొందాలని భావించే వారికి తొలి మూడు నెలలు ఉచితం. తర్వాత వీడియో కాన్ఫరెన్స్ వేదికను అందుబాటులోకి తెచ్చినందుకు ప్రతి నిమిషానికి 10 పైసల చొప్పున చార్జి వసూలు చేస్తుంది. ఈ సందర్భంగా అవాయా మేనేజింగ్ డైరెక్టర్ విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ 'అవాయా ఎల్లవేళలా తన సేవల అనుభవాల్లో పరివర్తన తేవడంతోపాటు సమర్థవంతమైన సేవల్లో పోటీతత్వం, సమర్థతలో నూతన మైలురాళ్లను చేరుకునేందుకు నిత్యం ప్రయత్నిస్తూ ఉంటుంది. క్లౌడ్ ఆధారిత వర్క్‌పేస్ ఎక్స్‌పీరియన్సెస్‌లో ఇంటెలిజెంట్ హడిల్ రూమ్ సెటప్స్‌కు అవాయా సొల్యూషన్స్ సరైంది' అని పేర్కొన్నారు.

'వ్యక్తిగత వర్క్ గ్రూప్ గల సంస్థలకు, చిన్న స్థాయి నుంచి మధ్య స్థాయి వ్యాపారాలకు, భారీ ఎంటర్ ప్రైజెస్‌తో సహకారానికి అవాయా 'సీయూ 360' ఉపయోగకరంగా ఉంటుంది. అవాయా ఎక్వినోక్స్ మీటింగ్స్ ఆన్‌లైన్ (ఎఇఎంఒ) తన కస్టమర్లకు స్నేహపూర్వకంగా, ఉత్పత్తిదాయక సామర్థ్యంతో కూడిన టీంలను అందుబాటులోకి తేవడంలో చాలా ఆకర్షణీయ ప్రతిపాదనగా ఉంటుంది' అని అవాయా మేనేజింగ్ డైరెక్టర్ విశాల్ అగర్వాల్ తెలిపారు.

# డెంగ్యూ నివారణకు రూ.299తో 'బజాజ్ ఫైనాన్స్' బీమా

హైదరాబాద్, జూలై 26, 2019: ప్రతి ఏటా దేశవ్యాప్తంగా దోమలతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు విస్తరిస్తున్నాయి. 2018లో దేశవ్యాప్తంగా 89,974 డెంగ్యూ కేసులు నమోదు కాగా, 144 మంది మరణించారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఆరుగురు మరణించగా, 6,210మంది డెంగ్యూ వ్యాధి బారీన పడ్డారు. ఈ గణాంకాలు గత నెల 21న లోక్‌సభలో ప్రభుత్వం చేసిన ప్రకటన ఇది. డెంగ్యూ వ్యాధి చికిత్స కోసం భారీ మొత్తంలో ఖర్చవుతోంది. తీవ్రమైన కేసుల్లో రోగులు ఆసుపత్రుల్లో చికిత్స కోసం వారాల తరబడి బస చేయాల్సి వస్తోంది. అనారోగ్య సమస్యల పరిష్కారం కోసం ఖర్చయ్యే నిధుల కోసం ఆర్థికంగా సిద్ధం కావాల్సి ఉంటుంది. అందుకు డెంగ్యూ వ్యాధి నివారణ కోసం బజాజ్ ఫైనాన్స్ సర్వీసెస్ సంస్థ తన వినియోగదారులకు బీమా సౌకర్యం అందుబాటులోకి తెచ్చింది.

ఏటా రూ.299 చెల్లిస్తే రూ.50 వేల బీమా సౌకర్యం లభిస్తుంది. డెంగ్యూ వ్యాధి నివారణ కోసం 15 రోజుల పాటు హాస్పిటల్‌లో చికిత్స పొందే వెసులుబాటు లభిస్తుంది. వ్యాధి డయాగ్నసిస్, హాస్పిటలైజేషన్ చార్జీలు లభిస్తాయి. కిడ్నీలో రాళ్లు, ఇన్ ఫెక్షన్, రోడ్ ట్రిప్ కవర్, ట్రెక్కర్, మాన్ సూన్ కవర్, వాలెట్ కేర్ కల్పిస్తూ బజాజ్ ఫైనాన్స్ సర్వీసెస్ సంస్థ బీమా వసతి కల్పిస్తోంది.

# కల్తీ విత్తన విక్రేతలపై చర్యలు

నిజామాబాద్,జూలై26(ఆర్ఎన్ఎ): కల్తీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసి జైళ్లకు పంపించనున్నట్లు అధికారులు హెచ్చరించారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి పట్టణాల నుంచి పల్లెలకు పంపించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తుందని వెల్లడించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత అత్యధిక బడ్జెట్‌ను రైతాంగ సంక్షేమానికి కేటాయించారని తెలియచేశారు. హరితహారం కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు కృషి చేయాలని అన్నారు.రైతులు తమ ఖాళీ భూముల్లో వీటిని నాటాలన్నారు. ఆయా జిల్లాలకు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తిచేయాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కకు జియోట్యాగింగ్ ద్వారా అనుసంధానం చేయాలని, ప్రతి గ్రామాన్ని హరితవనాలుగా తీర్చిదిద్దేందుకు హరిత బిగ్రేడ్‌లను నియమించి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఉపాధ్యాయ ఖాళీలపై వివరాలు ఇవ్వండి

## తెలుగు రాష్ట్రాలకు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ,జూలై26(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలపై మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు ఆదేశించింది. మూడు రోజుల్లో నివేదిక ఇవ్వకపోతే ఇరురాష్ట్రాల సీఎస్‌లు తమ ఎదుట హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఏపీ, తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి సంబంధించి దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇదివరకే దీనిపై నివేదిక ఇవ్వాలని సుప్రీం కోర్టు ఇరురాష్ట్రాలను ఆదేశించింది. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు వాయిదా కోరాయి. దీంతో తాజాగా విచారణ చేపట్టిన అత్యున్నత ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయడం లేదని ఫిర్యాదులు ఉన్నాయి.

# మాజీ మంత్రి అఖిల ప్రియకు షాక్..!

**- బీజేపీలో చేరిన భూమా సోదరులు**

**- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన వర్కింగ్ ప్రెసిడెంట్ నడ్డా**

న్యూఢిల్లీ, జులై26(ఆర్ఎన్ఎ) : మాజీ మంత్రి భూమా అఖిలప్రియకు సోదరులు షాకిచ్చారు. టీడీపీని వీడి బీజేపీ గూటికి చేరిపోయారు. శుక్రవారం బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా సమక్షంలో.. భూమా కిషోర్‌రెడ్డి, మహేష్‌రెడ్డిలు కాషాయ కండువా కప్పుకున్నారు. భూమా సోదరుల్ని నడ్డా సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆళ్లగడ్డలో భూమా వర్గాన్ని కాపాడుకునేందుకే బీజేపీలో చేరామని కిషోర్ రెడ్డి అన్నారు. కర్నూలు జిల్లాతో పాటూ రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత భూమా వర్గంలో విభేదాలు మొదలైనట్లు తెలుస్తుంది. మాజీ మంత్రి అఖిలప్రియ భర్త జోక్యం ఎక్కువైపోతుందని భూమా సోదరుల్లో వ్యతిరేకత వ్యక్తమయ్యిందనే ప్రచారం జరుగుతుంది. భూమా నాగిరెడ్డి సోదరుడు భాస్కర్‌రెడ్డి కుమారుడైన మాజీ ఎంపీపీ కిషోర్‌రెడ్డి కొద్ది రోజులుగా అఖిలప్రియపై అసంతృప్తితో ఉన్నారని జిల్లాలో ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనూ బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్ ప్రారంభించడంతో అటువైపుగా అడుగులు వేశారట. కిషోర్‌రెడ్డితో ఏపీ బీజేపీ నేతలు టచ్‌లోకి వెళ్లారట. కొద్దిరోజులుగా ఆయన పార్టీ నేతలతో మంతనాలు జరుపుతున్నారని ప్రచారంలో ఉండగా.. చివరికి బీజేపీలో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో అఖిలప్రియకు షాకిస్తూ.. భూమా వర్గంలో చీలిక తెస్తూ కాషాయ కండువా కప్పుకున్నారు. దీంతో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో టీడీపీకి గట్టి షాక్ తగిలిందని స్థానిక నేతలు చర్చించుకుంటున్నారు

# మరో వివాదంలో మాజీ సీఎం సిద్దరామయ్య

## తమను దూరంగా ఉంచిదే ఆయన అన్న రెబల్ ఎమ్మెల్యేలు
## వారి వ్యాఖ్యలపై సిద్దూ మండిపాటు

బెంగళూరు,జూలై26 (ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరో వివాదంలో చిక్కుకున్నారు. తమ అసమ్మతి వెనక ఉంది సిద్దరామయ్యేనని ముంబైలో బసచేసిన ఎమ్మెల్యేలు సంచలన వ్యాఖ్యలు చేశారు. మూడు వారాల క్రితం కూటమి ప్రభుత్వానికి చెందిన 16 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన వెనక ఉంది సిద్దరామయ్యేనని అసమ్మతి ఎమ్మెల్యే శివరామ్ హెబ్బార్ ఆరోపించారు. ఆయనే తమని పార్టీకి దూరంగా ఉండాలని సూచించారని మీడియా సమావేశంలో చెప్పుకొచ్చారు. ఇప్పుడు ప్రభుత్వం కూలిపోయిన తర్వాత తమపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. కర్ణాటకలో నెలకొన్న అనిశ్చితికి సిద్ధరామయ్యే కారణం. పార్టీకి దూరంగా ఉండమని కొద్ది రోజుల క్రితం ఆయన మాకు చెప్పారు. కానీ ఇప్పుడు మమ్మల్నే నిందిస్తున్నారు. మేమంతా ఏకతాటిపై ఉన్నాం. అందరం కలిసే నిర్ణయం తీసుకున్నాం. మేం భాజపాలో చేరుతున్నామనేది అబద్ధం అని తెలిపారు.తామెవరిని బిజెపి ప్రలోభపెట్టలేదని కూడా స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై సిద్ధరామయ్య స్పందించారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించడానికే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇంకోసారి ఇలాంటి ఆరోపణలు చేస్తే వారికి గట్టిగా బుద్ధి చెప్తానని ట్వీట్ చేశారు. అయితే ఆయన ఇలాంటి వివాదంలో చిక్కుకోవడం ఇది రెండోసారి. బలపరీక్ష రోజు చర్చ తుది అంకానికి చేరిన సమయంలో వ్యక్తిగతంగా చర్చించుకోవడానికి సమయం కావాలని కుమారస్వామి, ఉప ముఖ్య మంత్రి పరమేశ్వర అసెంబ్లీ హాల్ నుంచి బయటకు వెళ్లారు. ఆ సమయంలో కాంగ్రెస్-జేడీఎస్ నేతలు సిద్ధరామయ్య వద్దకు వెళ్లి మాట్లాడారు. ఆ సందర్భంగా రాజీనామా చేసి ఆయనను వెళ్లిపొమ్మని చెప్పండి' అంటూ ఆయన అన్న మాటలు అక్కడే ఉన్న మైక్రోఫోన్ల ద్వారా వినిపించాయి. దీంతో కూటమి ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవడానికి ఆయన గట్టిగా ప్రయత్నించలేదనే విమర్శలు ఎదుర్కొన్నారు. తాజాగా ఇప్పుడు ఎమ్మెల్యేల వ్యవహారంతో ఆయన పాత్రపై సర్వత్రా చర్చ జరుగుతోంది. అలాగే శివరాం వ్యాఖ్యలపై కన్నడ రాజకీయాల్లో పెను దుమారం చెలరేగుతోంది. విశ్వాస పరీక్షలో ప్రభుత్వాన్ని కాపాడటానికి తనవంతు కృషి చేశానని సిద్దూ చెప్పుకొచ్చారు. కాగా కార్ణాటక సంక్షోభ అనంతరం స్థానిక నేతలపై రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ పతనం వెనుక సిద్ధరామయ్య ఉన్నారన్న వస్తున్న వార్తలు కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి కూడా వెళ్లాయి. దీంతో ఆయనపై పార్టీ గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.

# గాంధీ ఆస్పత్రి సిబ్బంది టిక్‌టాక్ వీడియో

**- పనులు మానేసి వీడియోలు తీసుకున్న సిబ్బంది**

**- వైరల్‌గా మారిన వీడియో**

**- ఇద్దరిని సస్పెండ్ చేసిన సూపరింటెండెంట్**

హైదరాబాద్, జులై26(ఆర్ఎన్ఎ) : ప్రభుత్వ ఆఫీసుల్లో పనులు మానేసి టిక్‌టాక్ వీడియోలు చేస్తూ కాలక్షేపం చేస్తున్న ఘటనలు ఇటీవల పెరిగిపోయాయి. ఇటీవల ఖమ్మం కార్పొరేషన్ ఉద్యోగులు పనులు మానేసి టిక్‌టాక్ వీడియోలు చేస్తూ అడ్డంగా దొరికిపోయిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు 11 మంది సిబ్బందిపై వేటు వేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు మానేసి టిక్‌టాక్ వీడియోలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీచేశారు. తాజాగా టిక్‌టాక్ రోగం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి చేరింది. రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రభుత్వాసుపత్రిగా పేరుగాంచిన గాంధీ ఆస్పత్రికి నిత్యం వేలాది మంది రోగులు చికిత్స కోసం వస్తుంటారు. ఓపక్క రోగులందరికీ వైద్యం అందించడానికి సరిపడా వైద్య సిబ్బందిలేక ఇబ్బందులు పడుతుంటే మరో పక్క కొందరు సిబ్బంది మాత్రం పనులు మానేసి టిక్‌టాక్ వీడియోలు చేస్తూ కాలం గడిపేస్తున్నారు. గాంధీ ఆస్పత్రిలోని ఫిజియోథెరపీ విభాగంలో ఇద్దరు వైద్య సిబ్బంది విధులు మానేసి చేసిన టిక్‌టాక్ వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ విషయం ఉన్నతాధికారులకు చేరడంతో వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆ ఇద్దరినీ సస్పెండ్ చేస్తున్నట్లు గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రకటించారు. టిక్‌టాక్ వీడియోల వ్యవహారంపై రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చికిత్స కోసం తామెంతో దూరం నుంచి వ్యయప్రయాసలకోర్చి ఆస్పత్రికి వస్తుంటే సిబ్బంది పట్టించుకోకుండా ఇలాంటి వీడియోలు తీసుకుంటూ గడిపేస్తున్నారని మండిపడుతున్నారు. ఇకపై ఎవరూ ఇలాంటి పనులు చేయకుండా అధికారులు కఠినచర్యలు తీసుకోవాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.

# సుప్రీంను క్షమాపణలు కోరిన రోహిత్గీ

న్యూఢిల్లీ,జూలై26 (ఆంఎన్ఎ): కర్ణాటక రెబల్ ఎమ్మెల్యేల తరపు న్యాయవాది ముఖుల్ రోహత్గీ సుప్రీం కోర్టును క్షమాపణలు కోరారు. న్యాయస్థానంలో గురువారంనాటి వాదనల సందర్భంగా ఆయన హాజరుకాలేకపోయారు. దీంతో సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని క్షమాపణలు అభ్యర్థించగా.. ప్రధాన న్యాయమూర్తి మన్నించారు. కర్ణాటక శాసనసభలో వెంటనే అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలని మనవి చేస్తూ రెబల్ ఎమ్మెల్యేలు సోమవారం సుప్రీం కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఇంతలో మంగళవారం కుమారస్వామి ప్రభుత్వం అసెంబ్లీలో

## మన్నించిన దర్మాసనం

బలపరీక్షలో ఓడిపోవడం... ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడం చకచకా జరిగిపోయాయి.

దీంతో తమ అర్జీని వెనక్కి తీసుకోవడానికి అనుమతించాలంటూ సుప్రీం కోర్టును రెబల్ ఎమ్మెల్యేలు అభ్యర్థించిన సమయంలో .. అత్యున్నత న్యాయస్థానం ఘాటైన వ్యాఖ్యలు చేసింది. మీకు అవసరం వచ్చినప్పుడు అర్ధరాత్రైనా మేల్కొలుపుతారు. కానీ విచారణకు మేము పిలిచినప్పుడు.. రావడానికి మీకు టైం లేదా, అంతా మీ ఇష్టమేనా..అంటూ వారి తరపు న్యాయవాది ముఖుల్ రోహత్గీకి అక్షింతలు వేసింది. ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేయడంతో రోహత్గీ క్షమాపణలు కోరారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.